

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 28-4-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 29 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 8.22 తదుపరి పంచమి; నక్షత్రం: మూల తె. 4.49 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: మ.12.35-2.12, తె.3.11-4.49; దుర్ముహూర్తం: సా.4.50-5.40; అమృతఘడియలు: రా.10.19-11.56; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.30 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ అండతో కేసీఆర్ స్కెచ్!

అధికారంలో ఉన్నప్పుడు నియంతలుగా ప్రవర్తిస్తూ కనుసైగతో రాజకీయాలను శాసించగలమని విర్రవీగిన రాజకీయ నాయకులకు ఎన్నికల్లో ఓడిపోగానే ప్రజాస్వామ్య విలువలు, హక్కులు గుర్తుకొస్తాయి.

అధికారంలో ఉన్నప్పుడు మీడియాను అణగదొక్కే ప్రయత్నం చేసిన కేసీఆర్‌కు, ఇప్పుడు కూడా తత్వం బోధపడలేదు. ప్రభుత్వ చర్యలను విమర్శించడం, ప్రశ్నించడమే తెలంగాణ ద్రోహం అన్నట్టుగా విరుచుకుపడిన ఆ పెద్దమనిషి ఇప్పుడు కాకా మీడియా, బాకా మీడియా అంటూ మీడియాను నిందించే దుస్సాహసానికి పాల్పడ్డారు.

తాను అధికారం నుంచి తప్పుకొన్న ఈ ఐదు నెలల్లోనే తెలంగాణ గోస పడుతోందని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తన పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కేసీఆర్ భ్రమిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని తాను మాత్రమే ముఖ్యమంత్రిగా పాలించగలనని, మిగతావాళ్లు ముఖ్యమంత్రులుగా పనికిరారని కేసీఆర్ ఇప్పటికీ భావించడం విడ్డూరంగా ఉంది. ఎత్తులు, కుయుక్తులతో త్వరలోనే తాను మళ్లీ అధికారంలోకి వస్తానని కేసీఆర్ భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని కేసీఆర్ ఆషామాషీగా అనలేదని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల వరకు వేచి చూడకుండా మధ్యలోనే తాను మళ్లీ అధికారంలోకి రావాలంటే జగన్మోహన్ రెడ్డి సహకారం అవసరమని ఆయన గుర్తించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చాలంటే జగన్ మద్దతు అవసరమని భావిస్తున్నారు.



కొత్త పలుకు

రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక శాఖలు నిర్వహిస్తున్న ఒక మంత్రి ఏపీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు అని అందరికీ తెలిసిందే. జగన్ సహకారంతో ఆ మంత్రి ద్వారా కాంగ్రెస్‌లో చీలిక తెచ్చి రేవంత్ ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి రావాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ స్కెచ్ అమలవుతుందా? అంటే చెప్పలేం.

కేసీఆర్‌ను మళ్లీ సీఎంని చేయడం కోసం ఆ మంత్రి రిస్కు తీసుకుంటారా? అన్నది కీలక ప్రశ్న. జగన్ మీద అభిమానంతో తన రాజకీయ భవిష్యత్తును ఆయన ప్రమాదంలోకి నెట్టుకుంటారని కూడా భావించలేం. కేసీఆర్ ఆలోచనల గురించి తెలిసిన తర్వాత నేను సేకరించిన సమాచారం ప్రకారం.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టి కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయాలన్న ఆలోచన ఆ మంత్రికి లేదు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని ఇటీవలి కాలంలో కేసీఆర్ తరచూ చెప్పుకోవడం ఈ స్కెచ్‌లో భాగమే. కేసీఆర్, జగన్ కలిసి తెర వెనుక చేస్తున్న ఆలోచనల గురించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియక కాదు. తెలుసు కనుకే తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కుట్ర జరుగుతోందని ఆయన తాజాగా ఆరోపిస్తున్నారు. నిన్నటి వరకు ప్రభుత్వాన్ని టచ్ చేయగలరా? అని సవాలు విసురుతూ వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇటీవల మాత్రం తన ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి కుట్ర జరుగుతోందని చెప్పడం గమనార్హం.

4

మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రేవంత్ ప్రభుత్వాన్ని ఏడాది తర్వాత పడగొడతామని తెలంగాణలో బీజేపీ ముఖ్యుడొకరు అంతరంగిక సంభాషణల్లో చెబుతున్నారు. మొత్తంగా చూస్తే రేవంత్ పతనం కోసం ఇటు కేసీఆర్, అటు బీజేపీ నేతలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ ఎంపీ స్థానాలను గెలుచుకొని తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాల్సిన అవసరం రేవంత్‌కు ఏర్పడింది.

ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వస్తే తెలంగాణలో రేవంత్‌కు పరోక్ష మద్దతు లభిస్తుంది. ఇది సహజంగానే కేసీఆర్‌కు నచ్చదు. అందుకే జగన్ మళ్లీ గెలవాలని కోరుకోవడంతో పాటు ఆయన సహకారంతో రేవంత్ ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ సీఎం కావాలని కేసీఆర్ తలపోస్తున్నారు.

తన ప్రస్తుత దుస్థితికి ఆత్మపరిశీలన చేసుకోకుండా ప్రజలు అత్యాశకు పోయారని నిందించడం ద్వారా కేసీఆర్ ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే అడ్డదారిలో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఇప్పుడు ప్రవచనాలు చెప్పే ప్రయత్నం చేసే బదులు కోల్పోయిన ప్రజా విశ్వాసాన్ని తిరిగి పొందడానికి కేసీఆర్ ప్రయత్నిస్తే ఆయనకే మంచిది.



బీసీ, ఎస్సీ, ఎస్టీలపై బీజేపీ సర్జికల్ స్ట్రైక్

మూలవాసులైన వారి రిజర్వేషన్ల తొలగింపునకు కుట్ర

1990లో మండల్ కమిషన్ వ్యతిరేక ఉద్యమానికి ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం

2025 నాటికి భారత్‌ను మతరాజ్యంగా మార్చటమే ఆ సంస్థ లక్ష్యం

మూడింట రెండొంతుల మెజారిటీకే బీజేపీ 400 సీట్లు అడుగుతోంది

అప్పుడు రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మం

ఈ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి

దీనిపై కేసీఆర్ వైఖరి ఏమిటి?

నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గాల్లోనే బీఆర్‌ఎస్ పార్టీకి రెండో స్థానం

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 14 సీట్లు ఖాయం

దక్షిణాన 'ఇండియా'కు వందకుపైనే..

పెద్దమ్మ తల్లి సాక్షిగా పంద్రాగస్టులోపు రుణమాఫీ.. మీడియాతో సీఎం రేవంత్

1925లో ఆర్‌ఎస్‌ఎస్‌ను ఏర్పాటు చేసినప్పుడు.. వందేళ్లలో భారత్‌ను హిందూ దేశంగా మార్చాలని, రిజర్వేషన్లు వంటి వాటిని సంపూర్ణంగా తొలగించాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. 2025 కల్లా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి.. రిజర్వేషన్లను రద్దు చేసి, దేశాన్ని హిందూ దేశంగా మార్చాలని మోదీ, అమిత్‌షా కంకణం కట్టుకున్నారు. ఈ కుట్రను తిప్పి కొట్టేందుకు రాహుల్‌గాంధీ ప్రయత్నం చేస్తున్నారు. అనేక విషయాలపై మాట్లాడే కేసీఆర్ దీనిపై ఎందుకు స్పందించడం లేదు?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశ మూలవాసులైన దళితులు, గిరిజనులు, ఓబీసీలపైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సర్జికల్ స్ట్రైక్ చేస్తున్నారని, ఈ కుట్రను అర్థం చేసుకొని తిప్పి కొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో రిజర్వేషన్లను రద్దు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీలను కార్పొరేట్ కంపెనీలకు బానిసలుగా మార్చాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని, ఇందుకోసమే 400 సీట్లలో గెలిపించాలని ప్రజలను కోరుతోందని చెప్పారు. 2025 కల్లా రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని అమలు చేయాలని, దేశాన్ని హిందూ మత రాజ్యంగా తయారు చేయాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ టార్గెట్ అని తెలిపారు. దీన్ని అమలు చేసేందుకు మోదీ, అమిత్‌షా కంకణం కట్టుకున్నారన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమంగానో, దౌర్జన్యంగానో ఏదోరకంగా 400 సీట్లకు చేరుకుని రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలపైనే దాడి చేయాలని మోదీ, అమిత్‌షా భావిస్తున్నారని

మిగతా 13వ పేజీలో...

దేశం కోసం బీజేపీని అడ్డుకోవాల్సిందే

13

మనం కొట్లాడుకుంటే ఆ పార్టీకి లబ్ధి

కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ చేతులు కలపాలి

సీపీఎం నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాస్వామ్య విలువలకు మోదీ తిలోదకాలు

మంగళసూత్రాల వ్యాఖ్య.. స్థాయికి తగదు

కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి.. ఖమ్మంలో తుమ్మల, పొంగులేటి



6 గ్యారెంటీలు అమలైనట్లు నిరూపిస్తే.. పోటీ నుంచి

తప్పుకొంటా

- లేదంటే కాంగ్రెస్ అభ్యర్థులు వైదొలుగుతారా?.. రోజు, వేదిక మీరే నిర్ణయించండి
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలవన్నీ డ్రామాలు.. నన్ను ఓడించేందుకు చీకటి ఒప్పందాలు
- ఓటుకు వెయ్యి ఇచ్చి గెలవాలని కాంగ్రెస్ యత్నం.. హిందువులను కేసీఆర్ కించపరిచారు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ వ్యాఖ్యలు

కరీంనగర్/సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్లు నిరూపిస్తే తాను పోటీ నుంచి తప్పుకొంటానని, నిరూపించకపోతే ఆ పార్టీ అభ్యర్థులంతా వైదొలుగుతారా అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. శనివారం కరీంనగర్‌లో పలువురు బీజేపీలో చేరిన సందర్భంగా, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు (సోమవారం)లోపు నిరూపిస్తే తాను పోటీ నుంచి తప్పుకొంటానని, ఎన్నికలలోపు నిరూపిస్తే తాను స్వయంగా కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తాననన్నారు. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతలా భావిస్తామన్న మాటకు కాంగ్రెస్ కట్టుబడితే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. తేదీ, సమయం, వేదిక వారే నిర్ణయించవచ్చని, అమరవీరుల స్తూపం, సర్దార్ పటేల్ విగ్రహం, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం... వీటిలో ఎక్కడికైనా వచ్చేందుకు సిద్ధమన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై చర్చ జరగకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని ఒకాయన అంటుంటే.. నిజంగా చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని మరొకరు అంటున్నారన్నారు. రుణమాఫీపై వారు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటూ బ్రేకింగుల కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని అన్ని మతాలు, వర్గాలను

మిగతా 13వ పేజీలో...

అందరికీ న్యాయం జరిగేలా

కులగణన

అధ్యయనం అవసరం: లక్ష్మణ్

9, 10న సైతం మోదీ టూర్

1న చార్మినార్‌లో షా రోడ్‌షో

13

అమిత్ షా వీడియో డీప్ ఫేక్

రిజర్వేషన్లపై తప్పుదోవ పట్టించేలా ప్రచారం

టీపీసీసీపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

30న పదో తరగతి ఫలితాలు

ఉదయం 11 గంటలకు విడుదల

ఐదు లక్షల మంది విద్యార్థుల హాజరు

14



ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా మారిన వనపర్తిలోని రహదారి

నెత్తిన నిప్పులు

- ఐదు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఎండ
- జమ్మికుంటలో రెండో రోజూ గరిష్ఠ ఉష్ణోగ్రత
- నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆరెంజ్ అలర్ట్
- పలుచోట్ల తేలికపాటి వానలకు అవకాశం

3

బెట్టింగ్‌కు బలి



ఆ ఉచ్చులో పడి రూ.25 లక్షల అప్పు

రుణదాతల వేధింపులతో మనస్తాపం

సదాశివపేటలో విద్యార్థి ఆత్మహత్య



నాగర్‌కర్నూల్ రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో పార్టీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్

మోదీకి ఓటేస్తే వినాశనమే

రాష్ట్రంలో దారుణంగా విఫలమైన కాంగ్రెస్ సర్కార్

కాంగ్రెస్, బీజేపీలకు ఎన్నికల్లో కర్రు కాల్చి వాతపెట్టాలి

నాగర్‌కర్నూల్ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ మోదీకి ఓటేస్తే వినాశనం తప్పదని బీఆర్‌ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ హెచ్చరించారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దొందూ దొందేనని.. తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆయన వ్యాఖ్యానించారు. పోరుబాట బస్సు యాత్ర సందర్భంగా శనివారం సాయంత్రం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మాట్లాడారు. విభజన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలను దారుణంగా వంచించారని విమర్శించారు. "వ్యవసాయ రంగానికి అందిస్తున్న

మిగతా 14వ పేజీలో...

14

ఇస్మార్ట్ కేసీఆర్..!

ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో గులాబీ నేత ఖాతాలు

పాలమూరులో భోజనంచేస్తుండగా కరెంట్ కట్!

విద్యుత్తు కోతలపై ప్రభుత్వంపై విమర్శలతో ట్వీట్

కరెంటు కట్ అసత్య ప్రచారమన్న మంత్రి భట్టి

సీఎం జిల్లాలోనూ కాంగ్రెస్ గెలవదు

అందుకే ఇన్‌చార్జి పదవి నుంచి రేవంత్ వైదొలిగారు

నేను మళ్లీ చెబుతున్నా.. ఆయన బీజేపీలో చేరుతారు

ఈటల అంశంలో వ్యూహాత్మకంగానే మల్లారెడ్డి వ్యాఖ్య

తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్

14 సంవత్సరాలు

గాజాలో శిథిలాల తొలగింపునకు పట్టే సమయం

12

అదికూడా రోజుకు 100 ట్రక్కులను ఉపయోగిస్తేనే..

చ.కి.మీకు. 200 కిలోల మేర పేలని బాంబులు: ఐరాస

ఇజ్రాయెల్ దాడుల్లో 34 వేలకు పెరిగిన మరణాలు



అమెరికాలో 550 మంది అరెస్టు

పాలస్తీనాకు సంఘీభావంగా వర్సిటీల్లో ఆందోళనలు

12

టియర్ గ్యాస్, అశ్విక దళాలు ప్రయోగించినా వెనక్కితగ్గని విద్యార్థులు



రాష్ట్ర జీఎస్టీలో

138% వృద్ధి

2017 ఆగస్టులో రూ. 841 కోట్లు

ఈ ఏప్రిల్‌లో రూ. 2004 కోట్లు

నిరుటికి 11.18% ఎక్కువ

10

ఖజానాకు ఊతంగా ఈ రాబడి



మన బాణం.. బంగారం

హ్యాట్రిక్ స్వర్ణాలతో జ్యోతి సురేఖ రికార్డు

భారత్ ఖాతాలో ఐదు పతకాలు | ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-1

షాంఘై: అంతర్జాతీయ స్థాయిలో పసిడి పతకాలు కొల్లగొట్టడం అలవాటుగా మార్చుకున్న తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ మరోసారి అదరహో అనిపించింది. వరల్డ్ కప్ స్టేజ్-1లో ఏకంగా మూడు స్వర్ణాలు సాధించి కాంపౌండ్ ఆర్చరీలో తనకు ఎదురు లేదని నిరూపించింది. ఈ విజయవాడ ఆర్చర్ వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ విభాగాల్లో విజేతగా నిలిచి అరుదైన పసిడి పతకాల హ్యాట్రిక్ నమోదు చేసింది. ఇక..కాంపౌండ్ ఆర్చరీలో భారత జట్లు మొత్తంగా ఐదు పతకాలు అందుకున్నాయి. కాంపౌండ్ విభాగంలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుతూ మహిళలు, పురుషులు, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో పసిడి పతకాలను క్లీన్‌స్వీప్ చేసింది. ఇందులో రెండింటిలో జ్యోతి సురేఖ పాత్ర ఉండడం విశేషం. శనివారం తొలుత జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ, అదితీ స్వామి, పర్నీత్ కౌర్‌తో కూడిన భారత త్రయం 236-225తో మర్సిల్లా, ఇరినీ, ఎలీ సాతో కూడిన ఇటలీ జట్టును ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. అనంతరం మిక్స్‌డ్ ఫైనల్లో అభిషక్ వర్మ జతగా జ్యోతి సురేఖ 158-157తో లిసెల్, రాబిన్ (ఎస్తోనియా) ద్వయాన్ని ఓడించి రెండో పసిడి పతకాన్ని ఖాతాలో వేసుకుంది.

వ్యక్తిగత విభాగంతో హ్యాట్రిక్: మహిళల వ్యక్తిగత విభాగం ఫైనల్లో వరల్డ్ నెం.2 జోతి సురేఖ, టాప్‌సీడ్ ఆండ్రియా బెకెరా (మెక్సికో) నువ్వా నేనా అనేలా తలపడ్డారు. ఫలితంగా 146-146తో స్కోరు సమమై పోరు షూటా‌ఫ్‌కు దారి తీసింది. అందులోనూ ఇద్దరు 9-9 పాయింట్లతో నిలిచారు. కానీ జ్యోతి బాణం ఇన్నర్ రింగ్‌కు దగ్గరగా ఉండడంతో స్వర్ణ పతకాన్ని ఆమెకు ప్రకటించారు. దాంతో 27ఏళ్ల సురేఖ వరల్డ్ కప్‌లో హ్యాట్రిక్ పసిడి పతకాలు నెగ్గిన రెండో భారత ఆర్చర్‌గా రికార్డులకెక్కింది. 2021లో వరల్డ్ కప్ స్టేజ్-3లో దీపికా కుమారి ఈ ఫీట్ సాధించింది. నిరుడు ఆసియా క్రీడల్లోనూ సురేఖ 3 స్వర్ణాలు గెలిచిన సంగతి తెలిసిందే. పురుషుల టీమ్ కేటగిరీలో అభిషేక్, ప్రియాన్ష్, ప్రథమేష్‌తో కూడిన భారత బృందం 238-231తో నెదర్లాండ్స్‌ను ఓడించి స్వర్ణం చేజిక్కించుకుంది. పురుషుల వ్యక్తిగత విభాగంలో ప్రియాన్ష్ రజత పతకం నెగ్గాడు.

అయినా.. గుర్తింపేదీ!

ఆంధ్రజ్యోతితో జ్యోతి సురేఖ

- ప్రోత్సాహకాలు ఎందుకు ఇవ్వలేదో వారికే తెలియాలి
- ఆ రెండు ఘనతలు అందుకుంటా

ఆర్చరీ ప్రపంచ కప్ కాంపౌండ్ విభాగంలో వరుస పతకాలతో రికార్డుల దుమ్ము దులుపుతున్న జ్యోతి సురేఖ తాను సాధించాల్సిన ఘనతలు ఇంకా రెండున్నాయి అంటోంది. వాటిని త్వరలోనే అందుకుంటానంటున్న ఈ తెలుగమ్మాయి.. ఇప్పటికీ తన ప్రతిభకు తగినంత గుర్తింపు దక్కలేదని బాధపడుతోంది. ఆ మధ్య అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్నకు తనను ఎంపిక చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని అంటోంది. ఇవే కాదు.. క్రీడా ప్రోత్సాహకాల విషయంలోనూ తనకు వివక్ష ఎదురవుతోందంటున్న జ్యోతి సురేఖతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

ఒకేరోజు మూడు స్వర్ణాలు సాధించడం ఎలా అనిపిస్తోంది?

నా 18 ఏళ్ల ఆర్చరీ కెరీర్‌లో ఒకే వరల్డ్‌కప్‌లో ఒకేరోజు మూడు స్వర్ణాలు అందుకోవడం నాకిదే తొలిసారి. భారత్ తరఫున కాంపౌండ్ ఆర్చరీలో ఈ ఘనత సాధించిన తొలి ఆర్చర్‌ను నేనే అని తెలిశాక మరింత ఆనందంగా అనిపించింది. గతంలో ఆసియా క్రీడల్లోనూ మూడు స్వర్ణాలు గెలిచా. ఇక.. నేను సాధించాల్సిన ఘనతలు రెండున్నాయి. ఒకటి ప్రపంచంలోని టాప్-8 ఆర్చర్లు పోటీపడే వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో విజేతగా నిలవడం.. రెండోది వరల్డ్ నెంబర్ వన్ కిరీటం అందుకోవడం. ఈ రెండు త్వరలో సాధిస్తానన్న విశ్వాసముంది.

వరల్డ్‌కప్‌నకు ఎలా సన్నద్ధమయ్యావు?

వరల్డ్‌కప్ ట్రయల్స్ ముందు, జనవరిలో అమ్మ (దుర్గ)కు మేజర్ శస్త్ర చికిత్స అయింది. ఆ సమయంలో నాన్న (సురేంద్ర), నేను చాలా ఆందోళన చెందాం. అమ్మ ప్రస్తుతం కోలుకుంటోంది. ఈ సంఘటన నుంచి తేరుకొని, వరల్డ్‌కప్‌కు సన్నద్ధమవడం కెరీర్‌లోనే నేను ఎదుర్కొన్న క్లిష్టమైన దశ. నేను ఈ వరల్డ్‌కప్‌లో మూడు స్వర్ణాలు సాధించానని తెలియడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు.

క్రీడా పురస్కారం ఖేల్‌రత్న రాకపోవడానికి కారణాలేంటి?



గత ఏడాది సాధించిన పతకాలు చూసి ఈసారి ఖేల్‌రత్న పురస్కారం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నా. కానీ, రాకపోయేసరికి చాలా వేదనకు గురయ్యా. ఎందుకిలా జరిగిందో అర్థం కాలేదు. తెర వెనుక ప్రయత్నాలు చేయడం మా కుటుంబానికి తెలియదు. అయినా పురస్కారాలనేవి ప్రతిభకు గీటు రాయి కాదు. మన కష్టానికి ఒక గుర్తింపు మాత్రమే అని తెలుసుకొని, ఆ బాధ నుంచి బయటపడ్డా. ఈసారైనా ప్రభుత్వం నా కష్టాన్ని, నా విజయాలను గుర్తించి ఇస్తే సంతోషం.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎలా ఉంది?

ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారంపై ఆధారపడి నేను ఈ ప్రయాణం ప్రారంభించలేదు. ప్రపంచ ఆర్చరీలో దేశానికి ఒక గుర్తింపు తీసుకురావాలి, ఆర్చరీ చరిత్రలో నా కంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నా. నా సీనియర్లు, సమకాలిన క్రీడాకారులకు తెలుగు రాష్ట్రాల్లో ఇంటి స్థలాలు, నగదు ప్రోత్సాహకాలు జీఓలతో సంబంధం లేకుండా ఇచ్చారు. నా దగ్గరకు వచ్చేసరికి పాలసీ ప్రకారం ఇస్తామంటారు. ఒక్క నా విషయంలోనే ఇలా ఎందుకు వ్యవహరిస్తారో వారికే తెలియాలి. దీనిపై ఇంకా లోతుగా మాట్లాడితే వివాదమవుతుందేమో!

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

హంపి, హారిక, వైశాలి

ఫిడే మహిళల గ్రాండ్ ప్రీకి

న్యూఢిల్లీ: భారత మహిళల గ్రాండ్‌మాస్టర్స్ త్రయం కోనేరు హంపి, హారిక, ఆర్.వైశాలి ప్రతిష్ఠాత్మక ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ (డబ్ల్యూజీపీ) సిరీస్‌లో చోటు దక్కించుకున్నారు. ఇటీవల క్యాండిడేట్స్ టోర్నీలో హంపి రెండో, వైశాలి నాలుగో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. 2024-25 డబ్ల్యూజీపీ ఎడిషన్ కోసం ఇప్పటికే 14 మంది క్రీడాకారిణులు అర్హత సాధించగా.. మరో ఆరుగురిని ఇతర టోర్నీల ద్వారా నామినేట్ చేస్తారు.

ఫ్రేజర్ ధనాధన్

ప్లేఆఫ్స్ రేసులో ఢిల్లీ ● పోరాడి ఓడిన ముంబై ● తిలక్, డేవిడ్ పోరాటం వృథా



జేక్ ఫ్రేజర్ (27 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సులతో 84)

న్యూఢిల్లీ: ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠగా సాగిన మరో హైస్కోరింగ్ మ్యాచ్‌లో గట్టెక్కిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఐపీఎల్‌లో నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకొంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జేక్ ఫ్రేజర్ (27 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 84) సుడిగాలి అర్ధ శతకంతో శనివారం జరిగిన పోరులో ఢిల్లీ 10 పరుగులతో ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 257/4 స్కోరు చేసింది. స్టబ్స్ (25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 48 నాటౌట్), హోప్ (17 బంతుల్లో 5 సిక్సర్లతో 41), అభిషేక్ పోరెల్ (36) అదరగొట్టారు. ఛేదనలో ముంబై 247/9తో లీగ్‌లో తమ అత్యధిక స్కోరు చేసినా ఓటమి తప్పలేదు. తిలక్ వర్మ (32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63), హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46), టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37) పోరాడారు. రసిక్, ముకేశ్ చెరో 3 వికెట్లు తీశారు.

టాపార్డర్ విఫలం: భారీ ఛేదనలో రోహిత్ (8), ఇషాన్ (20), సూర్యకుమార్ (26) వికెట్లు చేజార్చుకొన్న ముంబై పవర్‌ప్లేలో 65/3తో నిలిచింది. ఈ దశలో తిలక్, కెప్టెన్ హార్దిక్ నాలుగో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యంతో జట్టును మ్యాచ్‌లో నిలిపారు. అయితే, 13వ ఓవర్‌లో పాండ్యా, నేహల్ (4)ను రసిక్ అవుట్ చేయడంతో.. ముంబై 140/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ, తిలక్, డేవిడ్ ఆరో వికెట్‌కు 29 బంతుల్లో 70 రన్స్ జోడించి మ్యాచ్‌పై ఆశలు రేపారు. చివరి 3 ఓవర్లలో విజయానికి 64 రన్స్ కావాలి. ఈ దశలో 18వ ఓవర్‌లో ముకేశ్ బౌలింగ్‌లో డేవిడ్ 6,4,6తో చెలరేగినా.. వికెట్ల ముందు దొరికిపోయాడు. తర్వాత నబి (7) వెనుదిరిగాడు. చివరి ఓవర్‌లో గెలుపునకు 25 పరుగులు అవసరమవగా.. తొలి బంతికి తిలక్ రనౌటవడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.

బాదుడే బాదుడు: ఓపెనర్ ఫ్రేజర్ విధ్వంసానికి తోడు డెత్ ఓవర్లలో స్టబ్స్ మెరుపులు మెరిపించడంతో.. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ తమ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ తొలి బంతి నుంచే విరుచుకుపడింది. ఉడ్ వేసిన మొదటి ఓవర్‌లో ఫ్రేజర్ 4,4,6,4తో 19 రన్స్ పిండుకొన్నాడు. తర్వాత బుమ్రా బౌలింగ్‌లో 4,6 బాదాడు. ఈ క్రమంలో 15 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకొన్న ఫ్రేజర్.. ఈ సీజన్‌లో తన ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును తానే అధిగమించాడు. మరో ఓపెనర్ అభిషేక్ రాణించడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి ఢిల్లీ 92/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. కానీ, 8వ ఓవర్‌లో ఫ్రేజర్‌ను చావ్లా అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత అభిషేక్ వెనుదిరిగినా.. హోప్, పంత్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 29) రెండో వికెట్‌కు 53 రన్స్ జోడించారు. హోప్ స్థానంలో వచ్చిన స్టబ్స్ 18వ ఓవర్‌లో ఉడ్ బౌలింగ్‌లో 5 ఫోర్లు, సిక్స్‌తో 26 రన్స్ రాబట్టాడు. పంత్‌ను బుమ్రా అవుట్ చేసినా.. అక్షర్(11 నాటౌట్), స్టబ్స్ కలిసి స్కోరును 250 దాటించారు.



తిలక్ (32 బంతుల్లో 63)

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x బెంగళూరు	మ.3.30 గం. నుంచి
చెన్నై x హైదరాబాద్	రాత్రి 7.30 గం. నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	8	5	3	0	10	0.972
హైదరాబాద్	8	5	3	0	10	0.577
లఖ్‌నవూ	9	5	4	0	10	0.059
ఢిల్లీ	10	5	5	0	10	-0.276
చెన్నై	8	4	4	0	8	0.415
గుజరాత్	9	4	5	0	8	-0.974
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	9	3	6	0	6	-0.261
బెంగళూరు	9	2	7	0	4	-0.721

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ఢిల్లీ: జేక్ ఫ్రేజర్ (సి) నబి (బి) చావ్లా 84, అభిషేక్ పోరెల్ (సి) ఇషాన్ (బి) నబి 36, హోప్ (సి) తిలక్ (బి) ఉడ్ 41, పంత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 29, స్టబ్స్ (నాటౌట్) 48, అక్షర్ (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 257/4; వికెట్ల పతనం:** 1-114, 2-127, 3-180, 4-235; **బౌలింగ్:** ల్యూక్ ఉడ్ 4-0-68-1, బుమ్రా 4-0-35-1, తుషార 4-0-56-0, చావ్లా 4-0-36-1, హార్దిక్ 2-0-41-0, నబి 2-0-20-1.

ముంబై: ఇషాన్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 20, రోహిత్ (సి) హోప్ (బి) ఖలీల్ 8, సూర్య (సి) విలియమ్స్ (బి) ఖలీల్ 26, తిలక్ (రనౌట్) 63, హార్దిక్ (సి) ముకేశ్ (బి) రసిక్ 46, నేహల్ (సి) పంత్ (బి) రసిక్ 4, డేవిడ్ (ఎల్బీ) ముకేశ్ 37, నబి (సి) హోప్ (బి) రసిక్ 7, చావ్లా (సి) హోప్ (బి) ముకేశ్ 10, ఉడ్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 20 ఓవర్లలో 247/9; వికెట్ల పతనం:** 1-35, 2-45, 3-65, 4-136, 5-140, 6-210, 7-223, 8-234, 9-247; **బౌలింగ్:** లిజాడ్ విలియమ్స్ 3-0-34-0, ఖలీల్ 4-0-45-2, ముకేష్ 4-0-59-3, కుల్దీప్ 3-0-47-0, అక్షర్ 2-0-24-0, రసిక్ 4-0-34-3.



సంజూ శాంసన్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 71 నాటౌట్)

రాజస్థాన్.. తగ్గేదేలె!

శాంసన్, జురెల్ అర్ధసెంచరీలు | లఖ్‌నవూపై విజయం

లఖ్‌నవూ: నిలకడైన ఆటతీరుతో ప్రత్యర్థులపై ఆధిపత్యం చాటుకుంటున్న రాజస్థాన్ రాయల్స్ ఖాతాలో వరుసగా నాలుగో విజయం. కెప్టెన్ సంజూ శాంసన్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 71 నాటౌట్), ధ్రువ్ జురెల్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 52 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో శనివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే 16 పాయింట్లతో తమ టాప్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకున్న రాయల్స్ దాదాపుగా ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. రాహుల్ (76), దీపక్ హుడా (50) అర్ధసెంచరీలు సాధించారు. ఛేదనలో రాజస్థాన్ 19 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసి గెలిచింది. బట్లర్ (34), జైస్వాల్ (24) పర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా శాంసన్ నిలిచాడు.

సెంచరీ భాగస్వామ్యంతో..: ఛేదనలో ఆర్ఆర్ ఓపెనర్లు జైస్వాల్, బట్లర్ తొలి వికెట్‌కు 60 పరుగులతో శుభారంభం అందించారు. వెంటవెంటనే ఈ ఇద్దరూ అవుటైనా కెప్టెన్ శాంసన్ అండగా నిలిచాడు. రియాగ్ (14) నిరాశపరిచినా ధ్రువ్ జురెల్ సహకరించాడు. నిలకడైన ఆటతీరుతో శాంసన్, జురెల్ బౌలర్లను ఒత్తిడిలోకి నెడుతూ బౌండరీలతో చెలరేగారు. 14వ ఓవర్‌లో జురెల్ 4,6,4,4తో 20 రన్స్ సమకూరాయి. అటు శాంసన్ చెలరేగి 18వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే జురెల్ సైతం ఈ ఫీట్ సాధించాడు. ఇక 19వ ఓవర్‌లో 4,6 బాదిన శాంసన్ మ్యాచ్‌ను ముగించాడు.

రాహుల్ కెప్టెన్సీ ఇన్నింగ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రాహుల్, దీపక్ హుడా మాత్రమే కీలకంగా నిలిచారు. అలాగే ఆఖరి మూడు ఓవర్లలో రాజస్థాన్ బౌలర్లు ప్రభావం చూపి 24 పరుగులే ఇచ్చి కట్టడి చేశారు. పేసర్ బౌల్ట్ ఎప్పటిలాగే తొలి ఓవర్‌లోనే డికాక్ (8) వికెట్‌తో షాకిచ్చాడు. ఇక స్టొయినిస్‌ను రెండో ఓవర్‌లోనే సందీప్ శర్మ డకౌట్ చేయడంతో లఖ్‌నవూ 11/2 స్కోరుతో తడబాటుకు లోనైంది. కానీ కెప్టెన్ రాహుల్, దీపక్ హుడా బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఇద్దరూ ఓవర్‌కో బౌండరీ ఉండేలా ఆడారు. ఎనిమిదో ఓవర్‌లో రాహుల్ 6,6,4తో 21 రన్స్ రాబట్టాడు. ఇదే జోరుతో రాహుల్ 31 బంతుల్లో.. హుడా 30 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేశారు. అయితే మూడో వికెట్‌కు 62 బంతుల్లోనే 115 పరుగులు జత చేరాక 13వ ఓవర్‌లో హుడాను అశ్విన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత లఖ్‌నవూ ఆటతీరు కూడా గాడి తప్పింది. డెత్ ఓవర్లలో పరుగులు నెమ్మదించడంతో పాటు నికోలస్ పూరన్ (11), రాహుల్‌ల వికెట్లను కూడా కోల్పోయింది. దీంతో స్కోరు 200 దాటలేకపోయింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (బి) బౌల్ట్ 8, రాహుల్ (సి) బౌల్ట్ (బి) అవేశ్ 76, స్టొయినిస్ (బి) సందీప్ 0, దీపక్ హుడా (సి) పావెల్ (బి) అశ్విన్ 50, పూరన్ (సి) బౌల్ట్ (బి) సందీప్ 11, బదోని (నాటౌట్) 18, క్రునాల్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 196/5; వికెట్ల పతనం:** 1-8, 2-11, 3-126, 4-150, 5-173; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-41-1, సందీప్ 4-0-31-2, అవేశ్ 4-0-42-1, అశ్విన్ 4-0-39-1, చాహల్ 4-0-41-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) బిష్ణోయ్ (బి) స్టొయినిస్ 24, బట్లర్ (బి) యశ్ 34, శాంసన్ (నాటౌట్) 71, పరాగ్ (సి) బదోని (బి) అమిత్ 14, జురెల్ (నాటౌట్) 52, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19 ఓవర్లలో 199/3; వికెట్ల పతనం:** 1-60, 2-60, 3-78; **బౌలింగ్:** హెన్రీ 3-0-32-0, మొహిసిన్ 4-0-52-0, యశ్ ఠాకూర్ 4-0-50-1, స్టొయినిస్ 1-0-3-1, క్రునాల్ 4-0-24-0, అమిత్ మిశ్రా 2-0-20-1, రవి బిష్ణోయ్ 1-0-16-0.

ఆరంభం అదిరె..

థామస్, ఉబెర్ కప్‌లో భారత జట్ల గెలుపు

చెంగ్డూ (చైనా): థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లు శుభారంభం చేశాయి. పురుషుల థామస్ కప్ గ్రూప్ 'సి'లో..డిఫెండింగ్ చాంప్ భారత్ 4-1తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. ఉబెర్ కప్ గ్రూప్ 'ఎ'లో భారత మహిళల జట్టు 4-1తో కెనడాను ఓడించింది. తొలుత అస్మిత 26-24, 24-22తో మిచెల్లీకి షాకివ్వగా, డబుల్స్‌లో ప్రియ/శ్రుతి 21-12, 21-10తో కాథరిన్/జెస్లిన్‌పై, ఇషారాణి 21-13, 21-12తో యు జాంగ్‌పై, అన్మోల్ 21-15, 21-11తో జాంగ్‌పై నెగ్గారు. రెండో డబుల్స్‌లో సిమ్రాన్/రితిక 19-21, 15-21తో జాకీ/క్రిస్టల్ చేతిలో ఓడారు. థాయ్‌లాండ్‌తో ఆరంభ మ్యాచ్‌లో ప్రణయ్ 20-22, 14-21తో విటిడ్ చేతిలో ఓడాడు. కానీ డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ 21-19, 19-21, 21-12తో సుఖ్‌పన్/పక్కాపోన్‌పై, లక్ష్యసేన్ 21-12, 19-21, 21-16తో పనిచ్‌పోన్‌పై, అర్జున్/కపిల 21-19, 21-15తో పన్‌పనిచ్/సోథోన్‌పై, శ్రీకాంత్ 21-9, 21-5తో నరన్ జమ్‌శ్రీపై గెలిచారు.

ట్రయల్స్‌లో ఇషా టాప్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ ట్రయల్స్ తొలి రెండు దశల్లో ఇషా సింగ్ అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో ఇషా 244.9 స్కోరుతో అగ్రస్థానం లో నిలవగా, రిథమ్ రెండు, పాలక్ మూడు, మను భాకర్ ఐదో స్థానాలకు పరిమితమయ్యారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల్లో దివ్యాన్ష్, మహిళల్లో ఎలెవెనిల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అర్జున్ టాప్‌లో నిలిచారు.

బిజినెస్

ఆల్ ఇన్ వన్ బీమా పాలసీ

బీమా విస్తార్ పేరుతో త్వరలో విడుదల

వార్షిక ప్రీమియం రూ.1,500!?

హైదరాబాద్: ఇకపై జీవిత, ఆరోగ్య, ప్రమాద, స్థిరాస్తి బీమా పథకాలను విడివిడిగా కొనుగోలు చేయాల్సిన బెడద తప్పనుంది. వీటన్నింటికీ కవరేజీ కల్పించే ఆల్ ఇన్ వన్ ఇన్సూరెన్స్ పాలసీ 'బీమా విస్తార్' త్వరలో అందుబాటులోకి రాబోతోంది. భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించనుంది. ఈ పాలసీ ప్రీమియం, విధివిధానాలపై నిర్ణయం తీసుకునేందుకు ఈ శుక్రవారంతో ముగిసిన రెండు రోజుల మేథోమథన కార్యక్రమం బీమా మంథన్‌లో బీమా కంపెనీల సారథులు, ఐఆర్‌డీఏఐ అధికారుల మధ్య చర్చ జరిగింది. ఈ వ్యక్తిగత బీమా పథకం వార్షిక ప్రీమియంను అందరికీ అందుబాటులో ఉండేలా రూ.1,500 స్థాయిలో నిర్ణయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీమా విస్తార్ పాలసీలో రూ.2 లక్షల చొప్పున జీవిత, వ్యక్తిగత ప్రమాద, ప్రాపర్టీ కవరేజీని ప్రతిపాదించినట్లు సమాచారం.

వైద్య చికిత్స విషయానికొస్తే, ఎలాంటి బిల్లులు, పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండానే రోజుకు రూ.500 చొప్పున పది రోజులకు, గరిష్ఠంగా రూ.5,000 కవరేజీ అందించే అవకాశం ఉంది. అయితే, క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ మాత్రం కవరేజీని బట్టి మారనుంది. దేశంలో అందరికీ బీమా కవరేజీని కల్పించడమే బీమా విస్తార్ ముఖ్యోద్దేశం. అందుకోసం ఈ పథకానికి గ్రామీణ స్థాయి వరకు ప్రాచుర్యం కల్పించాలని ఐఆర్‌డీఏఐ భావిస్తోంది. అందులో భాగంగా ఈ పాలసీని విక్రయించే ఏజెంట్లకు 10 శాతం కమీషన్ చెల్లించే అవకాశం ఉంది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.11,672 కోట్లు

వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్

ముంబై: మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికాని (క్యూ4)కి ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 18.5 శాతం వృద్ధితో రూ.11,672 కోట్లకు చేరుకుంది. మొండిబకాయిలతో పాటు ఇతర అవసరాలకు కేటాయింపులు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా, క్యూ4లో బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం 17.4 శాతం వృద్ధితో రూ.10,708 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ లాభం రూ.40,888 కోట్లకు పుంజుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇది రూ.31,896 కోట్లుగా ఉంది.

- నాలుగో త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 8.1 శాతం పెరిగి రూ.19,093 కోట్లకు చేరుకుంది.
- సమీక్షా కాలానికి బ్యాంక్ కేటాయింపులు సగానికి పైగా తగ్గి రూ.718 కోట్లకు పరిమితమయ్యాయి. కాగా, డిపాజిట్లలో 19 శాతం, రుణాల్లో 19.4 శాతం వృద్ధి నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో కొత్తగా రూ.5,139 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి చేరాయి. అందులో రూ.4,900 కోట్లు రిటైల్ రుణాలేనని బ్యాంక్ తెలిపింది.
- మార్చి 31 నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.16 శాతానికి తగ్గాయి.
- 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 డివిడెండ్ ప్రకటించింది.

భారత్‌లో షార్ప్ డిస్‌ప్లే ప్లాంట్

1,000 ఎకరాల్లో ఏర్పాటు యోచన ● రూ.25,000-42,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టే అవకాశం

- యూనిట్ ఏర్పాటుకు స్థలం కోసం

తెలంగాణ సహా పలు రాష్ట్రాలతో చర్చలు



న్యూఢిల్లీ: జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ కంపెనీ షార్ప్ సుమారు 300-500 కోట్ల డాలర్ల (రూ.25,000-42,000 కోట్లు) మేర పెట్టుబడులతో భారత్‌లో అత్యాధునిక (సిరీస్ 10) డిజిటల్ తెరల (డిస్‌ప్లే) తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇందుకోసం షార్ప్ ఉన్నతాధికారులు ఈ వారంలో కేంద్ర ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసినట్లు ఓ ఆంగ్ల దినపత్రిక కథనం పేర్కొంది. ప్రస్తుతం జపాన్‌లో ఉన్న ప్లాంట్ కంటే పెద్దగా, 1,000 ఎకరాల స్థలంలో భారత యూనిట్‌ను ఏర్పాటు చేయాలని షార్ప్ భావిస్తోంది. తద్వారా భారత మార్కెట్ అవసరాలు తీర్చడంతో పాటు ఇతర దేశాలకూ ఇక్కడి నుంచే డిస్‌ప్లే యూనిట్లను ఎగుమతి చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థల సమీకరణ కోసం తెలంగాణతో పాటు గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలతోనూ షార్ప్ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున షార్ప్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు లభించేందుకు మరో 10 నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వం షార్ప్ కంపెనీ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనుంది.

దేశంలో సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం 1,000 కోట్ల డాలర్ల విలువైన భారీ ప్రోత్సాహకాల పథకాన్ని ప్రకటించింది. షార్ప్ కంటే ముందు ఇజ్రాయెల్‌కు చెందిన చిప్ తయారీ సంస్థ టవర్ సెమీకండక్టర్స్ సైతం రూ.90,000 కోట్ల పెట్టుబడులతో భారత్‌లో ఫ్యాబ్ యూనిట్ ఏర్పాటుకు అనుమతి కోసం ప్రభుత్వాన్ని సంప్రదించింది.

యస్ బ్యాంక్ లాభంలో రెండింతల వృద్ధి

ముంబై: గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో యస్ బ్యాంక్ నికర లాభం స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రెండింతల వృద్ధితో రూ.452 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.202.43 కోట్లుగా ఉంది. ఆదాయ పన్ను రిటర్నులపై వడ్డీ సహా ఆదాయ పన్ను రైట్‌బ్యాక్‌తో లబ్ధి పొందటం ఈ త్రైమాసికంలో ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది. అయితే ప్రయారిటీ సెక్టార్ లెండింగ్ (పీఎస్ఎల్) నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి రావటంతో లాభం పరిమిత స్థాయిలో ఉందని తెలిపింది. త్రైమాసిక సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయ 2.3 శాతం వృద్ధితో రూ.2,153 కోట్లకు చేరుకుందని బ్యాంక్ వెల్లడించింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం ఏకంగా 74 శాతం వృద్ధితో రూ.1,251 కోట్లకు చేరుకుందని యస్ బ్యాంక్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,930 ▲	66,850 ▲	87,500 ▼
ముంబై	72,448 ▲	66,362 ▲	81,374 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	350	విజయవాడ	350
వరంగల్	352	గోదావరి	350
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	గోదావరి	133
వరంగల్	127	విజయవాడ	133
కరీంనగర్	127	గుంటూరు	135
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	135
కర్నూలు	127	చిత్తూరు	130
విశాఖపట్నం	125		


- **తగ్గిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభం**

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో నికర లాభం 10శాతం క్షీణించి రూ.724 కోట్లకు పరిమితమైంది. మొండి బకాయిల (ఎన్‌పీఏ)కు చేసిన కేటాయింపులు పెరగటమే ఇందుకు కారణమని బ్యాంక్ పేర్కొంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంక్ నికర లాభం రూ.803 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.7,822 కోట్ల నుంచి రూ.9,861 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో వడ్డీ ఆదాయం కూడా రూ.6,424 కోట్ల నుంచి రూ.8,219 కోట్లకు చేరుకుంది. మార్చి త్రైమాసికంలో స్థూల ఎన్‌పీఏలు 2.51 శాతం నుంచి 1.88 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు కూడా 0.86 శాతం నుంచి 0.60 శాతానికి తగ్గినట్లు పేర్కొంది.

- మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో వెల్‌స్పన్ లివింగ్ రూ.2,616.70 కోట్ల ఆదాయంపై రూ.146 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 20 శాతం, లాభం 16 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో దేశీయ కన్స్యూమర్ వ్యాపారం 12.2 శాతం, ఫ్లోరింగ్ వ్యాపారం రెండింతలు పెరిగింది.

పూరీ విమానాశ్రయ అభివృద్ధి రేసులో జీఎంఆర్!

అదానీ గ్రూప్, ఫెయిర్‌ఫాక్స్ కూడా..



హైదరాబాద్: ఒడిశాలోని పవిత్ర పుణ్యక్షేత్రం పూరీ సమీపంలో సిపాసారుబాలీ వద్ద ఏర్పాటు చేయనున్న కొత్త విమానాశ్రయ అభివృద్ధికి అదానీ గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఫెయిర్‌ఫాక్స్ పోటీపడుతున్నాయి. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీఓ) రూ.2,203 కోట్ల పెట్టుబడితో ఈ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయనుంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయం కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐడీసీఓ టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 26న జరిగిన రెండో ప్రీ-బిడ్ సమావేశంలో అదానీ ఎయిర్‌పోర్ట్స్, ఫెయిర్‌ఫాక్స్, జీఎంఆర్ గ్రూప్‌నకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో విమానాశ్రయ అభివృద్ధి, అనుమతులు, కాలపరిమితికి సంబంధించి పలు ప్రశ్నలను మూడు కంపెనీల ప్రతినిధులు లేవనెత్తగా మే 10న వీటికి సంబంధిత అధికార వర్గాలు సమాధానం ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ వివరాలను అందుకున్న తర్వాత ఆసక్తి కలిగిన బిడ్డర్లు తమ టెండర్‌ను జూన్ 4వ తేదీ వరకు దాఖలు చేయాల్సి ఉంటుంది. అదే నెల 5న టెండర్‌ను తెరవనున్నారు.

2,203 కోట్లతో అభివృద్ధి: ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని మొత్తం 1,184 ఎకరాల్లో రూ.2,203 కోట్లతో ఐడీసీఓ అభివృద్ధి చేయనుంది. తొలి దశలో ఏటా 46 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఆ తర్వాత రెండో దశలో ఏటా 1.01 కోట్ల మంది, మూడో దశలో 1.66 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించేలా అభివృద్ధి చేయాలని ఐడీసీఓ నిర్ణయించింది. ఈ విమానాశ్రయానికి రాకపోకలు సాగించేందుకు ఐడీసీఓ నాలుగు లేన్ల రహదారిని అభివృద్ధి చేయనుంది. అయితే తొలిదశలో అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలనే అంశం రెగ్యులేటరీ అనుమతులకు లోబడి ఉంటుందని ఐడీసీఓ స్పష్టం చేసింది.

మేడిగడ్డ రక్షణకు చర్యలు తీసుకోండి

- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణకు కూడా..
- తదుపరి నష్టం జరగకుండా చూసుకోవాలి
- నీటిపారుదల శాఖ అధికారులకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణకు చర్యలు తీసుకోవాలని, రానున్న వరదల్లో బ్యారేజీలు దెబ్బతినకుండా నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్.. నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. ఈ బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం)లో నిర్లక్ష్యంతోపాటు నాణ్యతపై విచారణ కోసం ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్‌ను ఎంక్వయిరీ ఆఫ్ కమిషన్‌గా నియమించిన విషయం తెలిసిందే. శనివారం కోల్‌కతాకు వెళ్లేముందు ఆయన అధికారులతో సమావేశమయ్యారు. మే నెలాఖరున లేదా జూన్‌లో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బ్యారేజీలు మరింత దెబ్బతినకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ నివేదిక కోసం కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌కు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు జస్టిస్ చంద్రఘోష్ సూచించారు. ఆ నివేదికను వెంటనే తెప్పించుకొని దాని ఆధారంగా బ్యారేజీల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. తమ విచారణలో ఈ నివేదిక కూడా కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు.

కోల్‌కతాకు జస్టిస్ చంద్రఘోష్.. మే 6న రాష్ట్రానికి రాక

న్యాయ విచారణ కోసం హైదరాబాద్‌కు వచ్చిన జస్టిస్ చంద్రఘోష్ మూడురోజులు ఇక్కడే ఉండి శనివారం కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోయారు. మే 6న కోల్‌కతా నుంచి హైదరాబాద్ రానున్న ఆయన.. అదే రోజు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించనున్నారు. తర్వాత హైదరాబాద్‌కు చేరుకొని కాగ్ నివేదికతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలపై అధ్యయనం చేసే అవకాశాలున్నాయి.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు తాళాలు

అద్దెలు చెల్లించకపోవడంతో మూతపడుతున్న వైనం.. ఇప్పటికే 9 డిస్పెన్సరీలకు తాళం.. త్వరలో మరికొన్నింటికి!

- పెండింగ్‌లో రూ.2.10 కోట్ల వరకు అద్దె బకాయిలు
- ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో రూ.1.25 కోట్ల బిల్లులు
- డిస్పెన్సరీలు మూతపడుతుండటంతో ఇబ్బందిపడుతున్న రోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు మూతపడుతున్నాయి. చిరుద్యోగులు, కార్మికులకు ఉచితంగా వైద్యం, ఔషధాలందించే డిస్పెన్సరీలకు అద్దె చెల్లించని కారణంగా ఇప్పటికే 9 కేంద్రాలకు తాళాలు పడ్డాయి. త్వరలోనే మరికొన్ని మూతపడే పరిస్థితి కనిపిస్తోంది. ప్రైవేటు భవనాల్లో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు అద్దెలు సకాలంలో చెల్లించడం లేదు. కొన్నింటికి ఏడాదిగా, మరికొన్నింటికి నెలలుగా అద్దెలు పెండింగ్‌లో ఉండటంతో యజమానులు తాళాలేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని తార్నాక, మేడ్చల్, శామీర్‌పేట, బొల్లారం, శాభాష్‌పల్లి, హిమ్మత్‌పుర, ఉమ్మడి మెదక్‌జిల్లాలోని జహీరాబాద్, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ, టీటీనగర్ డిస్పెన్సరీలకు తాళాలు వేశారు. వీటిలో ఒక్క మేడ్చల్ డిస్పెన్సరీకే రూ.1.70 లక్షలు, బొల్లారానికి రూ.1.60 లక్షలు, తార్నాకకు రూ.80 వేల అద్దె పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 71 ఈఎస్‌ఐ డిస్పెన్సరీలుండగా వాటిలో 57 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం 57 డిస్పెన్సరీలకు సంబంధించిన అద్దెలు సుమారు రూ.2.10 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో



రూ.1.25 కోట్లకు సంబంధించి బిల్లులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

వైద్య సేవలకు తీవ్ర అంతరాయం..

రాష్ట్రంలో బీమా చేయించుకున్న 18 లక్షల మందికి ఈఎస్‌ఐ వైద్య సేవలందిస్తోంది. వీరిని ఇన్సూర్డ్ పర్సన్ (ఐపీ)గా వ్యవహరిస్తారు. వీరి కుటుంబ సభ్యులనూ కలిపితే 70 లక్షల మంది వరకుంటారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) ద్వారా ఈఎస్‌ఐ లబ్ధిదారులకు వైద్యం, మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఈఎస్‌ఐ నెట్‌వర్క్ కింద 4 ఆస్పత్రులు, 2 డయాగ్నోస్టిక్ కేంద్రాలతోపాటు 71 డిస్పెన్సరీలున్నాయి. రాష్ట్రం నుంచి ఈ ఐపీల ద్వారా ఢిల్లీలోని ఈఎస్‌ఐ కార్పొరేషన్‌కు ఏటా సుమారు రూ.1,250 కోట్ల వరకు వెళ్తాయి. ఈఎస్‌ఐ కార్పొరేషన్ ప్రతి ఐపీకి ఏడాదికి సగటున రూ.3వేలు కేటాయిస్తుండగా.. అంతే మొత్తాన్ని తిరిగి రాష్ట్ర ఈఎస్‌ఐకి పంపుతుంది. రాష్ట్ర యంత్రాంగం వాటి వినియోగానికి సంబంధించిన వినియోగ ధ్రువపత్రాల(యూసీ)ను కార్పొరేషన్‌ పంపాలి. అయితే రాష్ట్రం నుంచి సరైన విధంగా యూసీలు పంపకపోవడంతో నిధులు సరిగ్గారావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడున్న ఐపీ ప్రకారం ఏటా సుమారు రూ.550 కోట్ల వరకు వచ్చే అవకాశం ఉండగా.. యూసీలు సమర్పించకపోవడంతో కనీసం రూ.200 కోట్లు కూడా రావడంలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో మందులు సరిగ్గా కొనలేకపోవడం, కంపెనీలకు పెద్దయెత్తున పెండింగ్ బిల్లులుండటం, డిస్పెన్సరీల్లో మెడిసిన్ లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. చాలా డిస్పెన్సరీల్లో జాబితాలోని వాటిలో సగం మందులు కూడా లేవని రోగులు చెబుతున్నారు. డిస్పెన్సరీల మూత, సరిపడా ఔషధాలులేకపోవడంతో కొద్ది రోజుల క్రితం కొందరు రోగులు ముషీరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. డిస్పెన్సరీల్లో మందులు లేకపోవడంతో రోగులు ఈఎస్‌ఐ సిబ్బందితో గొడవ పడుతున్నారు.

ఈఎస్‌ఐ అంటే ఎవరికీ పట్టడం లేదు

ఈఎస్‌ఐ అంటే ఎవరికీ పట్టడం లేదు. దీన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. లక్షల మంది చిరుద్యోగులు, కార్మికులకు ఉచితంగా వైద్యం, ఔషధాలందించే ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు మూతపడుతున్నాయి. వాటికి అద్దె కూడా కట్టలేని స్థితికి రాష్ట్ర ఈఎస్‌ఐ చేరింది. డిస్పెన్సరీల మూతతో కార్మికుల వైద్య సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. మూతపడిన డిస్పెన్సరీలను వెంటనే తెరవాలి. ఇదే విషయాన్ని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల దృష్టికీ తీసుకెళ్లాం. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

-శ్రీనివాసరెడ్డి, సీపీఎం,
హైదరాబాద్ నగర కార్యదర్శి



రంగారెడ్డి జిల్లా పెద్దఎల్కిచర్ల రోడ్ షోలో మాట్లాడుతున్న డీకే అరుణ

‘పాలమూరు’కు జాతీయ హోదా కోసం రేవంత్, కేసీఆర్ చేసిన కృషి ఏంటి?

- నాపై వ్యాఖ్యలు సిగ్గుచేటు: డీకే అరుణ
- రేవంత్, హరీశ్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్: మహేశ్వర్‌రెడ్డి
- రేపు మానుకోటకు జేపీ నడ్డా రాక

చౌదరిగూడ/మహబూబాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): “బీజేపీలో జాతీయ స్థాయి పదవిలో ఉన్న తాను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తేలేదంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేంటి?” అని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రశ్నించారు. శనివారం రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల, వీరన్నపేట్, పద్మారం, చౌదరిగూడ, లచ్చంపేట్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన ఆమె మాట్లాడారు. తాను పార్టీ పదవిలో మాత్రమే ఉన్నారని, ప్రజాప్రతినిధిగా లేనని, ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురాలేదంటూ మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. పదేళ్లు కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్టు పేరుతో దోచుకునేందుకు ఎన్నిసార్లు ప్రాజెక్టు డిజైన్లు మార్చారో చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు రాజకీయ జీవితాన్ని ఇచ్చారని, ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలకు ఏం చేశారని అరుణ ప్రశ్నించారు. కాగా, రాష్ట్రంలో సమస్యలను పక్కదారి పట్టించేందుకు సీఎం రేవంత్ మైండ్‌గేమ్ ఆడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్, హరీశ్‌ల మధ్య ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ ప్రకారమే రాజీనామా డ్రామాలు అని మండిపడ్డారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ చేయకపోతే అధికారమెందుకని వ్యాఖ్యానించిన రేవంత్.. రైతుభరోసా, పెన్షన్లు, నిరుద్యోగ భృతిపై ఎందుకు స్పందించడం లేదని, బీసీ, ఎస్సీ డిక్లరేషన్లపై ఎందుకు మాట్లాడ్డం లేదని ప్రశ్నించారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నట్లు ఆ పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గురుకుల ఇంటర్, డిగ్రీ కాలేజీల ప్రవేశ పరీక్ష నేడే

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహణ
- ఇంటర్‌కు 47,461, డిగ్రీ ప్రవేశాలకు 18,989 దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకులాల్లోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలతో పాటు బీసీ గురుకులాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ రెండు పరీక్షలను ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు టీజీ ఆర్జేసీ సెట్ కన్వీనర్, బీసీ గురుకుల సెక్రటరీ బి.సైదులు(ఐఎఫ్ఎస్) తెలిపారు. డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా 64 కేంద్రాల్లో, జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్షలను 209 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం 47,461, డిగ్రీలో ప్రవేశాలకు 18,989 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పరీక్షల హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, చివరి నిమిషంలో టెన్షన్ పడొద్దని, సెంటర్ సహా అన్ని వివరాలను ముందుగానే సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సైదులు విద్యార్థులకు సూచించారు.

నెత్తిన నిప్పులు

- ఐదు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఎండ
- జమ్మికుంటలో రెండో రోజూ గరిష్ఠ ఉష్ణోగ్రత
- నేడు, రేపు అన్ని జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భానుడి భగ భగలతో తెలంగాణ నిప్పుల కొలిమిలా మారింది. సూర్యుడు ఉగ్రరూపం దాల్చడంతో రాష్ట్రమంతటా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ దంచికొడుతుండటంతో పగటి పూట అడుగు బయట పెట్టాలంటే జనం భయపడుతున్నారు. భరించలేని వేడి, వడగాలులతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శనివారం పలు జిల్లాల్లో 45 డిగ్రీలపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు పదకొండు తర్వాత రోడ్లపైన జనం కనిపించ లేదు. మధ్యాహ్నం సమయానికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో రెండో రోజూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు



నల్లగొండలో కోళ్లకునీళ్లు చల్లుతున్న చికెన్‌షాప్ నిర్వాహకుడు

నమోదయ్యాయి. శుక్రవారం ఇక్కడ 45.6 డిగ్రీలు నమోదు కాగా.. శనివారం 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు అయింది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి, ములుగు జిల్లా మల్లూరులో 45.2.. జగిత్యాల జిల్లా వెల్లటూరు, ములుగు జిల్లా ధర్మవరంలో 45.1.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా గోధూరులో 44.9.. భూపాలపల్లి జిల్లా తాడిచర్ల, మంచిర్యాల జిల్లా దేవులవాడ, కొండాపూర్.. కరీంనగర్ జిల్లా వీణవంక, నిజామాబాద్ జిల్లా సాలూరలో 44.8.. సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లో 44.3.. యాదాద్రి జిల్లా బొమ్మల రామారం మండలం మర్యాల, ఆదిలాబాద్ జిల్లా బేల, సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని మూసాపేట బాలాజీనగర్‌లో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో 42 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

వడదెబ్బకు ఇద్దరి మృతి..

వడదెబ్బతో శనివారం ఇద్దరు చనిపోయారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కొత్త గోల్‌తండాకు చెందిన బానోత్ మంగ్యా(40) కూలీ పనులకు వెళ్లొచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తికి చెందిన ఎండనూరి రాజు(35).. తన అత్తగారి ఊరైన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం దామరంచపల్లికి నడుచుకుంటూ వెళుతుండగా కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ వద్ద వడదెబ్బతో చనిపోయాడు.



ఓడేడు వద్ద కూలిన వంతెనను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

గాలికి వంతెన కూలడం హాస్యాస్పదం

- గత సర్కారు పనితీరుకు నిదర్శనం ఈ నిర్మాణం
- గుత్తేదారుపై చర్యలు తీసుకుంటాం: మంత్రి శ్రీధర్‌బాబు

ముత్తారం, ఏప్రిల్ 27: ఈదురుగాలులకు వంతెన కూలిపోవడం హాస్యాస్పదమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నాసిరకంగా పనులు చేపట్టిన గుత్తేదారు, అప్పటి ప్రభుత్వంలో ఉండి నిధులు మంజూరు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు వద్ద మానేరు నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన ఇటీవల ఈదురు గాలులకు కూలిపోయింది. శనివారం ఆ వంతెనను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు అక్కడే విలేకరులతో మాట్లాడారు. గుత్తేదారులు నాసిరకంగా పనులు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, దానికి ఉదాహరణ ఈ వంతెన అని అన్నారు. వంతెన నిర్మాణానికి రూ.60.56 కోట్లు మంజూరైనా పనులను నాసిరకంగా చేపట్టారని.. ఇద్దరు గుత్తేదారులకు ఇచ్చినా గత ప్రభుత్వం వంతెన నిర్మాణం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. నామమాత్రంగా నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే వదిలేసిన వంతెనలు, చెక్ డ్యామ్‌లు రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు పార్లమెంట్ ఎన్నికల అనంతరం వంతెన పనులు పూర్తిచేస్తామని చెప్పారు. మంత్రి వెంట పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ ఉన్నారు.

హైదరాబాదీకి లండన్‌లో 16 ఏళ్ల జైలు శిక్ష

- మాజీ ప్రియురాలిపై హత్యాయత్నం.. రెస్టారెంట్లో కత్తిపోట్లు

లండన్, ఏప్రిల్ 27: మాజీ ప్రియురాలిపై రెండేళ్ల క్రితం హత్యాయత్నం చేసినందుకు భారత దేశానికి చెందిన శ్రీరాం అంబర్ల (25)కు 16 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ లండన్‌లోని ఓల్డ్ బెయిలీ కోర్టు గురువారం తీర్పు చెప్పింది. రెస్టారెంట్లో ఉండగా ఆమెను కత్తితో పొడిచినట్టు రుజువు కావడంతో ఈ శిక్ష వేసింది. శ్రీరాంకు, 20ల్లో ఉన్న కేరళ యువతికి హైదరాబాద్‌లో పరిచయం ఏర్పడింది. 2019లో వారు విడిపోయారు. 2022లో ఇద్దరూ ఈస్ట్ లండన్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువుల నిమిత్తం చేరారు. అదే సమయంలో ఆమె ఓ రెస్టారెంట్‌లో పార్ట్‌టైం వెయిట్రెస్‌గా కూడా పని చేయడం ప్రారంభించింది. మళ్లీ ఎదురుపడ్డ నుంచి ఆమెను బెదిరించడం, కొట్టడం ప్రారంభించాడు. 2022 మార్చిలో ఈస్ట్ లండన్‌లోని హైదరాబాదీ రెస్టారెంట్‌లో ఉండగా ఆమెను కత్తితో తొమ్మిది సార్లు పొడిచాడు. తీవ్రంగా గాయాలపాలైన ఆమె నెల రోజుల పాటు క్రిటికల్ కేర్‌లో ఉండాల్సి వచ్చింది. ఆరు ఆపరేషన్లు జరిగాయి. కత్తితో పొడిచిన వెంటనే శ్రీరాం పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయాడు. తన గర్ల్ ఫ్రెండ్‌ను కత్తితో పొడిచినట్టు అంగీకరించాడు. తనను భారత్‌కు తిప్పి పంపించివేయాలని, అక్కడ మరణ శిక్ష విధించవచ్చని తెలిపాడు. కత్తిపోట్ల సంఘటన సీసీటీవీ కెమేరాల్లో రికార్డు కావడంతో అదే సాక్ష్యంగా పనికొచ్చింది. విచారణ జరిపిన జడ్జి ఫిలిప్ కట్స్..శ్రీరాంను అసూయపరుడు, ఎవరినైనా అదుపులోకి తీసుకోవాలన్న మనస్తత్వం కలవాడని అభిప్రాయపడ్డారు. పబ్లిక్ స్థలంలో భయంకరమైన మరణాన్ని వెంట్రుకవాసిలో ఆమె తప్పించుకొందని వ్యాఖ్యానించారు. హత్యాయత్నం నేరానికి 16 ఏళ్ల జైలు శిక్ష, కత్తిని కలిగి ఉన్నందుకు మరో 12 నెలల జైలు శిక్ష విధించారు. రెంటింటినీ ఏకకాలంలో అనుభవించాలని ఆదేశించారు. ఆమెను ఇకపై కలవడానికి ప్రయత్నించకూడదంటూ దీర్ఘకాల నియంత్రణ ఉత్తర్వును జారీ చేశారు. శ్రీరాం అంబర్ల మనస్తత్వాన్ని అధ్యయనం చేసిన ఇద్దరు ఫోరెన్సిక్ సైకాలజిస్టులు..అతడు ప్రమాదకర ముద్దాయి అని తెలిపారు. ‘బోర్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్’తో బాధపడుతున్నట్టు పేర్కొన్నారు. వీరిచ్చిన నివేదిక, సీసీటీవీ ఫుటేజీలో కనిపించిన భయంకర దృశ్యాలను ఆధారం చేసుకొని జడ్జి కఠిన శిక్ష విధించారు.

దేశానికి బీజేపీ పెద్ద ప్రమాదకారి

మేడిగడ్డపై కేసీఆర్‌వి తెలివితక్కువ మాటలు.. మంద కృష్ణ ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌లా మారాడు: కడియం శ్రీహరి

హనుమకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి బీజేపీ అతి పెద్ద ప్రమాదకారి అని, ఆ పార్టీ కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. సమాజంలో ప్రణాళికాబద్ధంగా మత విద్వేషాన్ని చొప్పించేందుకు బీజేపీ చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని, దేశా న్ని రక్షించుకోవాలంటే ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లేకుంటే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హనుమకొండలో శనివారం కడియం శ్రీహరి తన కుమార్తె కావ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో బీజేపీ దేశంలోని ఏవర్గానికీ మేలు చేయకపోగా వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించిందన్నారు. తెలంగాణ ఏర్పాటును అవమానించిన మోదీకి ఈ రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు లేదని చెప్పారు. బీజేపీకి ఓటేస్తే రాబోయే రోజుల్లో ఆ పార్టీ రాష్ట్రానికి చేసేది ఏమీ ఉండదన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్ల కుంగుబాటుపై మాజీ సీఎం కేసీఆర్ తెలివితక్కువగా, ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కావ్య కులంపై కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ఆమె నామినేషన్ సక్రమంగా ఉన్నట్టు ఎన్నికల అధికారి ధ్రువీకరించిన తర్వాత ఇక సమస్య ఏముందని ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌లాగా మాట్లాడుతున్నాడని, ఎన్నికల తర్వాత ఆయన తన దగ్గరికి వచ్చి పొరపాటైందని క్షమాపణ అడుగుతాడు చూడండి అని చెప్పారు.



మాట్లాడుతున్న కడియం శ్రీహరి, కావ్య

బెట్టింగ్ ఉచ్చులో పడి 25 లక్షల అప్పు

- రుణదాతల వేధింపులు తాళలేక బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

సదాశివపేట, ఏప్రిల్ 27: క్రికెట్ బెట్టింగ్ మరో ప్రాణాన్ని బలిగొంది. బెట్టింగ్‌కు బానిసై తల్లిదండ్రులకు తెలియకుండా రూ.25 లక్షల వరకు అప్పులు చేసిన ఓ బీటెక్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన చింతా వినీత్(25) తనకు అప్పులు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక ఉరి వేసుకున్నాడు. సదాశివపేటకు చెందిన వినీత్ బీటెక్ ఫైనలియర్ విద్యార్థి. కొంతకాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసైన వినీత్.. తెలిసినవారు, లోన్‌యాప్‌ల నుంచి రూ.25 లక్షల దాకా అప్పులు చేసి బెట్టింగ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. అప్పుల సంగతి తల్లిదండ్రులకు తెలియకపోవడంతో కొద్దిరోజులుగా తీవ్ర మనోవేదనతో ఉన్నాడు. తల్లిదండ్రులు రెండ్రోజుల క్రితం అయోధ్య రామ మందిర దర్శనానికి వెళ్లగా.. అప్పులు ఇచ్చిన వారి నుంచి వినీత్‌కు ఇటీవల వేధింపులు అధికమయ్యాయి. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వినీత్ మరో గత్యంతరం లేక శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వినీత్ తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కొడుకు మరణవార్త తెలుసుకున్న వినీత్ తల్లిదండ్రులు అయోధ్య నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

‘లోన్‌యాప్’ వేధింపులు.. యువకుడి ఆత్మహత్య

మర్రిగూడ: అప్పు తీర్చకపోతే నీ పరువుతీస్తాం.. అంటూ లోన్‌యాప్ నిర్వాహకులు చేసిన వేధింపులు తాళలేక నల్లగొండ జిల్లా మర్రిగూడకు చెందిన కొడిచర్ల అభిరాం(21) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మర్రిగూడకు చెందిన కొడిచర్ల శేఖర్, సునీత దంపతులకు అభిరాం(21), పవన్ అనే కుమారులు ఉన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి అయిన అభిరాం.. తండ్రి నిర్వహించే హెయిర్ కటింగ్ సెలూన్‌లో చేదోడువాదోడుగా ఉండేవాడు. అయితే, అభిరాం.. తన తల్లిదండ్రులకు తెలియకుండా పిరమిల్ అనే యాప్‌లో రూ.20 వేలు అప్పు చేశాడు. కానీ దానిని తిరిగి చెల్లించలేకపోయాడు. దీంతో ఆ యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీంతో అభిరాం తీవ్ర ఒత్తిడికి లోనై ఇంట్లో ఉరేసుకున్నాడు.

ఏసీబీకి చిక్కిన గంగాధర సబ్ రిజిస్ట్రార్

గంగాధర, ఏప్రిల్ 27: గిఫ్ట్ డీడ్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసిన కరీంనగర్ జిల్లా గంగాధర ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సురేష్‌బాబును అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిరిసిల్లకు చెందిన కొప్పుల రాజేశంకు కొత్తపల్లి మండలం రేకుర్తిలోని సర్వే నంబరు 131లో 1304.66 చదరపు గజాల స్థలం ఉంది. అందులో నుంచి 484 చదరపు గజాలను తన కుమారుడు అజయ్‌కి గిఫ్ట్ డీడ్ చేయడానికి రాజేశం తన స్నేహితుడు ఆకుల అంజయ్య ద్వారా గంగాధరకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సురేష్‌బాబును సంప్రదించాడు. ఇందుకోసం సురేష్‌బాబు రూ.10 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పని జరగదని తేల్చి చెప్పారు. డాక్యుమెంటు సక్రమంగా ఉన్నప్పటికీ లంచం ఇవ్వడం ఇష్టంలేని అంజయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సలహాతో సురేష్‌బాబు సూచన మేరకు రాజేశం రూ.10 వేలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కొత్తకొండ శ్రీధర్‌కు ఇస్తుండగా... ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బుతోపాటు వారిని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జగన్ అండతో కేసీఆర్ స్కెచ్!

అధికారంలో ఉన్నప్పుడు నియంతలుగా ప్రవర్తిస్తూ కనుసైగతో రాజకీయాలను శాసించగలం అని విర్రవీగిన రాజకీయ నాయకులకు ఎన్నికల్లో ఓడిపోగానే ప్రజాస్వామ్య విలువలు, హక్కులు గుర్తుకొస్తాయి. ఆత్మవిశ్వాసం వేరు, అహంకారం వేరు అని అధికారంలో ఉన్నప్పుడు గుర్తించరు. తమకు ఎదురే ఉండదని భావించడం అహంకారం అవుతుంది. సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించగలనని భావించడం ఆత్మవిశ్వాసం అవుతుంది. తనకు సవాళ్లే ఎదురుకావని అనుకోవడం అహంకారం అవుతుంది. ఇందుకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చక్కటి ఉదాహరణ. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఎలా ప్రవర్తించారో మనం చూశాం. ఇప్పుడు అధికారం కోల్పోయాక కొంచెం కొంచెంగా తత్వం బోధపడుతోంది.

> మొత్తానికి జగన్‌రెడ్డి శనివారం బ్యాండేజ్ లేకుండా దర్శనమిచ్చారు. తనపై హత్యాయత్నం జరిగిందని ప్రచారం చేసుకొని లబ్ధిపొందాలని అనుకున్నారు గానీ.. శనివారంనాడు ఆయనను చూస్తే కుట్ల గురించి దేవుడెరుగు, గాయం తాలూకు ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా తనను సమర్థించే వాళ్లు వెర్రి వెంగళప్పలని జగన్మోహన్ రెడ్డి బలంగా నమ్ముతున్నారు. నీతి, నిజాయితీల గురించి పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు. డజనుకు పైగా అవినీతి కేసులలో నిందితుడిగా ఉండి కూడా అవినీతికి ఆస్కారం లేని పాలన అందించానని చెప్పుకొనే దుస్సాహసానికి పాల్పడుతున్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య సాగుతున్న మాటల యుద్ధంలో ప్రజలు ఎవరి మాటలను నమ్ముతారో తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడవలసిందే. అడ్డదారిలో అధికారంలోకి రావాలను కుంటున్న కేసీఆర్ ఆశలపై జగన్‌రెడ్డి అండ్ కో నీళ్లు చల్లుతారా? లేక ఆ ఆశలు చిగురింపజేస్తారా? న్యాయం కోసం పోరాడుతున్న డాక్టర్ సునీతకు ప్రజల నైతిక మద్దతు లభిస్తుందా? లేదా? వంటి ప్రశ్నలకు సమాధానం లభించాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి ఉండక తప్పదు!

మీడియా అవసరాన్ని కూడా గుర్తించారు. ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం మీడియా ప్రతినిధులు ప్రశ్నలు వేయాలనుకుంటే కసురుకునేవారు. తెలంగాణ వ్యతిరేకులుగా ముద్ర వేసేవారు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలను ప్రచురించిన పత్రికలలో పనిచేసే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వబోనని ప్రకటించే వరకు వెళ్లారు. ఇది గతం. ఇప్పుడు కేసీఆర్ పనిగట్టుకొని టీవీ చానళ్లలో కూర్చొని గంటల తరబడి మాట్లాడాల్సిన పరిస్థితి. అంతమాత్రాన కేసీఆర్‌లో మార్పు వచ్చిందని, ఆయనలో అహంకారం పోయిందని భావించడానికి లేదు. అధికారంలో ఉన్నప్పుడు మీడియాను అణగదొక్కే ప్రయత్నం చేసిన కేసీఆర్‌కు, ఇప్పుడు కూడా తత్వం బోధపడలేదు. ప్రభుత్వ చర్యలను విమర్శించడం, ప్రశ్నించడమే తెలంగాణ ద్రోహం అన్నట్టుగా విరుచుకుపడిన ఆ పెద్ద మనిషి ఇప్పుడు కాకా మీడియా, బాకా మీడియా అంటూ మీడియాను నిందించే దుస్సాహసానికి పాల్పడ్డారు. ఎన్నికల్లో తాను ఎందుకు ఓడిపోయానో గుర్తించడానికి కేసీఆర్ నిరాకరిస్తున్నట్టుగా ఉంది. ఓటమికి తానే బాధ్యుడినని తెలుసుకోకపోవడం అహంభావమే అవుతుంది. తాను అధికారం నుంచి తప్పుకొన్న ఈ ఐదు నెలల్లోనే తెలంగాణ గోస పడుతోందని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తన పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని కేసీఆర్ భ్రమిస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయలేకపోతే ప్రజలు మళ్లీ కేసీఆర్‌నే ఆదరించవచ్చు. అయితే అందుకు ఎన్నికలు జరిగే వరకు వేచిచూడాలి. కానీ కేసీఆర్‌కు అంత ఓపిక ఉన్నట్టు లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని తాను మాత్రమే ముఖ్యమంత్రిగా పాలించగలనని, మిగతావాళ్లు ముఖ్యమంత్రులుగా పనికిరారని కేసీఆర్ ఇప్పటికీ భావించడం విడ్డూరంగా ఉంది. ఎత్తులు, కుయుక్తులతో త్వరలోనే తాను మళ్లీ అధికారంలోకి వస్తానని కేసీఆర్ భావిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తనకు అండగా ఉంటూ వచ్చిన సీమాంధ్ర ఓటర్లలో అత్యధికులను గత ఎన్నికల్లో నోటి దురుసుతనంతో కేసీఆర్ అండ్ కో దూరం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పరిస్థితుల గురించి తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చనీయాంశం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని తమకు సమాచారం ఉందని ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను ఓడిపోతున్న విషయమే తెలుసుకోలేకపోయిన కేసీఆర్.. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని చెప్పడాన్ని సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం లేదు. కాకపోతే ఈ వ్యాఖ్యల వల్ల లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ నష్టం జరుగుతుందని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆందోళన చెందుతున్నారు.

అంత జరిగినా.. మళ్లీ జగన్‌తో!

గత ఎన్నికల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా కేసీఆర్ మళ్లీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో ఎందుకు అంటకాగుతున్నారన్న సందేహం ఈ సందర్భంగా వస్తోంది. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని కేసీఆర్ ఆషామాషీగా అనలేదని తెలుస్తోంది. అలా అని ఆంధ్రప్రదేశ్ పరిస్థితులపై కేసీఆర్‌కు సమాచారం ఉందని కూడా భావించలేం. మరి ఇంకెందుకు నోరు జారడం? అన్న ప్రశ్న వస్తోంది. ఇప్పుడు అధికారం కోల్పోయి ఉండవచ్చును గానీ, కేసీఆర్ అమాయకుడేమీ కాదు. తెర వెనుక ఏమి జరుగుతున్నదో ఆయనకు ఒక అంచనా ఉంది. వచ్చే ఎన్నికల వరకు వేచి చూడకుండా మధ్యలోనే తాను మళ్లీ అధికారంలోకి రావాలంటే జగన్మోహన్ రెడ్డి సహకారం అవసరమని ఆయన గుర్తించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చాలంటే జగన్ మద్దతు అవసరమని భావిస్తున్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని కేసీఆర్ గట్టిగా కోరుకుంటున్నారు. ఏపీలో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు కూలిపోతుంది అంటారా? కేసీఆర్ లెక్కల ప్రకారం కూలిపోతుంది అంతే! రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక శాఖలు నిర్వహిస్తున్న ఒక మంత్రి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌కు అత్యంత సన్నిహితుడు అని అందరికీ తెలిసిందే. జగన్‌రెడ్డి సహకారంతో ఆ మంత్రి ద్వారా కాంగ్రెస్ పార్టీలో చీలిక తీసుకువచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ తాను అధికారంలోకి రావాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ స్కెచ్ అమలవుతుందా? అంటే చెప్పలేం. జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారో? రారో? ముందుగా తేలాలి. జగన్ ఓడిపోతే కేసీఆర్ కలలు కల్లలవుతాయి. ఒకవేళ జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చినా ఆయనకు సన్నిహితుడైన తెలంగాణ మంత్రి కాంగ్రెస్ పార్టీని చీల్చుతారో లేదో తెలియదు. ప్రభుత్వాన్ని పడగొట్టగలిగిన శక్తి ఆయనకు ఉందో లేదో కూడా తెలియదు. అంత బలం ఉందనుకున్నా ఎన్నికల ముందు తనను అవమానించిన కేసీఆర్ పంచన చేరడం వల్ల సదరు మంత్రికి కలిగే అదనపు ప్రయోజనం ఏమిటి? అనే సందేహం ఉండనే ఉంది. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం కోసం ఆ మంత్రి రిస్కు తీసుకుంటారా? అన్నది కీలక ప్రశ్న. జగన్ మీద అభిమానంతో తన రాజకీయ భవిష్యత్తును ఆయన ప్రమాదంలోకి నెట్టుకుంటారని కూడా భావించలేం. కేసీఆర్ ఆలోచనల గురించి తెలిసిన తర్వాత నేను సేకరించిన సమాచారం ప్రకారం.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టి కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయాలన్న ఆలోచన ఆ మంత్రికి లేదు. కాంగ్రెస్ పార్టీలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని సదరు ప్రముఖుడు భావిస్తున్నారట. అయితే కేసీఆర్ మాత్రం గాలిలో మేడలు కడుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని ఇటీవలి కాలంలో కేసీఆర్ తరచూ చెప్పుకోవడం ఈ స్కెచ్‌లో భాగమే. నిజానికి భారత రాష్ట్ర సమితికి చెందిన ఎమ్మెల్యేలే కాంగ్రెస్‌లో చేరడానికి క్యూ కడుతున్నారు. కొంతమంది లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాలనుకుంటున్నారు. కేసీఆర్, జగన్ కలసి తెర వెనుక చేస్తున్న ఆలోచనల గురించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియక కాదు. తెలుసు కనుకే తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కుట్ర జరుగుతోందని ఆయన తాజాగా ఆరోపిస్తున్నారు. నిన్నటి వరకు ప్రభుత్వాన్ని టచ్ చేయగలరా? అని సవాలు విసురుతూ వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇటీవల మాత్రం తన ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి కుట్ర జరుగుతోందని చెప్పడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని కేసీఆర్ చెప్పడంలోని మర్మం తెలుసుకోలేనంత అమాయకుడేమీ కాదు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాజకీయాలలో ఏమి జరుగుతుందో ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే ఉంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బట్టి తెలంగాణ రాజకీయాలలో స్పష్టత ఏర్పడుతుందా? లేదా? అన్నది తేలిపోతుంది. జాతీయ రాజకీయాలలో ప్రస్తుతానికి బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని మింగేయడానికి కేసీఆర్‌తో పాటు భారతీయ జనతా పార్టీ కూడా సహజంగానే ప్రయత్నిస్తుంది. కేంద్రంలో నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ముందుగా హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను ఖతం చేస్తారు. తర్వాత తెలంగాణలో కూడా ప్రభుత్వాన్ని పడగొడతారని కేసీఆర్ చెబుతున్నారు.

అటు కేసీఆర్.. ఇటు బీజేపీ!

కేంద్రంలో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏడాది తర్వాత పడగొడతామని తెలంగాణలో బీజేపీ ముఖ్యుడొకరు ఆంతరంగిక సంభాషణల్లో చెబుతున్నారు. మొత్తంగా చూస్తే రేవంత్ రెడ్డి పతనం కోసం ఇటు కేసీఆర్, అటు బీజేపీ నేతలు ఎదురుచూస్తున్నారు. తన మిత్రుడైన జగన్మోహన్ రెడ్డి సహకారంతో తానే మళ్లీ అధికారంలోకి రావాలని కేసీఆర్ లెక్కలు వేసుకుంటుండగా, ముందుగా భారత రాష్ట్ర సమితిని మింగేసి ఆ తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని బీజేపీ తలపోస్తోంది. ఈ నేపథ్యంలో మెజారిటీ లోక్‌సభ స్థానాలను గెలుచుకొని తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాల్సిన అవసరం రేవంత్ రెడ్డికి ఏర్పడింది. ఈ కారణంగానే ఆయన సుడిగాలిని తలపించే విధంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. అంతా తానై ఎన్నికల ప్రచార భారాన్ని మోస్తున్నారు. తెలంగాణలో మెజారిటీ లోక్‌సభ స్థానాలను గెలుచుకోలేని పక్షంలో రేవంత్ రెడ్డి ఇబ్బందుల్లో పడతారు. సొంత పార్టీలో ముఖ్యమంత్రి పదవిపై పలువురు కన్నేసి ఉన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలం పుంజుకోలేక పోయినా, భారతీయ జనతా పార్టీ బలం తగ్గకపోయినా కాంగ్రెస్ అధిష్ఠానానికి రాష్ట్ర పార్టీపై పట్టు సన్నగిల్లుతుంది. అదే జరిగితే కాంగ్రెస్‌లో కుమ్ములాటలు మొదలవుతాయి. ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు లభించని పక్షంలో ఎదురయ్యే పరిణామాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా స్పష్టత ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం రెండు మూడు స్థానాలను గెలుచుకోగలిగినా భారత రాష్ట్ర సమితి సురక్షితంగా ఉంటుంది. భారతీయ జనతా పార్టీకి మెజారిటీ స్థానాలు లభిస్తే మాత్రం తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చే అవకాశం ఉంది. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు భారతీయ జనతా పార్టీ వైపు చూసే అవకాశం ఉంది. కేసీఆర్ బదులు బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటే తన వంతు సహాయ సహకారాలు అందించడానికి జగన్‌రెడ్డికి అభ్యంతరం ఉండదు. రాష్ట్రం విడిపోయినా రాజకీయాలు మాత్రం రెండు రాష్ట్రాల మధ్య ముడిపడి ఉన్నాయి. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఉనికిలో లేకపోయినా ఆ పార్టీకి ఓట్లు మాత్రం ఉన్నాయి. 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయాక రిటన్ గిఫ్ట్ ఇచ్చానని కేసీఆర్ ఎగతాళి చేశారు. అప్పటి నుంచి తెలుగుదేశం ఓటర్లు కేసీఆర్‌పై గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది చివరిలో తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బరిలో దిగకుండా దూరంగా ఉండటం వల్ల కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా లాభించింది. ఒకరకంగా ఇది కేసీఆర్‌కు చంద్రబాబు ఇచ్చిన రిటన్ గిఫ్ట్. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవు అన్నట్టుగా రాజకీయాలే ప్రధాన వ్యాపకంగా ఉండే చంద్రబాబుకు, కేసీఆర్‌కు సహజంగానే పొసగదు. జగన్మోహన్ రెడ్డి ధోరణి వేరు. ఆయనకు తాను అధికారంలో ఉండటం అవసరం. ఆ క్రమంలో రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు. అందుకే అటు కేంద్రంతో గానీ, ఇటు తెలంగాణతో గానీ ఆయన పేచీ పెట్టుకోరు. కేసీఆర్ వంటి వారికి కావాల్సింది కూడా ఇదే. తెలంగాణలో తెలుగుదేశం అభిమానులు ప్రస్తుతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మద్దతుగా ఉన్నారు. అందుకే కేసీఆర్‌కు చంద్రబాబుపైన, రేవంత్ రెడ్డిపైన కోపం. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి వస్తే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరోక్ష మద్దతు లభిస్తుంది. ఇలా జరగడం సహజంగానే కేసీఆర్‌కు నచ్చదు. అందుకే జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకోవడంతో పాటు ఆయన సహకారంతో రేవంత్ ప్రభుత్వాన్ని పడగొట్టి తాను మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కేసీఆర్ తలపోస్తున్నారు. ఇందుకోసం కుట్రలు, కుయుక్తులకు తెర తీస్తున్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలనూ చీల్చి చెండాడిన కేసీఆర్ ఇప్పుడు తన పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు శాసన సభ్యులను కాంగ్రెస్ పార్టీ చేర్చుకోవడంతో పెడబొబ్బలు పెడుతున్నారు. అన్యాయం, అక్రమం అని ఆక్రోశిస్తున్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి రావడం కేసీఆర్‌కు కష్టంగా ఉన్నట్టుంది. అందుకే ఎలాగైనా, వీలైనంత తొందరగా మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. అయితే తన పతనం కోసం అన్ని వైపుల నుంచి సవాళ్లు కాచుకొని ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో వేచి చూడాలి. లోక్‌సభ ఎన్నికల్లో గెలవడమే ప్రస్తుతానికి ఆయనకు శ్రీరామరక్ష. భారతీయ జనతా పార్టీపై పైచేయి సాధించగలిగితే ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి మరింత బలపడతారు. అదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చినా కేసీఆర్‌కు ఉపయోగపడలేరు. కాంగ్రెస్ పార్టీని చీల్చే విషయం అటుంచితే భారత రాష్ట్ర సమితిని ఖాళీ చేయడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నించకుండా ఉంటారా? ఆ పరిస్థితి ఏర్పడితే ముఖ్యమంత్రి అవడం అటుంచితే ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా కేసీఆర్‌కు పోతుంది. తాడిని తన్నేవాడు ఒకడుంటే వాడి తలను తన్నేవాడు ఉంటాడు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అత్యంత శక్తిమంతులు. అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది తమకు తిరుగుండదని విర్రవీగుతారు. అలాంటి వారికి ప్రజలే వారి స్థానాన్ని గుర్తుచేస్తుంటారు. కేసీఆర్‌ను కూడా నెత్తిన పెట్టుకున్నదీ, విసిరి కొట్టిందీ ప్రజలే. తన ప్రస్తుత దుస్థితికి ఆత్మపరిశీలన చేసుకోకుండా ప్రజలు అత్యాశకు పోయారని నిందించడం ద్వారా కేసీఆర్ ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే అడ్డదారిలో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఇప్పుడు ప్రవచనాలు చెప్పే ప్రయత్నం చేసే బదులు కోల్పోయిన ప్రజా విశ్వాసాన్ని తిరిగి పొందడానికి కేసీఆర్ ప్రయత్నిస్తే ఆయనకే మంచిది. అలా కాకుండా జగన్మోహన్ రెడ్డి వంటి వారిని నమ్ముకొని గాలిలో మేడలు కట్టడం అవివేకం అవుతుంది. మబ్బులు చూసి ముంతలోని నీళ్లు పారబోసుకున్నట్టుగా జగన్‌రెడ్డిని చూసి కేసీఆర్ ఇప్పటికే కొన్ని వర్గాలను దూరం చేసుకున్నారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోని పక్షంలో తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ అధ్యాయం చరిత్ర పుటలకే పరిమితమవుతుంది.

అంతఃపుర రహస్యాలు!

ఇప్పుడు ఇడుపులపాయ అంతఃపుర రహస్యాల గురించి మాట్లాడుకుందాం. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాజకీయ రణక్షేత్రంలో ఎదురెదురుగా మోహరించడంతో ఇడుపులపాయ అంతఃపుర రహస్యాలు వెలుగులోకి వస్తున్నాయి. అగ్నికి ఆజ్యం పోసినట్టుగా దారుణ హత్యకు గురైన వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత కూడా షర్మిలకు తోడయ్యారు. దీంతో జగన్మోహన్ రెడ్డి నిజ స్వరూపం ప్రజలకు వివరంగా తెలుస్తోంది. నామినేషన్ దాఖలు సందర్భంగా జగన్‌రెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబుతో తన చెల్లెమ్మలు చేతులు కలిపారని, అలాంటి వారు రాజశేఖర రెడ్డి వారసులు ఎలా అవుతారని విమర్శించారు. ఇందుకు షర్మిల, సునీత కూడా దీటుగా స్పందించారు. తన కుమారుడి వివాహానికి ఆహ్వానించడం కోసం చంద్రబాబు వద్దకు పసుపు చీర కట్టుకొని షర్మిల వెళ్లిందని జగన్ నిందించగా, సొంత చెల్లి దుస్తులపై విమర్శలు చేయడానికి సిగ్గు లేదా అని షర్మిల బదులిచ్చారు. పనిలో పనిగా అవినీతి కేసులలో వైఎస్ రాజశేఖర రెడ్డి పేరును సీబీఐ చేర్చడానికి జగనే కారణమని షర్మిల మరో అంతఃపుర రహస్యాన్ని బయటపెట్టారు. అవినాశ్ రెడ్డి చిన్నపిల్లాడు అని జగన్మోహన్ రెడ్డి సంబోధించడాన్ని డాక్టర్ సునీత ప్రశ్నిస్తూ, చిన్న పిల్లాడైతే స్కూలుకు పంపాలి గానీ పార్లమెంటుకు పంపాలనుకోవడం ఏమిటి? అని ప్రశ్నించారు. పనిలో పనిగా తన సోదరుడైన జగన్‌కు ఒక డాక్టర్‌గా ఆమె ఒక సలహా ఇచ్చారు. గులకరాయి తగిలినందుకే రెండు వారాలుగా కంటి పైభాగాన బ్యాండేజ్ వేసుకోవడాన్ని డాక్టర్‌గా ఆమె తప్పుబట్టారు. బ్యాండేజ్ తీసెయ్యకపోతే గాయానికి చీము పడుతుందని, అది తీసేస్తే గాలి తగిలి గాయం త్వరగా మానిపోతుందని డాక్టర్ సునీత సలహా ఇచ్చారు. నిజానికి తనకు తగిలిన చిన్న గాయానికి జగన్‌రెడ్డి రెండు వారాలుగా బ్యాండేజ్ తీయకుండా వేసుకోవడం చూసే వారికి కూడా రోతగా ఉంది. జగన్‌రెడ్డిని గుడ్డిగా సమర్థించే పేటీఎం బ్యాచ్‌కు కూడా బ్యాండేజ్ వ్యవహారాన్ని సమర్థించడం ఇబ్బందిగా మారింది. కోడి కత్తిలా గులకరాయి ఉపయోగపడకపోగా ప్రజలు కూడా జగన్‌ను ఎగతాళి చేస్తున్నారు. చిన్నాన్న వివేకానంద రెడ్డిని గొడ్డళ్లతో నరికి చంపితే గుండెపోటుతో చనిపోయారని ప్రచారం చేయించిన జగన్మోహన్ రెడ్డి.. తనకు చిన్న గాయమైతేనే హత్యాయత్నం చేశారని కేసు ఎలా కట్టించారో చెప్పాలని షర్మిల ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి జగన్‌రెడ్డి శనివారం బ్యాండేజ్ లేకుండా దర్శనమిచ్చారు. తనపై హత్యాయత్నం జరిగిందని ప్రచారం చేసుకొని లబ్ధిపొందాలని అనుకున్నారు గానీ.. శనివారంనాడు ఆయనను చూస్తే కుట్ల గురించి దేవుడెరుగు, గాయం తాలూకు ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. రక్తం పంచుకు పుట్టిన వారి మధ్య మొదలైన పోరుతో ఇడుపులపాయ కోట బీటలు వారుతోంది. ప్రస్తుత రొచ్చు నుంచి తప్పించుకోవడానికి తల్లి విజయలక్ష్మి అమెరికా వెళ్లిపోయి విశ్రాంతి తీసుకుంటున్నారు. పోలింగ్‌కు ఇంకో పదిహేను రోజుల వ్యవధి ఉంది. ఈలోపు ఇంకెన్ని అంతఃపుర రహస్యాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా తనను సమర్థించే వాళ్లు వెర్రి వెంగళప్పలని జగన్మోహన్ రెడ్డి బలంగా నమ్ముతున్నారు. నీతి, నిజాయితీల గురించి పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు. డజనుకు పైగా అవినీతి కేసులలో నిందితుడిగా ఉండి కూడా అవినీతికి ఆస్కారం లేని పాలన అందించానని చెప్పుకొనే దుస్సాహసానికి పాల్పడుతున్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య సాగుతున్న మాటల యుద్ధంలో ప్రజలు ఎవరి మాటలను నమ్ముతారో తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడవలసిందే. అడ్డదారిలో అధికారంలోకి రావాలనుకుంటున్న కేసీఆర్ ఆశలపై జగన్‌రెడ్డి అండ్ కో నీళ్లు చల్లుతారా? లేక ఆ ఆశలు చిగురింపజేస్తారా? న్యాయం కోసం పోరాడుతున్న డాక్టర్ సునీతకు ప్రజల నైతిక మద్దతు లభిస్తుందా? లేదా? వంటి ప్రశ్నలకు సమాధానం లభించాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి ఉండక తప్పదు!



> ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని కేసీఆర్ గట్టిగా కోరుకుంటున్నారు. ఏపీలో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు కూలిపోతుంది అంటారా? కేసీఆర్ లెక్కల ప్రకారం కూలిపోతుంది అంతే!

> ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి రావడం కేసీఆర్‌కు కష్టంగా ఉన్నట్టుంది. అందుకే ఎలాగైనా, వీలైనంత తొందరగా మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. అయితే తన పతనం కోసం అన్ని వైపుల నుంచి సవాళ్లు కాచుకొని ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో వేచి చూడాలి. లోక్‌సభ ఎన్నికల్లో గెలవడమే ప్రస్తుతానికి ఆయనకు శ్రీరామరక్ష. భారతీయ జనతా పార్టీపై పైచేయి సాధించగలిగితే ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి మరింత బలపడతారు. అదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చినా కేసీఆర్‌కు ఉపయోగపడలేరు. కాంగ్రెస్ పార్టీని చీల్చే విషయం అటుంచితే భారత రాష్ట్ర సమితిని ఖాళీ చేయడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నించకుండా ఉంటారా? ఆ పరిస్థితి ఏర్పడితే ముఖ్యమంత్రి అవడం అటుంచితే ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా కేసీఆర్‌కు పోతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే అత్యంత శక్తిమంతులు. అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది తమకు తిరుగుండదని విర్రవీగుతారు. అలాంటి వారికి ప్రజలే వారి స్థానాన్ని గుర్తుచేస్తుంటారు. కేసీఆర్‌ను కూడా నెత్తిన పెట్టుకున్నదీ, విసిరి కొట్టిందీ ప్రజలే.

> తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఉనికిలో లేకపోయినా ఆ పార్టీకి ఓట్లు మాత్రం ఉన్నాయి. 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయాక రిటన్ గిఫ్ట్ ఇచ్చానని కేసీఆర్ ఎగతాళి చేశారు. అప్పటి నుంచి తెలుగుదేశం ఓటర్లు కేసీఆర్‌పై గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది చివరిలో తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బరిలో దిగకుండా దూరంగా ఉండటం వల్ల కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా లాభించింది. ఒకరకంగా ఇది కేసీఆర్‌కు చంద్రబాబు ఇచ్చిన రిటన్ గిఫ్ట్. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవు అన్నట్టుగా రాజకీయాలే ప్రధాన వ్యాపకంగా ఉండే చంద్రబాబుకు, కేసీఆర్‌కు సహజంగానే పొసగదు. జగన్మోహన్ రెడ్డి ధోరణి వేరు. ఆయనకు తాను అధికారంలో ఉండటం అవసరం. ఆ క్రమంలో రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు. అందుకే అటు కేంద్రంతో గానీ, ఇటు తెలంగాణతో గానీ ఆయన పేచీ పెట్టుకోరు. కేసీఆర్ వంటి వారికి కావాల్సింది కూడా ఇదే. తెలంగాణలో తెలుగుదేశం అభిమానులు ప్రస్తుతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మద్దతుగా ఉన్నారు. అందుకే కేసీఆర్‌కు చంద్రబాబుపైన, రేవంత్ రెడ్డిపైన కోపం.

మోదీ వ్యాఖ్యలో నిజమున్నది కానీ..!

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసింది ఏమీ లేదు; రాజకీయ పార్టీలు తమ ప్రణాళికలు, ప్రత్యర్థి పక్షాలపై అవధులు లేని విమర్శలు, ప్రజలకు అరచేతిలో స్వర్గాన్ని చూపుతున్న వాగ్దానాలతో రణోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. వివిధ వర్గాలలోని తమ మద్దతుదారులను నిలుపుకోవడమూ, ఓటు బ్యాంకును విస్తృతపరచుకోవడమే వాటి లక్ష్యంగా ఉన్నది. ఇటువంటి వ్యూహాలు, ఎత్తుగడలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం మినహాయింపు కాదు. రాజస్థాన్‌లో ఒక ఎన్నికల ప్రచారసభలో ఆయన వెలువరించిన ప్రసంగమే అందుకు నిదర్శనం. సంపద పునఃపంపిణీ హామీల విషయమై కాంగ్రెస్ పార్టీపై ఆయన ఆ ఉపన్యాసంలో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ముస్లింలకు సంపదను కాంగ్రెస్ పునఃపంపిణీ చేస్తుందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 2006లో ఒక ఉపన్యాసంలో సూచించారని నరేంద్ర మోదీ రాజస్థాన్ ఎన్నికల సభలో వక్కాణించారు. కాంగ్రెస్ పార్టీ 'దేశ సహజ వనరుల'పై ప్రథమ హక్కును ముస్లింలకే ఇస్తుందని, 'చొరబాటుదారుల'కు, 'అధిక సంతానం ఉన్నవారికి' ఆస్తులను పునఃపంపిణీ చేస్తుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

మోదీ ప్రసంగంలోని ప్రస్తావనల వరుస ముస్లింల నుంచి అక్రమ వలసదారులకు, వీరి నుంచి అధిక సంతానం ఉన్న వారికి అంటూ సాగింది. ఈ ప్రస్తావనల క్రమం పొరపాటున చోటు చేసుకుందా లేక ముందుగా నిశ్చయించుకున్న ప్రకారం జరిగిందా అన్నది నేను కచ్చితంగా చెప్పలేను. అయితే అది నిస్సందేహంగా ఒక వివాదాస్పద ప్రకటన. మోదీ వ్యాఖ్యలు ఒక కీలకమైన రాజకీయ ఎత్తుగడ అని కొంతమంది వాదిస్తున్నారు. హిందూ భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు, ప్రతిపక్షాల, బీజేపీ వైఖరుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఎత్తి చూపేందుకే మోదీ ఆ వ్యాఖ్యలు చేశారనేది ఆ వాదనల సారాంశం.

మోదీ మద్దతుదారులు తమ నాయకుడు ముస్లింల విషయమై చేసిన ఈ నిర్దిష్ట వ్యాఖ్యలను సమర్థించేందుకు ఎంతదూరమైనా వెళ్లగలరు; ఎటువంటి వాదనలనైనా చేస్తారనడంలో సందేహం లేదు. మన్మోహన్ సింగ్ ప్రకటనలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తూ మోదీ ప్రసంగంలోని మిగతా అంశాల గురించి ప్రతిపక్షాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షం సైతం తమ మాజీ ప్రధానమంత్రి ప్రకటనల లక్ష్యాన్ని స్పష్టం చేయాలి, మోదీ ప్రసంగంతో తలెత్తిన సమస్యలను ఎత్తి చూపాలి.

రాజకీయ పరిస్థితుల పరంగా చూస్తే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండగలదని వ్యక్తమవుతున్న భయాలకు ప్రతిస్పందనే మోదీ వివాదాస్పద ప్రసంగమని చెప్పవచ్చు. హిందువుల ప్రయోజనాల ఏకైక రక్షణదారు భారతీయ జనతా పార్టీ మాత్రమేనని, ముస్లింలను బుజ్జగించడానికే ప్రతిపక్షం ప్రాధాన్యమిస్తుందనే భావనను స్థిరీకరించేందుకు సుస్థిరపరచడమే లక్ష్యంగా మోదీ ఆ ప్రకటన చేశారు. అభివృద్ధి సాధనలో తన సాఫల్యాల పైనే ప్రధానంగా ఆధారపడేందుకు అధికార పక్షం విముఖతను కూడా ఆ ప్రకటన ఎత్తి చూపుతోంది. అయితే మోదీ వ్యాఖ్యలపై తరచు వాద ప్రతివాదాలకు దిగే ప్రతిపక్షాలు మైనారిటీల పట్ల వివక్ష చూపుతున్న విధానాలు వేటినీ చర్చలోకి తీసుకురాలేకపోతున్నాయి. నిజానికి గుజరాత్‌లోని 70 విభిన్న ముస్లిం కులాలు, వాటిని ఓబీసీ జాబితాలో చేర్చడం మూలంగా ఏ విధంగా లబ్ధి పొందాయో జర్నలిస్ట్ స్మిత ప్రకాష్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నరేంద్ర మోదీ విపులంగా చర్చించారు.

కర్ణాటకలో యావత్ ముస్లిం మతస్థులను ఓబీసీలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరించడాన్ని విమర్శించడం ద్వారా ప్రధానమంత్రి ఒక సుసంగత అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ వర్గీకరణ అష్రాఫ్ ముస్లింలను బుజ్జగించడమూ, పస్మాండ ముస్లింల పట్ల వివక్ష చూపడమేనని చెప్పి తీరాలి. తమను ఓబీసీలుగా పరిగణించాలన్న అష్రాఫ్ ముస్లింల వాదన న్యాయసమ్మతమైనది కాదు. ఆ వర్గంలోని పేదలను ఆర్థికంగా వెనుకబడిన వర్గంలో చేర్చడం న్యాయబద్ధమవుతుంది. పస్మాండ ముస్లింలకు కేటాయించిన ఆర్థిక వనరుల నుంచి ఆ అష్రాఫ్ ముస్లింలు లబ్ధి పొందుతున్నారు.

ముస్లింలకు రిజర్వేషన్లను మత ప్రాతిపదికన కాకుండా సామాజిక- ఆర్థిక అంతస్తుల ఆధారంగా కల్పించాలని ఒక పస్మాండ ముస్లింగా నేను కోరుతున్నాను. మత ప్రాతిపదిక రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధం కావు.

ఒక పస్మాండ ముస్లింగా నా అస్తిత్వాన్ని గురించిన ఎటువంటి అవమానకరమైన వ్యాఖ్య అయినా సరే నాకు తీవ్ర మనస్తాపం కలిగిస్తుంది. మరీ ముఖ్యంగా భారత ప్రభుత్వాధినేత నుంచి అటువంటి వ్యాఖ్య రావడం ఎంతో బాధాకరమవుతుంది. ఆ వ్యాఖ్య, అక్రమ వలసలు, బుజ్జగింపు రాజకీయాలకు వ్యతిరేకంగా చేసినదైనప్పటికీ అది అంతులేని మనోవేదన కలిగిస్తుంది. అయినప్పటికీ నా భావోద్వేగాలకు అతీతంగా సమస్యను చూసేందుకు, నా నిర్ణయాలకు విధానాలు, క్షేత్ర వాస్తవాలను ఆధారం చేసుకునేందుకు ప్రాధాన్యమిస్తాను. సహ పౌరుల నుంచి గౌరవాదరాలు, సంఘీభావాన్ని కోరుకుంటున్నట్టుగానే బుజ్జగింపు రాజకీయాలను, ఇతర సామాజిక వర్గాల పట్ల వివక్షను నేను తిరస్కరించగలనా అని కూడా ప్రశ్నించుకుంటాను. అధిక సంఖ్యాకుల బాధ్యతలుగా తరచు పరిగణింపబడే సామాజిక న్యాయం, జెండర్ సమానత్వం లౌకిక వాదం గురించి ధైర్యంగా మాట్లాడగలనా అనే విషయమై కూడా తీవ్రంగా ఆలోచించుకుంటాను. 'దేశ సహజ వనరులపై మొదటి హక్కు ముస్లింలదే' తరహా ప్రకటనలను స్పష్టంగా వ్యతిరేకిస్తున్నానా అనే విషయాన్ని నేను విశ్లేషించుకుంటాను. బుజ్జగింపు రాజకీయాల నుంచి దూరం జరిగేందుకు, వాటిని ప్రశ్నించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నట్టుగా నేను భావిస్తున్నాను. అయితే యావత్ ముస్లిమ్ మతస్థులకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయడం ద్వారా ఆ లక్ష్యాన్ని సాధించడాన్ని నేను ఆమోదించ లేను. దాన్ని నేను ఖండిస్తున్నాను.

పస్మాండ ముస్లింలు చాల వరకు బుజ్జగింపు రాజకీయాల నుంచి నానా యాతనలు పడుతున్నారు. వాస్తవానికి మమ్ములను ఒక ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నారు. అష్రాఫ్ ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తూ మా హక్కులను తరచు నిర్లక్ష్యం చేస్తున్నారు. బుజ్జగింపు ధోరణులను ప్రశ్నిస్తున్నవారు ఆచరిస్తున్న రాజకీయాలు సైతం అష్రాఫ్ ముస్లింలకే అధిక లబ్ధిని సమకూరుస్తున్నాయి. సంక్షేమం సమస్థాయిలో అందక పోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటి విషమ పర్యవసానాలకు పస్మాండలు అల్లాడుతున్నారు.

> కర్ణాటకలో యావత్ ముస్లిం మతస్థులను ఓబీసీలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరించడాన్ని విమర్శించడం ద్వారా ప్రధానమంత్రి ఒక సుసంగత అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ వర్గీకరణ అష్రాఫ్ ముస్లింలను బుజ్జగించడమూ, పస్మాండ ముస్లింల పట్ల వివక్ష చూపడమేనని చెప్పి తీరాలి. తమను ఓబీసీలుగా పరిగణించాలన్న అష్రాఫ్ ముస్లింల వాదన న్యాయసమ్మతమైనది కాదు. ఆ వర్గంలోని పేదలను ఆర్థికంగా వెనుకబడిన వర్గంలో చేర్చడం న్యాయబద్ధమవుతుంది. పస్మాండ ముస్లింలకు కేటాయించిన ఆర్థిక వనరుల నుంచి ఆ అష్రాఫ్ ముస్లింలు లబ్ధి పొందుతున్నారు. ముస్లింలకు రిజర్వేషన్లను మత ప్రాతిపదికన కాకుండా సామాజిక- ఆర్థిక అంతస్తుల ఆధారంగా కల్పించాలని ఒక పస్మాండ ముస్లింగా నేను కోరుతున్నాను. మత ప్రాతిపదిక రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధం కావు.




■ అమేనా బేగం

(ది ప్రింట్)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వాసుదేవరెడ్డి సుందర్‌రాజ్ రాకేశ్‌రెడ్డి

'గులాబీ'లో ఎమ్మెల్సీ టికెట్ టెన్షన్..

వరంగల్, నల్లగొండ, ఖమ్మం అభ్యర్థిత్వానికి పోటాపోటీ

- 2007 నుంచి నాలుగు పర్యాయాలు ఎగిరిన బీఆర్ఎస్ జెండా
- తెరపైకి సుందర్‌రాజ్, వాసుదేవరెడ్డి, రాకేష్‌రెడ్డి తదితరుల పేర్లు
- నేడు వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో
- అనంతరం ఎంపీ అభ్యర్థి గెలుపు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై చర్చించే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టు సాధించేందుకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను అభ్యర్థిగా ప్రకటించటంతో బీఆర్ఎస్ తమ అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టింది. ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర వరంగల్‌కు చేరుకోనుండగా.. సాయంత్రం నిర్వహించే రోడ్డు షో అనంతరం ఎంపీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక అంశాలపై కేసీఆర్ గులాబీ నేతలతో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నాలుగు పర్యాయాలుగా వరంగల్, నల్గొండ, ఖమ్మం స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్సీగా విజయం సాధిస్తూ వస్తున్నారు. అలా బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న పట్టభద్రుల స్థానాన్ని కాపాడుకోవాలని ఆ పార్టీ వ్యూహరచన చేస్తోంది. పోటీకి కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజన్, విలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డితో పలువురు ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నారు. దీంతో కేసీఆర్ ఎమ్మెల్సీ టికెట్‌ను ఎవరికి ఖరారు చేస్తారనే ఉత్కంఠ శ్రేణుల్లో కనిపిస్తోంది.



'కంచుకోట'పై మరింత దృష్టి

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించే దిశగా బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. 2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా అప్పటి నుంచి జరిగిన నాలుగు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2007లో తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కపిలివాయి దిలీప్‌కుమార్ విజయం సాధించగా.. అప్పుడు రెండేళ్ల

మిగతా 7వ పేజీలో..

శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 41.0°C
కనిష్ఠం : 25.5°C

వరంగల్‌కు బీజేపీ చేసిందేమీ లేదు..

- తెలంగాణకు బద్ధ వ్యతిరేకి ప్రధాని మోదీ
- మతం, కులం తప్ప బీజేపీకి ఎజెండా ఏదీ?
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 27: పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ఏం చేసిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. విభజన హామీ చట్టంలో పొందుపరిచిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. శనివారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యతో కలిసి మీడియా సమావేశంలో శ్రీహరి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, మందక్రిష్ణ మాదిగపై ఆయన పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లకు అత్యంత ప్రమాదమని శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు ఇప్పటికే పేట్రేగిపోయాయని పేర్కొన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఒక్క ప్రాజెక్టు రాలేదని శ్రీహరి విమర్శించారు. విభజన హామీ చట్టంలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా తీసుకురావాలని కోరితే విస్మరించారని మండిపడ్డారు. వరంగల్‌కు ట్రిపుల్ ఐటీ ఇతర ఉన్నత విద్యా సంస్థలను ఎందుకు తీసుకురాలేకపోయారని బీజేపీపై ప్రశ్నలు సంధించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు బద్ధ వ్యతిరేకి అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు


వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

వరంగల్ ఉమ్మడి జిల్లా, నగరాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీలు ఇచ్చారని శ్రీహరి గుర్తు చేశారు. ఈ నెల 24న మడికొండలో జరిగిన జనజాతర సభలో చేపట్టే అభివృద్ధిని వివరించారన్నారు. బీజేపీకి మతం, కులం తప్ప మరే అజెండా లేదన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ఒక విధానమే ఆ పార్టీకి కరువైందని, ఈ దశలో ప్రజలు ఆ పార్టీని ఆదరించబోరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు పార్టీ అభివృద్ధి అజెండాతో పాటు సొంత అభివృద్ధి ప్రణాళిక ఉందని ఒక స్పష్టమైన విజన్‌తో ప్రజలు ముందుకు వెళుతోందన్నారు. ఈ క్రమంలోనే ప్రజలు కావ్యను ఆదరిస్తున్నారని, ఎన్నికల్లో ఆమె గెలుపు ఖాయమని తేలిందని శ్రీహరి ధీమాగా చెప్పారు. డాక్టరు కడియం కావ్య కులం, ఇతర వ్యక్తిగత విషయాలపై కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. కావ్య నామినేషన్‌ను ఎన్నికల అధికారులు ఆమోదించిన విషయం గుర్తించాలన్నారు. అయినా కొందరు అజ్ఞానంతో విష ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అదే విధంగా తన కులం విషయంలోని ఫిర్యాదులపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ గతంలో తేల్చి చెప్పిందని వివరించారు.

తాను రూ.100 కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్నట్లు మందకృష్ణ మాదిగా నిరూపిస్తే ఆ ధనాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని దళితులకు పంచి పెడతానని శ్రీహరి సవాల్ విసిరారు. మందకృష్ణ తన స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తారని, ఆయనకు దళిత జాతి పరిరక్షణలో నిజాయితీ లేదని విమర్శించారు. ఆయన చేపట్టిన సామాజిక ఉద్యమం ఎక్కడికెళ్లిందని ప్రశ్నించారు. దళిత జాతి ముసుగు తొలగించుకొని బీజేపీ ప్రచారకుడిగా మందకృష్ణ మారడాన్ని దళితులు గుర్తించారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మందకృష్ణ తన వద్దకు వచ్చి క్షమాపణలు కోరడం ఖాయమని కడియం శ్రీహరి కరాఖండిగా చెప్పారు.

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావువి దొంగ డ్రామాలని శ్రీహరి విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సవాల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వీకరించిన క్రమంలో తప్పించుకునేందుకు హరీశ్‌రావు దొంగ దారులు వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలను ప్రస్తావించడం, స్పీకరు ఫార్మాట్‌లో రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలని కోరడమే ఇందుకు నిదర్శనమన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని శ్రీహరి దుయ్యబట్టారు. కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే సరిపోతుందని కేసీఆర్ చెప్పడం తెలివి తక్కువతనమని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ విషయాన్ని కేసీఆర్ చాలా తేలికగా తీసుకుంటున్నారని విమర్శించారు. కచ్చితంగా కేసీఆరే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ చేయించిందే కేసీఆరే అని కడియం శ్రీహరి కరాఖండిగా చెప్పారు. ఆయన చేయమంటేనే అధికారులు చేశారని మీడియా ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. లేకుంటే వారు ఎలా ట్యాపింగ్ చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన పనికి అధికారులు బలి అయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జిల్లాల తగ్గింపుపై సీఎం రేవంత్ రెడ్డి కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు కడియం శ్రీహరి మీడియా ప్రశ్నకు జవాబిచ్చారు. ఈ క్రమంలో వరంగల్‌లో జిల్లాల తగ్గింపుపై కమిషన్‌కు తన అభిప్రాయాన్ని వివరిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు.


క్రీస్తుజ్యోతి చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న శ్రీహరి, కావ్య

'క్రీస్తుజ్యోతి'లో కడియం, కావ్య ప్రార్థనలు

ధర్మసాగర్, ఏప్రిల్ 27: కరుణాపురంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య శనివారం సందర్శించారు. మందిరానికి విచ్చేసిన వారికి మందిరం వ్యవస్థాపకుడు బ్రదర్ సంఘాల పాల్సన్‌రాజ్, బ్రదర్ ప్రకాష్‌రెడ్డి వారికి సాదరంగా మందిరంలోకి ఆహ్వానించారు. వారికి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం వారికి పాల్సన్‌రాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రానున్న రోజుల్లో దేవాలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆయన ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భద్రకాళి బండ్‌పై వాకర్లతో వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

మోదీ గెలుపు భారత్‌కు శ్రీరామరక్ష

- వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్
- భద్రకాళి బండ్‌పై మార్నింగ్ వాక్

హనుమకొండ టౌన్, ఏప్రిల్27: లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గెలుపు భారత్‌కు శ్రీరామరక్ష అని, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తే దేశాన్ని పొత్తిళ్లలో పెట్టుకొని కాపాడుకుంటాడని వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హనుమకొండ భద్రకాళి బండ్‌పై జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. దేశప్రయోజనాల కోసం కమలంపువ్వు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ హయాంలో ఉగ్రదాడులకు తావులేకుండా టెర్రరిజంపై ఉక్కుపాదం మోపుతూ దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించేలా రక్షణ కల్పిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే ఈ 10 ఏళ్లలో దేశం అపారమైన పురోగతి సాధించిందన్నారు. 140 కోట్ల భారతీయుల ఆశలకు నమ్మకంగా ఎన్‌డిఏ ప్రభుత్వం నిలిచిందన్నారు. యువత విషయానికొస్తే స్వయం ఉపాధి కోసం పీఎం ముద్ర యోజన ద్వారా రుణాలు ఇచ్చారని, 7 ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్, 315 మెడికల్ కళాశాలలు, 390 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. పీఎం కౌశల్ వికాస్ యోజన కింద నైపుణ్య శిక్షణ ఇచ్చారన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ మారిందన్నారు. ప్రపంచాన్ని కరోనా వణికిస్తున్న సమయంలో సుమారు 100 దేశాలకు భారత్ నుంచి టీకాలను, మందులను అందించి ప్రాణాలు పోసిందన్నారు. దేశంలోని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని 2020 నుంచి ఉచితం బియ్యం అందిస్తోందని, మరో ఐదేళ్లు ఉచితంగా రేషన్ బియ్యం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేసి ఉంచారన్నారు. వరంగల్ నుంచి తనను లోక్‌సభకు పంపిస్తే మోదీని ఒప్పించి వరంగల్‌ను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అరూరి రమేష్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్, వరంగల్ తూర్పు ఇన్‌చార్జి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రావుల కిషన్, గాడిపల్లి రాజేశ్వర్, 31వ డివిజన్ అధ్యక్షుడు కడవేరు శ్రీనివాస్, 30వ డివిజన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నర్మెట్ట శ్రీనువాస్, అరణ్యరెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి యువత మద్దతు తెలపాలి..

హసన్‌పర్తి: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యువత మద్దతు తెలిపి భవిష్యత్‌ను కాపాడుకోవాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ప్రముఖ బాక్సింగ్ కోచ్ జల్లి సాంబరాజు ఆధ్వర్యంలో 200మంది యువకులు బీజేపీలో చేరారు. వీరికి అరూరి రమేశ్, కార్పొరేటర్లు దాస్యం అభినవ్ భాస్కర్, గురుమూర్తి శివకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ద్వారా యువత కోసం కోచింగ్ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. రాజకీయాలకతీతంగా యువతకు సేవ చేశానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో యువత తనకు మద్దతు ఇచ్చి నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపెల్లి కుమారస్వామి, బీజేపీ నాయకులు ఎం.చంద్రారెడ్డి, పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వరరావు, ఎం.తిరుపతి, ఎం.హరిశంకర్, సాయి, రమేష్, శ్రీకాంత్, క్రాంతి, రాజేష్, అఖిల్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.


యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేశ్, అభినవ్ భాస్కర్


వడ్డెపల్లి బండ్‌పై ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వినయ్

ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ బీఆర్ఎస్

- వరంగల్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్‌దే..
- నేటి కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయండి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, నేతలు

రాంనగర్, ఏప్రిల్ 27: ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ భారత రాష్ట్ర సమితి పార్టీ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో ఉన్నందున శనివారం సాయంత్రం దయాకర్‌రావు, పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్, మాజీ కుడా చైర్మన్‌లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు సతీష్‌బాబు, నాగుర్ల వెంకటేశ్వర్లుతో కలిసి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని, వరంగల్ లోక్‌సభ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మచ్చలేని నాయకుడని ఆయన తెలిపారు. ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనను గమనించిన ప్రజలు.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీలేదన్నారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని ఆ పార్టీ రాజకీయం చేస్తోందన్నారు. ఆ రెండు పార్టీల అభ్యర్థులు బీఆర్ఎస్‌కు ద్రోహం చేసి అవకాశాల కోసం పార్టీ మారారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నగరానికి వస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్‌రావు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం


మిగతా 8వ పేజీలో..


ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27 : హనుమకొండ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ డ్రైవర్ మునికుంట్ల దేవేందర్ శనివారం మధ్యాహ్నం సమయంలో బస్సు నడుపుకుంటూ బస్టాండ్‌లోకి వస్తుండగా ఎదురుగా బైకుపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌ను ఆపి గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు నర్సక్కపల్లికి చెందిన రంజిత్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అదృశ్యం


హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రెడ్డికాలనీకి చెందిన వద్దూరి లింగయ్య(85).. పెద్దకొడుకు ఇంటి నుంచి శనివారం యాదవనగర్‌లో ఉంటున్న చిన్న కొడుకు శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. పెద్ద కుమారుడు రాజమౌళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


















'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' డైరెక్టర్ కనకదుర్గకు ఘన నివాళి

మడికొండలోని యూనిట్ కార్యాలయంలో కనకదుర్గ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

మడికొండ, ఏప్రిల్ 27 : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్ వేమూరి కనకదుర్గ మూడో వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా మడికొండలోని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అభ్యున్నతికి కనకదుర్గ చేసిన కృషిని వారు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి కె.రాజేశ్, బ్యూరో ఇన్‌చార్జి తడక రాజనారాయణ, ఏడీవీటీ ఇన్‌చార్జి విజేందర్‌రెడ్డి, సిస్టమ్స్ ఇన్‌చార్జి చక్రి, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

30న రేగొండకు సీఎం రేవంత్

- భారీ బహిరంగ సభకు హాజరు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30వ తేదీన భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పరకాల, భూపాలపల్లి రెండు నియోజకవర్గాల స్థాయిలో ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ సభను విజయవంతం చేయడం కోసం నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జిల్లా, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే హామీలను అమలులోకి తీసుకొచ్చామన్నారు. పార్లమెంటు ఎన్నికల అనంతరం నియోజకవర్గంలోని ఇండ్లులేని నిరుపేద కుటుంబాలకు భూములు కొనిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజలను వంచించాయని సత్యనారాయణరావు అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన బీజేపీ ఆ ఊసే మరిచిందన్నారు. రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను తీసుకురావాలని కుట్ర పన్నిందన్నారు. ఈ క్రమంలో వందలాది మంది రైతుల మృతికి కారకులయ్యారన్నారు. శవాలపై పేలాలు ఏరుకునే విధంగా జీఎస్టీ పన్నులు వసూలు చేస్తుందన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే కుట్ర చేస్తుందన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇంటికో ఉద్యోగం ఇస్తా అని, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్య ఇలా అనేక హామీలిచ్చి వాటిని తుంగలో తొక్కిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు రాం నర్సింహారెడ్డి, దేవన్, కొమురయ్య, రామ్‌చంద్రయ్య, శ్రీనివాస్, తోట రంజిత్, సంతోష్, రాజిరెడ్డి, రమేష్, భార్గవ్, శ్రీరాములు పాల్గొన్నారు.

'గులాబీ'లో ఎమ్మెల్సీ టికెట్ టెన్షన్..

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కాలపరిమితి ఉండటంతో 2009లో మరోసారి ఎన్నికలు జరిగాయి. రెండోసారి కూడా కపిలవాయి దిలీప్‌కుమార్ బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2015, 2021లో జరిగిన ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. దీంతో శాసన మండలిలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానం 17ఏళ్లుగా బీఆర్ఎస్ ఆధీనంలోనే ఉంది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరంగల్ జిల్లా వాసి అయినప్పటికీ ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉన్న వామపక్షవాదులు మద్దతుగా నిలవడంతో పల్లా గెలుపు సులువయిందనే చర్చ జరుగుతోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందటం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు పెరగడంతో గులాబీ పార్టీ కాస్త బలహీన పడిందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు పట్టభద్రుల స్థానం కూడా బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి అండగా నిలిచిన వరంగల్‌లో ఎంపీ సీటుతో పాటు ఎమ్మెల్సీ స్థానాన్ని కాపాడుకోవటం ఆ పార్టీకి సవాల్‌గా మారింది.

తెరపైకి ఉద్యమ నేతలు..

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానం నుంచి పోటీకి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలు, సీనియర్ నేతలు క్యూ కడుతున్నారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను బరిలో దించింది. 2021 మార్చి 14న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్న స్వతంత్రుడిగా బరిలో దిగి ద్వితీయ స్థానంలో నిలిచిన ఆయన బీసీ సామాజిక వర్గం నేత కావటంతో పాటు కాంగ్రెస్ టికెట్ దక్కటంతో గులాబీ పార్టీ గట్టి అభ్యర్థి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అయితే అధికార పార్టీలో ఉన్న తీన్మార్ మల్లన్నను ఢీ కొట్టే నేత ఎవరనే చర్చ బీఆర్ఎస్‌లోజరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం వరంగల్‌లో రోడ్ నిర్వహించనున్నారు. ఈ రోడ్ షో అనంతరం అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎప్ నేతలు కేసీఆర్‌తో భేటీ కానున్నట్లు సమాచారం. వరంగల్ ఎంపీ స్థానంలో ఓ ప్రవేటు సర్వేలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా రిపోర్టు వచ్చినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ సర్వే రిపోర్టు గురించి వివరించడంతో పాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై నేతలు కేసీఆర్‌తో చర్చించే అవకాశమున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు నేతలు ఉత్సాహంతో ఉన్నారు. ప్రధానంగా వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి ఎమ్మెల్సీ టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వాసుదేవరెడ్డికి.. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డి కూడా ఉప ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారని, ఆయనకు పార్టీలో చేరినప్పుడే అనేక హామీలు ఇచ్చారని, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం లేకపోవటంతో రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఉపఎన్నికల బరిలో నిలపాలని పార్టీలోని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏబీవీపీ నుంచి వచ్చిన రాకేష్‌రెడ్డి బరిలో ఉంటే విద్యార్థి సంఘం నుంచి కూడా కొంత మద్దతు లభిస్తుందని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం భావిస్తోంది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాహాటంగానే రాకేష్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అలాగే పలు విద్యా సంస్థల అధిపతిగా ఉన్న మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజు కూడా ఎమ్మెల్సీ టికెట్‌కోసం ప్రయత్నిస్తున్నారు. 2వేల మందికిపైగా ఉన్న విద్యాసంస్థల అధ్యాపకులు సుందర్‌రాజుకు మద్దతు ఇస్తారని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం అంచనా వేస్తోంది. సుందర్‌రాజు ఉద్యమకారుడిగా పనిచేసిన క్రమంలో మూడు ఉమ్మడి జిల్లాల్లోని వారితో సత్సంబధాలు ఉన్నాయని చెబుతున్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు సుందర్‌రాజుకు మద్దతుగా ఉన్నారు. అయితే అధిష్ఠానం వీరి పేర్లను పరిశీలిస్తునే కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు గట్టి పోటీ ఇవ్వగల నేతలు ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో యోచిస్తున్నట్టు సమాచారం. నల్గొండ జిల్లాకు చెందిన తీన్మార్ మల్లన్నకు పోటీగా వరంగల్ నేతనే బరిలో దించుతారనే ప్రచారం జరుగుతుండగా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బరిలో దించితే ఉప ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వవచ్చుననే చర్చ పార్టీలో జరుగుతుంది. అయితే పోటీకి ఎర్రబెల్లి సుముఖత వ్యక్తం చేస్తారా? ఆయన కాదంటే మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ పేరును కూడా పరిశీలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు ఇద్దరు ముగ్గురు సీనియర్ నేతల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. అయితే కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో.. ఎవరిని అభ్యర్థిగా బరిలో దించుతారోననే ఉత్కంఠ గులాబీ శ్రేణుల్లో నెలకొంది.

బీఆర్ఎస్‌కు సవాల్‌గా ఉప ఎన్నిక

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నిక బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారుతోంది. గత నాలుగు పర్యాయాలు విజయం సాధించిన ఎమ్మెల్సీ స్థానాన్ని ప్రస్తుతం కాపాడుకోవటం అంతా సులువు కాదనే చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో మెజార్టీ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. అంతేకాకుండా ఖమ్మం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా ఉన్నారు. దీంతోపాటు గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గట్టిపోటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు సార్లు గెలిచిన స్థానంలో పట్టు నిలుపుకోవటం బీఆర్ఎస్‌కు సవాల్‌గానే మారిందన్న చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు కూడా పట్టభద్రులు కావటంతో బీఆర్ఎస్‌కు మరింత ప్రతిష్టాత్మకంగా మారింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కోవటమే ఇబ్బందిగా మారగా, ఎమ్మెల్సీ ఉపఎన్నిక మరింతసవాల్‌గా మారిందనేచర్చ జరుగుతోంది.

గత ఎన్నికల్లో అభ్యర్థులకు పోలైన ఓట్లు

అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు
పల్లా రాజేశ్వర్‌రెడ్డి	బీఆర్ఎస్	1,11,190
తీన్మార్ మల్లన్న	స్వతంత్ర	83,629
కోదండరామ్	టీజేఎస్	70,472
జి.ప్రేమేందర్‌రెడ్డి	బీజేపీ	39,268
రాములునాయక్	కాంగ్రెస్	27,713
జయసారథిరెడ్డి	సీపీఐ	8,732

నోటా అంటే?



శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ సారి వినిపించే మాటా 'నోటా'. అంటే పైన ఏదీ లేదు అని అర్థం. పోటీ చేసే అభ్యర్థులందరికీ తిరస్కరణ ఓటును అధికారికంగా నమోదు చేయడానికి ఓటరును అనుమతించే ఎంపిక. ఓటరు నోటా మీటను నొక్కాలని ఎంచుకుంటే, ఆ ఓటరు ఏ పార్టీకి ఓటు వేయలేదని సూచిస్తుంది. 2013 సెప్టెంబరు 27న ఎన్నికల్లో 'పైన ఏదీ లేని' ఓటును నమోదు చేసుకునే హక్కును వర్తింపజేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అదేసమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో బటన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఓటర్లు నోటాను వినియోగించుకునేందుకు వీలుగా 'నన్ ఆఫ్ ది ఏబౌ' ఎంపిక కోసం ఈసీఐ ప్రత్యేక గుర్తును ప్రవేశపెట్టింది. ఈ గుర్తు అన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లలో (ఈవీఎంలు) చివరి ప్యానెల్‌లో కనిపిస్తుంది. నోటా ఎంపిక ప్రధాన లక్ష్యం ఏమిటంటే అభ్యర్థులెవరికి ఓటు వేయకూడదనుకునే ఓటర్లు తమ నిర్ణయం గోప్యతను ఎవరూ ఉల్లంఘించకుండా తిరస్కరించే హక్కును వినియోగించుకునేలా చేయడం. పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటు వేయడానికి అర్హులు కాదని భావించినట్లయితే ఓటరు తప్పనిసరిగా తిరస్కరణ ఓటును నమోదు చేయడానికి అర్హత కలిగి ఉండాలి. పౌరులందరికీ ఇచ్చిన ఓటు హక్కు తప్పనిసరిగా అసమ్మతి ఓటును అనుమతించాలి.

\- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

మూడు రకాల ఎన్నికలు


- సాధారణ, ఉప, మధ్యంతర ఎన్నికలు

సాధారణ ఎన్నికలు: ఒక ప్రజాస్వామ్య దేశంలో ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలను సాధారణ, సార్వత్రిక ఎన్నికలు అంటారు.

ఉప ఎన్నికలు: ఐదేళ్ల మధ్య కాలంలో లోక్‌సభలోగానీ, విధానసభలోగానీ సభ్యుడు రాజీనామా చేయడం, లేదా చనిపోవడం తదితర కారణాల వల్ల ఏ నియోజకవర్గమైన ఖాళీ అయితే అక్కడ నిర్వహించే ఎన్నికను ఉప ఎన్నిక అంటారు.

మధ్యంతర ఎన్నికలు: ఐదేళ్ల కాలపరిమితి ముగియక ముందే మధ్యలో అసెంబ్లీగానీ, లోక్‌సభలోగానీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మెజారిటీ కోల్పోతే నిర్వహించే ఎన్నికలను మధ్యంతర ఎన్నికలంటారు.

\- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)



కొత్తగా ఓటరు గైడ్

- పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రయత్నం
- ఓటరు గైడ్ పంపిణీకి సిద్ధం

మట్టెవాడ(వరంగల్), ఏప్రిల్ 27: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ అధికారులు వినూత్న ఆలోచనలు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. మహిళా సంఘాల సభ్యులతో, మెప్మా ఆర్‌పీలతో ఓటరు చైతన్య సదస్సులు, విద్యార్థులు, యువతి, యువకులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం, ఓటు హక్కు వినియోగించడంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

ఓటర్లందరు పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేసే విధంగా వివిధ రూపాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సౌకర్యార్థం పలు యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరు గైడ్ ను తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ తాజాగా ఓటరు గైడ్ పేరిట బుక్‌లెట్ విడుదల చేసింది. బూత్‌లెవల్ ఆఫీసర్ ద్వారా ప్రతీ ఇంటికి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రద్దీ ప్రాంతాల్లో ఓటరు గైడ్‌ను బుక్‌లెట్లను పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. ఈ గైడ్‌లో ఓటరు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వరకు సమగ్ర వివరాలను ఈ గైడ్‌లో పొందుపర్చారు.

ఓటరుకు ఉపయుక్తం ఓటరు గైడ్

ఓటు నమోదు నుంచి నామినేషన్ వరకు అన్ని వివరాలు ఈ ఓటరు గైడ్‌లో ఉండాలి. నూతన సాంకేతిక సహాయంతో ఎన్నికల కమిషన్ సేవలను ఓటర్లకు చేరవేస్తుంది. ఓటు నమోదు మొదలుకొని నామినేషన్ల వరకు ప్రతీది ఓటర్లు తమ స్మార్ట్ ఫోన్ ద్వారా చూసుకోవచ్చు. దీనికోసం పలు యాప్‌లను తీసుకొచ్చారు. వీటి గురించి ఓటరు గైడ్‌లో వివరించారు. వివిధ యాప్‌లు వాటి పనితీరు, ఓటరు ప్రతిజ్ఞ తదితర అంశాలను గైడ్ బుక్‌లో పొందుపర్చారు. అంతేగాకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సిబ్బంది, ఓటు హక్కు వినియోగం, ఈవీఎం యంత్రాల పనితీరు, వీవీ ప్యాట్‌లలో ఓటు నమోదు వివరాలు ఇలా ప్రతీ అంశంతో కూడిన ఓటింగ్ ప్రక్రియను సులువుగా తెలుసుకునేందుకు గైడ్‌ను ముద్రించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి. సీ-విజిల్ యాప్ వివరాలు, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, నో యువర్ క్యాండెట్ యాప్, ఓటు వేసే విధానం, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ స్టేషన్ వివరాలు ఈ సందేశాత్మకమైన ఓటరు గైడ్ బుక్‌లెట్ ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు. బీఎల్‌వోల ద్వారా ఈ బుక్‌లెట్‌లను మొదటిసారిగా ఓటుహక్కు వినియోగించుకునే యువతి, యువకులకు అందజేయాలని నిర్ణయించారు.

చైతన్య వంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటరు అప్రమత్తత, పరిశీలన, నిజాయితీ గల ఓటరు అనే నినాదాలతో ఈ బుక్‌లెట్‌ను రూపొందించారు. సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) బృందాలు ఫ్లెక్సీలు బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్నారు.

నేడు వరంగల్‌కు కేసీఆర్

- సాయంత్రం నగరంలో రోడ్‌షో
- సభకు హాజరుకానున్న 90వేల మంది



రాంనగర్, ఏప్రిల్ 27 : భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వరంగల్ నగరానికి వస్తున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ తరపున హనుమకొండలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు నగరానికి చేరుకునే కేసీఆర్.. నేరుగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు నివాసానికి చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం జిల్లా నేతలతో కలిసి బస్సులో అదాలత్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, పెట్రోల్ పంపు జంక్షన్ మీదుగా హనుమకొండ చౌరస్తాకు చేరుకుంటారు. చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ సభకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి దాదాపు 90వేల మందిని తరలించేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్ షోకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కేసీఆర్ రోడ్ షోకు సంబంధించి హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యవేక్షణ చేస్తున్నారు. సభను విజయవంతం చేసి బీఆర్ఎస్ సత్తా చాటేందుకు నేతలు కసరత్తు చేస్తున్నారు. కాగా, రోడ్ షో అనంతరం రాత్రి కెప్టెన్ నివాసంలో బస చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం కేసీఆర్ ఖమ్మం జిల్లాకు వెళతారు.

నామినేషన్ల ఉపసంహరణకు
రేపటితో గడువు పూర్తి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ నియోజకవర్గ నామినేషన్ల ప్రక్రియలో ఉపసంహరణల అంకానికి సోమవారంతో గడువు ముగియనుంది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తవగా.. వరంగల్ నియోజకవర్గంలో పది, మహబూబాబాద్‌లో ఐదుగురి నామినేషన్ల తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియకు అవకాశం ఉండగా.. శనివారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. ఆదివారం సెలవు కాగా సోమవారం ఈ ఉపసంహరణ ప్రక్రియకు గడువు పూర్తవనుంది. సోమవారం ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రెండు నియోజకవర్గాల్లోనూ బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాపై స్పష్టత రానుంది. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరగ్గా.. వరంగల్ లోక్‌సభ స్థానానికి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి మొత్తం 58 మంది నామినేషన్లు వేయగా పలు కారణాలతో పది మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 48 మంది బరిలో నిలిచారు. ఇక మహబూబాబాద్ పరిధిలో మొత్తం 30 మంది నామినేషన్లు వేయగా ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 25 మంది అభ్యర్థులు మిగిలారు. ఇక 29న ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత వీరిలో ఎవరుబరిలో నిలుస్తారో తేలనుంది.

బీఆర్ఎస్‌ను వీడేదిలేదు..

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, ఏప్రిల్ 27 : తాను బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి తన రాజకీయ గురువని, ఆయన తనను సొంత కొడుకులా చూసుకున్నాడని గుర్తుచేశారు. ఆయన కుమారుడికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం ఎంపీ టికెట్ కేటాయించిన నేపథ్యంలో ఖమ్మం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశానే తప్ప.. తమ మధ్య ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదగడంలో సురేందర్‌రెడ్డి పాత్ర కీలకమన్నారు. కష్టనష్టాల్లో ఉన్నప్పుడు ఆయన తనకు వెన్నుదన్నుగా ఉన్నాడని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మంచి సంబంధాలున్నాయని, అందులో తప్పేముందన్నారు. మర్యాదపూర్వకంగా కలిసినంత మాత్రాన పార్టీ వీడుతున్నట్లు ప్రచారం చేయడం సరైంది కాదని చెప్పారు.

మే 1 నుంచి లలితకళల శిక్షణ శిబిరం

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 27: జిల్లా బాల భవన్ ఆధ్వర్యంలో మే 1నుంచి జూన్ 5వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లోని బాలభవన్‌లో లలితకళలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా బాల భవన్ సూపరింటెండెంట్ ఝాన్సీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్ల వయస్సు నుంచి 16 ఏళ్ల వయస్సు కలిగిన బాలబాలికలకు మృదంగం, కూచిపూడి, నృత్యంలో వారి సృజనాత్మకతను, భావ వ్యక్తీకరణను పెంపొందించేందుకు ఉచిత శిక్షణ అందిచనున్నట్లు ఆమే వెల్లడించారు. ఆదివారం, పండగలు మినహాయించి వారంలో మిగిలిన 6రోజులు ఉదయం 7గంటల నుంచి 11.30గంటల సమయం వరకు శిక్షణ అందించనున్నట్లు ఝాన్సీ పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలబాలికలు జేఎన్‌ఎస్‌లోని జిల్లా బాలభవన్‌లో ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9912500516 నెంబర్‌లో సంప్రదించాలని ఆమే కోరారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన మేయర్ సుధారాణి



మంత్రి సురేఖను కలిసిన మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ పార్టీని వీడి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వరంగల్ మేయర్ గుండు సుధారాణి రాష్ట్ర దేవాదయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని కొండా సురేఖ నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇద్దరు కలిసి కొంతసేపు జిల్లా రాజకీయాలు గురించి మాట్లాడుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గుండు సుధారాణి తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు గుర్తించాలి



సీఎంహెచ్‌వోకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27: ఎండాకాలం కావడంతో పారిశుధ్య కార్మికులు ఎండకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సేవలను గుర్తించి కావలసిన రక్షణ పరికరాలు అందించాలని నగర పాలకసంస్థ సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌ను శనివారం ఐఎన్‌టీయూసీ అనుబంధ మున్సిపల్ జాక్ నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. పారిశుధ్య సిబ్బందికి ఆప్రాన్స్ లేకపోవడం వల్ల రోడ్లపై పనిచేస్తున్న సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని, రెండేళ్ల కిందట ఇచ్చిన పాత దుస్తులనే వేసుకోవడం వల్ల రేడియం ఊడిపోయిందని తెలిపారు. రెండు రోజుల కిందట కాజీపేటలో పారిశుధ్య విభాగం జవాన్ కొమ్ము దేవయ్యకు ఆప్రాన్ లేకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలిపారు. అధికారుల నిర్లిప్తత వల్లనే పారిశుధ్య కార్మికులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, ప్రమాదాల నివారణకు సిబ్బందికి కావలసిన కిట్లు అందించాలని కోరారు. సీఎంహెచ్‌వోను కలిసిన వారిలో జేఏసీ నాయకులు పుల్ల రమేష్, పాశం రవి, ఏకు సుధాకర్, శ్రీకాంత్, గడ్డం సునీల్‌లు ఉన్నారు.

ఓటింగ్ శాతాన్ని పెంచే కార్యక్రమాలు చేపట్టాలి

• విభిన్న కార్యక్రమాలతో ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి • జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 27: ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేలా స్వీప్ ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టనున్న కార్యక్రమాలపై స్వీప్ కోర్ కమిటీ సభ్యులతో శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యంగా పట్టణ ప్రాంతంలో ఓటింగ్ శాతాన్ని పెంచేవిధంగా విభిన్న కార్యక్రమాలతో ఓటర్లలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఓటరు చైతన్య కార్యక్రమాలు రెండు వారాలు విరివిగా చేపట్టాలని, యువ ఓటర్లు, మహిళలు, విభిన్న వర్గాలను ఓటరు చైతన్య కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలని, కరపత్రాలు, హోర్డింగ్‌లు, తదితర ప్రచార సాధనాలను వినియోగిస్తూ ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు.

ఈనెల 28వ తేదీన మహిళా సంఘాలతో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించే విధంగా స్వీప్ కృషి చేయాలని, స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలలో భాగంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా స్వీప్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన, ఇక ముందు చేపట్టనున్న కార్యక్రమాల గురించి అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు, స్వీప్ కమిటీ సభ్యులతో పాటు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లాలోని ఆయా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు. ఏఈలు, మునిసిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మైనర్ రిపేర్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యుత్, టాయిలెట్స్, ఇతర పనులను పూర్తి చేయాలన్నారు. మే 20వ తేదీలోగా పాఠశాలల్లో మైనర్ రిపేర్లు పూర్తి కావాలన్నారు. పాఠశాలల్లో చేపట్టే పనుల్లో నాణ్యత ఉండి గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న, చేపట్టనున్న అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నా యా? అని అడిగారు. సమావేశంలో డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, డీసీవో నాగేశ్వర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 27: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిమిత్తం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే తుది ఓటర్ల జాబితాను విడుదల చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల కమిషన్ ఆమోదం పొందిన జిల్లా పరిధిలోని పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.

పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను కోరారు. ఈ సమావేశంలో పరకాల, హనుమకొండ ఆర్డీవోలు నారాయణ, వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, డీటీ రామకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావు అమరేందర్ రెడ్డి, శ్యాంసుందర్, ఈవీ శ్రీనివాస్‌రావు, రజనీకాంత్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27: వరంగల్ అండర్ రైల్వే జోన్ పరిధిలో రెండు రోజుల పాటు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మసాగర్‌లోని 60 ఎంఎల్‌డీ రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 29, 30 తేదీలలో నీటి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. అండర్ రైల్వే జోన్ ప్రాంతాలైన కరీమాబాద్, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాసికుంట, ఖిలావరంగల్, దూపకుంట, వసంతాపురం, స్తంభంపెల్లి, నక్కలపల్లి, లక్ష్మీపురం, భట్టుపెల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్నపేట ప్రాంతాలకు సోమ, మంగళవారం నీటి సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులకు సహకరించాలని ప్రవీణ్‌చంద్ర కోరారు.

పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేయండి

వరంగల్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి



కేఎంసీలో ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 27: మెప్మా సిబ్బంది పోలింగ్ శాతం పెంచడానికి శక్తి వంచన లేకుండా పనిచేయాలని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన స్వీప్ -2024 అవగాహన కార్యక్రమం శనివారం వరంగల్ కేఎంసీ సెమినార్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఓటర్లలో చైతన్యం, అవగాహన పెంచేందుకు మహిళలకు రంగోలి, మెహిందీ, ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ఆర్‌పీలకు ప్రజలతో క్షేత్రస్థాయిలో సంబంధాలు ఉంటాయని, మే 8వరకు అన్ని కుటుంబాలకు ఓటరు స్లిప్పులు అందేలా చూడాలన్నారు.

బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధానంగా ఆర్‌పీలు ఎన్నికల నియమావళి ఉల్లంఘించరాదని అన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలలో పాల్గొనడం నిషేధం అన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత సెమినార్ హాల్ నుంచి కేఎంసీ ప్రధాన ద్వారం వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ఆర్‌పీలు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ జిల్లా నోడల్ అధికారి సత్యవాణి, మెప్మా పీడీ భద్రూనాయక్, తూర్పు నియోజకవర్గం నోడల్ అధికారి కోల రాజేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, టీఎంసీ రమేష్, మెప్మా సీవోలు పాల్గొన్నారు.

కాళోజీ కళాశాలపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 27: హనుమకొండలోని చింతగట్టు ప్రాంతంలో ఉన్న కాళోజీ జూనియర్ కళాశాల యాజమాన్యం వేసవి సెలవులలో తరగతులు నిర్వహిస్తున్నారని, ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి శనివారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈ కళాశాల ఒక పర్మిషన్ మాత్రమే తీసుకుని అదనంగా మరో రెండు బ్రాంచ్‌లను నడుపుతోందన్నారు. పేద విద్యార్థులను అధిక ఫీజులతో ఇబ్బంది పెడుతున్నందువల్ల వెంటనే చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునిల్‌తో పాటు వివివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారు.



జయసింహారెడ్డిని సత్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం

సివిల్స్ విజేత జయసంహారెడ్డికి సత్కారం

హనుమకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన సివిల్స్‌లో మరో ప్రయత్నంలో 104వ ర్యాంకు సాధించిన రావుల జయసింహారెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకుడు డాక్టర్ విజయ్‌పాల్ రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ రిటైర్డ్ గణాంక అధికారి అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీనియర్ అసిస్టెంట్ మల్లు రాజేందర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు.

మేడే ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్27: మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, షాపింగ్‌మాల్స్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, వస్త్ర వ్యాపారుల సమక్షంలో హనుమకొండ చౌరస్తాలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బాధ్యులు, షాపింగ్‌మాల్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, వస్త్ర సముదాలయాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

న్యూసైన్స్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

న్యూశాయంపేట, ఏప్రిల్ 27 : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూసైన్స్ కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాప్ జెమినీ, హెటిరో, అరబిందో, జెన్‌పాక్ట్, ప్రోమియా, ఎజాజ్ ఐటీ సొల్యూషన్స్, బీటల్స్, ముత్తూట్ ఫైనాన్స్, తదితర కంపెనీలు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నాయన్నారు. ఈ నియామకాలలో 2022-23 సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు, 2024 సంవత్సరంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఎంబీఏ, పీజీ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 97017 79483, 83099 01080 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల ఫీజు గడువు 15

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 27: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డిగ్రీ మొదటి, రెండో, మూడోఏడాది వార్షిక పరీక్షల ఫీజులను మే 15 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకునేందుకు గడువు పొడిగించినట్లు కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ.600, రెండు సబ్జెక్టుల వరకు రూ.500 పరీక్షల ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. ఇంప్రూవ్‌మెంట్ రాసే అభ్యర్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.300 చెల్లించాలని వివరించారు. ఇతర వివరాలకు ఫోన్ 0870-2461480 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డీఈవోపై పోలీసులకు ఫిర్యాదు చేసిన డ్రైవర్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27:హనుమకొండ డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హైపై ఆయన వద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం విధుల్లో ఉన్న డ్రైవర్ రాంసింగ్ డీఈవో ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అసభ్య పదజాలంతో దూషించినట్లు రాసింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం తప్పేనని ఇంటికి వెళ్లిన బ్రతిమిలాడిన రాంసింగ్‌ను మరోమారు డీఈవో కుటుంబ సభ్యుల ఎదుట కులం పేరుతో దూషించి దుర్భాషలాడినట్లు తెలిసింది.

బీఆర్ఎస్ ఆవిర్బావ వేడుకలు



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వినయభాస్కర్

రాంనగర్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, నన్నపునేని నరేందర్, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్, నేతలు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నాగుర్ల వెంకటేశ్వర్లు, వాసుదేవరెడ్డి, ఎల్లావుల లలితాయాదవ్, హరిరమాదేవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినయభాస్కర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని సాధించి, బంగారు తెలంగాణ నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిందన్నారు. పార్టీ రైతుల కోసం, శ్రామికుల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడుతోందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తుందన్నారు.

తెలుగులో ఇద్దరికి డాక్టరేట్



కల్లెబోయిన కుమారస్వామి



నామాల రామకృష్ణ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 27: కేయూ తెలుగు విభాగం పరిశోధకుడు కల్లెబోయిన కుమారస్వామికి కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి డాక్టరేట్ ప్రకటించారు. తొలితరం తెలంగాణ కథలు-గ్రామీణ జీవన సంస్కృతి' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ లభించింది. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్, కేయూ ఆర్ట్స్ తెలుగు మాజీ డీన్, రిటైర్డు ప్రొఫెసర్ కొంకా యాదగిరి పర్యవేక్షణలో పద్మపరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన కల్లెబోయిన కుమారస్వామి హనుమకొండ పింగళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన కల్లెబోయిన కుమారస్వామిని పింగళి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎం.శ్యామల తదితర అధ్యాపకులు. పరిశోధకులు అభినందించారు.

కేయూ తెలుగు విభాగం పరిశోధకుడు నామాల రామకృష్ణకు డాక్టరేట్ ప్రకటించారు. కొంకా యాదగిరి పర్యవేక్షణలో వరంగల్ జిల్లా పద్య కవుల్లో 'అల్లూరి రాజేశ్వర కవి జీవితం, సాహిత్యం- ప్రత్యేక అధ్యయనం' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ లభించింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెంచికలపేటకు చెందిన నామాల రామకృష్ణ రామగుండంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన రామకృష్ణను పలువరు అభినందించారు.

ఆకతాయిల అడ్డాగా హనుమకొండ బస్టాండ్

అర్ధరాత్రి మహిళలతో అసభ్య ప్రవర్తన

ఓ యువకుడికి పోలీసుల కౌన్సెలింగ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్27: రాత్రి వేళల్లో హనుమకొండ బస్‌స్టేషన్ పోకిరీలు, వ్యభిచారులకు అడ్డాగా మారింది. సాయంత్రం 6 అయిందంటే చాలు.. బస్టాండ్ ఆవరణ, లాడ్జిల ఎదుట కొంతమంది మహిళలు తిష్టవేసి ప్రయాణికులకు వలవేస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. లాడ్జిల నిర్వాహకులు సైతం వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరి చేష్టలతో కుటుంబంతో వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పోకిరీలు సైతం రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజాము వరకు బస్టాండ్‌లోనే అడ్డావేసి వచ్చిపోయే మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తెల్లవార్లూ బస్టాండ్‌లో షాపులు తెరిచే ఉండటం, బస్టాండ్ ఆవరణ, సమీపంలోని కాలనీల్లో మద్యం విక్రయిస్తుండటంతో యువకులు గుంపులుగా వస్తూ మద్యం మత్తులో బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలను వేధిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటీవలే పద్మాక్షీ స్మశానవాటికలో గంజాయి తాగుతూ పట్టుబడ్డ నిందితులు.. గంజాయి, సిగరెట్ల కోసం అర్ధరాత్రి బస్టాండ్‌కి వెళతామని పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం హనుమకొండ పోలీసులు బస్టాండ్ పరిసరాల్లో నిఘా పెట్టారు. అర్ధరాత్రి బస్టాండ్‌లో దంపతులు బస్సు దిగి భర్త మూత్రవిసర్జన కోసం పోగా, ఓ పోకిరి వచ్చి ఫోన్‌లో మాట్లాడినట్టుగా నటిస్తూ ఆ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన ఎస్సై శ్రావణ్.. యువకుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ చేసి వదిలిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. బస్టాండ్‌లోని షాపులు తెల్లవార్లు తెరవడంతో నేరాలు చోటుచేసుకుంటున్నాయని, రాత్రి 11 గంటల వరకే షాపులు మూసివేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇదిలాఉంటే.. బస్టాండ్ పరిసరాల్లో జరిగే వ్యభిచారంపై ప్రత్యేక దృష్టిసారించి లాడ్జి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను పలువురు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కాజీపేట, ఏప్రిల్ 27: కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాపూజీనగర్‌కు చెందిన జన్ను ఐలేష్ (45) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తూ ఇంట్లో గొడవపడుతుండేవాడు. కొంతకాలంగా కుటుంబానికి దూరంగా కాజీపేటలోనే వేరే ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. శనివారం బాపూజీనగర్‌లోని తన ఖాళీ ప్లాటులో మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య జన్ను సునీత సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఐలేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఐలేష్ మద్యం సేవించడవల్లే మరణించాడా, మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్ ఏప్రిల్ 27: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగం శనివారం హనుమకొండ అజర అస్పత్రి సమీపంలో బిడ్జి పనులను ఆమె పరిశీలించారు. నిర్ణీత ప్రమాణాల మేరకు నిర్మించారో లేదో తెలుసుకోవడానికి కొలతలు వేసి పరిశీలించారు. నాణ్యత నిర్ధారణకు కోర్ కటింగ్‌లు నిర్వహించారు. భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఉర్సు బండ్‌పై కొనసాగుతున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. కీర్తి బార్ సమీపంలో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, రవికిరణ్, ఏఈలు కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్, మోజామిల్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఉన్నారు.

వేయిస్తంభాలగుడిలో సంకటహర చతుర్థి



మహా అభిషేకం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు ఉపేంద్ర శర్మ

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 27: హనుమకొండలోని చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల గుడిలో సంకటహర చతుర్థిని పురస్కరించుకొని సాయంత్రం ఆలయంలోని ఉత్తిష్ట గణపతికి పంచామృతం, హరిద్రాకుంకుమ, గందోదక చూర్ణాలతో మహా అభిషేకం నిర్వహించారు. గిరికపూజతో అర్చన చేశారు. ఆలయ ప్రధాన పూజారి గంగు ఉపేంద్రశర్మ నేతృత్వంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో గంగు మణికంఠశర్మ, సందీప్ శర్మ, ప్రణయ్‌లు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉండే ఏకైక పార్టీ బీఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

వినయభాస్కర్ మాట్లాడుతూ.. అవకాశవాదులు, ద్రోహులు మాత్రమే పార్టీని వీడారని తెలిపారు. నిఖార్సైన కేడర్ ప్రస్తుతం పార్టీకి అండగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు అడుగడుగునా ప్రజలు స్వాగతం పలుకుతూ అండగా ఉంటామని హామీ ఇస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ రోడ్ షోకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'క్రీస్తుజ్యోతి'ప్రత్యేక ప్రార్థనలు

భారత రాష్ట్ర సమితి వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపెల్లి సుధీర్‌కుమార్ క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు సుధీర్‌కుమార్ హాజరయ్యారు. రెవరెండ్ పాల్సన్‌రాజ్, రెవరెండ్ జయప్రకాశ్‌రెడ్డిలు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని సుధీర్‌కుమార్‌ను ఆశీర్వదించారు. సుధీర్‌కుమార్ వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులున్నారు.

వడ్డెపల్లి బండ్‌పై ప్రచారం

వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌తో కలిసి వడ్డెపల్లి బండ్‌పై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకింగ్ చేసేవారిని పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ తనకు ఓటు వేయాలని కోరారు. తనకు ఒక అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో నేతలు పత్తి సంపత్‌రెడ్డి, పుల్లయ్య, హరి, రాకేష్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులున్నారు.



అలనాటి కథ

గాంధీజీకి పిఠాపురం రాజుల సాయం



21 గన్ సెల్యూట్ పుచ్చుకొంటున్న బరోడా మహారాజు... అరుదైన పెయింటింగ్

పిఠాపురం... ఒకప్పుడు దక్షిణ భారత దేశంలో అతి పెద్ద సంస్థానాల్లో ఒకటి. కానీ ఇప్పుడు దాని చరిత్ర గురించి తెలిసిన వారు తక్కువే! వచ్చే నెల జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ ఊరు నుంచి పవన్ కళ్యాణ్ పోటీకి దిగటంతో దేశం వ్యాప్తంగా మళ్లీ పిఠాపురం పేరు వినబడుతోంది. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి పిఠాపురం రాజ కుటుంబం ఎంతో కృషి చేసింది. సూర్యారాయాంధ్ర నిఘంటువును రాయించటం... తొలి టైప్ రైటర్‌ను తయారు చేయటంలో పాలు పంచుకోవటం... కాకినాడలో పీఆర్ కాలేజీ, హైస్కూల్‌లను స్థాపించటం... ఇలా చెప్పుకొంటూ పోతే తెలుగు జాతి అభివృద్ధిలో వారికొక ప్రత్యేక అధ్యాయం ఉంటుంది. అలాంటి పిఠాపురం రాజ కుటుంబానికి, మాకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

మా నాన్న ధన్‌రాజ్‌గిర్‌కు పిఠాపురం యువరాజు రామారావు (మహారాజా సూర్యారావు కుమారుడు) మంచి స్నేహితుడు. ఆయన హైదరాబాద్‌కు తరచూ వస్తూ ఉండేవారు. ఆయనను నేను 'రామ అంకుల్' అని పిలిచేదాన్ని. ఆ తర్వాతి కాలంలో రామ అంకుల్ కుమారుడు సూర్యారావు, కోడలు భారతీదేవి నాకు మంచి మిత్రులయ్యారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీజీకి, కాంగ్రెస్ ఉద్యమానికి దక్షిణ భారత దేశంలో సాయం చేసినవారిలో పిఠాపురం రాజ కుటుంబీకులు కూడా ఉన్నారు. దీంతో వీరికి గాంధీజీ, నెహ్రూజీ, జిన్నా, రాజగోపాలచారి వంటి జాతీయోద్యమ నాయకులతో స్నేహసంబంధాలు ఉండేవి. రామ అంకుల్... విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు కూడా దగ్గరగా ఉండేవారు. శాంతినికేతన్‌కు తరచూ వెళ్లేవారు. అంకుల్ పేరు తలుచుకోగానే... ఆయన జిన్నాకు రాసిన ఉత్తరం, ఆయనతో షికార్ (వేట)కు వెళ్లిన సందర్భాలు, నాకు టెన్నిస్ నేర్పించటానికి ఆయన చేసిన ప్రయత్నాలు... అన్నీ ఒక దాని వెనక మరొకటి గుర్తుకొచ్చాయి.



సీతాదేవి, బరోడా మహారాజు సాయాజిరావు



ప్రిన్సెస్ కమల, కూచ్‌బిహార్ యువరాజు ఇంద్రజిత్

రాజ కుటుంబాలతో సంబంధాలు...

రామ అంకుల్‌కు ఇద్దరు సోదరీమణులు. ఒక చెల్లెలు ప్రిన్సెస్ సీతాదేవిని బరోడా మహారాజు సాయాజిరావుకు ఇచ్చి వివాహం చేశారు. మా చిన్నప్పుడు అదొక పెద్ద సంచలనం. రెండో చెల్లి ప్రిన్సెస్ కమలను కూచ్‌బిహార్ యువరాజు ఇంద్రజిత్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఇలా పిఠాపురం రాజవంశీయులు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉన్నారు.

ఆ రోజుల్లో రామ అంకుల్ 'ఆలిండియా లాన్ టెన్నిస్ అసోషియేషన్' ప్రెసిడెంట్‌గా ఉండేవారు. దాంతో ఆయనకు దేశ వ్యాప్తంగా అనేక మంది క్రీడాకారులతో మంచి పరిచయాలు ఉండేవి. నాన్న కూడా అప్పుడప్పుడూ టెన్నిస్ ఆడేవారు. అందువల్ల జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ లోనే ఒక టెన్నిస్ కోర్టు ఉండేది. ఒకసారి రామ అంకుల్ పెద్దవాళ్ల రాకెట్‌తో నాకు టెన్నిస్ నేర్పించే ప్రయత్నం చేశారు. రాకెట్ పెద్దది. నా చేతులేమో చిన్నవి. అది చూసి నాన్నకు చాలా కోపం వచ్చింది. స్నేహితుడు కాబట్టి రామ అంకుల్ ముందు ఏమీ అనలేదు కానీ... ఆ తర్వాత మా ఎదురుగా ఆయనను గట్టిగా తిట్టేశారు. మా చిన్నప్పుడు హిందూ, ముస్లింల మధ్య కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తలు ఉండేవి. ఈ విషయంపై మహ్మద్ అలీ జిన్నాకు రామ అంకుల్ ఒక ఉత్తరం రాశారు. "హిందూ-ముస్లింల మధ్య ప్రశాంతమైన, న్యాయబద్ధమైన ఒప్పందం ఒకటి ఉండాలి. ఇది జరిగితే దేశమంతా ప్రశాంతత ఏర్పడుతుంది" అనేది ఆ ఉత్తరం సారాంశం. ఈ ఉత్తరానికి జిన్నా తనదైన శైలిలో జవాబు కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఒకసారి జిన్నా కనిపిస్తే... "హిందూ-ముస్లింల విషయంలో మీకు... గాంధీజీకి మధ్య ఒప్పందం కుదరలేదు. అలాంటప్పుడు మీ ఇద్దరూ కలిసి నవ్వుతూ ఎలా మాట్లాడుకోగలుగుతున్నారు?" అని రామ అంకుల్ అడిగారుట. అప్పుడు జిన్నా... "నో ఛాయిస్" అని సమాధానం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారట. ఈ విషయాలన్నిటినీ నాకు సూర్యారావు చెబుతూ ఉండేవాడు. గాంధీజీ మద్రాసు వచ్చినప్పుడు రామ అంకుల్ ఆయనకు భారీ విరాళం ఇచ్చారు. ఆ సందర్భంలో జరిగిన సభలోనే గాంధీజీ తాను బహిరంగ సభల్లో కేవలం హిందీలోనే మాట్లాడతానని ప్రకటించినట్లు జ్ఞాపకం. రాజాజీతో కూడా రామ అంకుల్‌కు మంచి స్నేహ బంధం ఉండేది. రాజాజీ మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను అంకుల్ తరచూ కలుస్తూ ఉండేవారు.



రామ అంకుల్ అనగానే గుర్తుకొచ్చే మరో జ్ఞాపకం షికార్. ఆ రోజుల్లో రాజ కుటుంబాల్లో పిల్లలందరికీ షూటింగ్ నేర్పించేవారు. నాకు చిన్నప్పటి నుంచి జీవాలను చంపటం ఇష్టముండేది కాదు. కానీ నాన్న నన్ను షికార్‌కు తీసుకువెళ్తూ ఉండేవారు. తమ్ముడు మాత్రం "జీపులో నీకు సీటు వేస్ట్" అని ఏడిపించేవారు. ఒకసారి రామ అంకుల్ మా ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఒక రైతును పులి చంపింది అనే సమాచారమొచ్చింది. దాంతో ఆ పులిని వేటాడటానికి నేను, నాన్న, రామ అంకుల్ వెళ్లాం. రాత్రంతా ముగ్గురం ఒక మంచె మీద కూర్చుని ఎదురుచూశాం. కానీ ఆ రోజు పులి రాలేదు. మరుసటి రోజు సాయంత్రం పులి సంచారాన్ని కొందరు గ్రామస్థులు గమనించి నాన్నకు చెప్పారు. నాన్న వెళ్లి ఆ పులిని చంపి, మా టెంట్ వద్దకు తీసుకువచ్చారు. ఇలాంటి ఇంకో సంఘటన బాందీపూర్‌లో జరిగింది. సాధారణంగా రాజకుటుంబాలన్నిటికీ ఊటీలో హాలిడే హోమ్స్ ఉండేవి. కోటగిరిలో పిఠాపురం, కొచ్చిన్ ప్యాలెస్‌లు, సీడర్స్‌లో సాలార్‌జంగ్ అంకుల్‌కు వుడ్‌కాట్ హాల్ ప్యాలెస్‌లు ఉండేవి. మరోసారి ఊటీ లవ్ డేల్‌లోని మా హాలీడే హోమ్‌లో రాజ కుటుంబీకులందరూ కలిశారు. రాత్రి డిన్నర్ అయిన తర్వాత నేను, తమ్ముడు చున్ను, రామ అంకుల్ ఒక జీపులో, అమ్మానాన్న మరో జీపులో బాందీపూర్ అడవికి బయలుదేరాం. ఆ రోజుల్లో బాందీపూర్ ప్రాంతంలో చాలా పులులు ఉండేవి. ఆ అడవిలో ప్రతి చెట్టు, పుట్ట అంకుల్‌కు తెలుసు. దాంతో పులులు మన ముందుకు వచ్చినప్పుడు ఎంత నిశ్శబ్దంగా ఉండాలి? వాటి అడుగు జాడలను ఎలా గుర్తుపట్టాలి? లాంటి విషయాలన్నింటినీ చెబతుండగా, ఈ లోపు ఒక పులి మా జీపు ముందర నుంచి జంప్ చేసి వెళ్లిపోయింది. చున్ను కాల్చటానికి ప్రయత్నించాడు. అప్పుడు రామ అంకుల్... "అసలు ఫన్ ముందు ఉంది" అని డ్రైవర్‌ను జీపు స్లో చేయమన్నారు. లైట్లు కూడా డిమ్ చేయించారు. దూరంగా ఆ వెన్నెల రాత్రిలో ఏనుగులు, ఎలుగుబంట్లు లాంటి జంతువులు, చిలకల్లాంటి పక్షులు అన్నీ ఒక చోట ఉండటం చూశాం. ఆ దృశ్యాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. అలాగే నాకు పుస్తకాలు ఇష్టమని తెలిసి రామ అంకుల్ అప్పుడప్పుడూ పుస్తకాలు బహూకరించేవారు. శేషేంద్రతో వివాహం జరిగిన తర్వాత కూడా అనేక సందర్భాలలో ఆయన జ్ఞాన్‌బాగ్‌కు వచ్చారు.

గచ్చిబౌలిలో పులులు...

ప్రస్తుతం గచ్చిబౌలి ఉన్న ప్రాంతాన్ని ఒకప్పుడు యల్మల అని పిలిచేవారు. అక్కడ ఒక రైల్వే లైన్ కూడా ఉండేది. చుట్టుపక్కల అంతా అడవి. కొన్నిసార్లు ఆ ప్రాంతంలో ఉన్న గ్రామాలపై పులులు దాడులు చేసి ఆవులను, మేకలను చంపేసేవి. కొన్నిసార్లు మనుషులనూ చంపేవి. ఆ సమయంలో పులల నుంచి రక్షించమని నాన్న దగ్గరకు గ్రామ ప్రజలు వచ్చేవారు. సాయంత్రానికి ఆ ప్రాంతానికి మొత్తం అందరం వెళ్లేవాళ్లం. ఆ పరిమిత సమయంలోనే మా కోసం టెంట్‌లు, వాటిలో ఫోల్డింగ్ బెడ్‌లు, పక్కనే టాయిలెట్స్ ఏర్పాటు చేసేవారు. అందరికీ వంటలు వండేవారు. రాత్రి పార్టీ కోసం సంగీత బృందం, రాత్రి అడవిలోకి వెళ్లటానికి జీపులు, గన్నులు అన్నీ సిద్ధంగా ఉంచేవారు.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

సండే సెలబ్రిటీ



ఆయన నటిస్తున్న ఒక సినిమా ఇంకా థియేటర్‌లో ఆడుతూనే ఉంటుంది. ఈలోగా ఇంకో సినిమా ప్రమోషన్స్ మొదలవుతాయి. ఆ పని జరుగుతుండగానే మరో రెండో, మూడో సినిమాల ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంటుంది. హీరోలందరూ సినిమా సినిమాకీ ఎంతో గ్యాప్ తీసుకుని తాపీగా సినిమాలు చేస్తున్న ఈ రోజుల్లో కూడా ఇంత టైట్ గా షెడ్యూల్ ప్లాన్ చేసుకుని వరుసగా సినిమాలు చేసేస్తున్న హీరో... సుహాస్. ప్రస్తుతం ఆయన చేతిలో ఏకంగా ఏడు సినిమాలు ఉన్నాయి. మే 3న విడుదలవుతున్న 'ప్రసన్నవదనం' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సుహాస్‌తో 'నవ్య' చిట్‌చాట్...

పెళ్లయిన నాలుగేళ్లకు హనీమూన్‌కు వెళ్లాం

● యూట్యూబర్ నుంచి హీరో అయ్యారు. మీ జర్నీ ఎలా అనిపిస్తోంది?

నటుడు కావాలని పరిశ్రమలోకి వచ్చాను. హీరో అవుదామని ఎప్పుడూ అనుకోలేదు. వంద దాకా షార్ట్ ఫిల్మ్స్ చేశాను. అవి చూసి 'మజిలీ', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. అందులోని పాత్రలు క్లిక్ అవడంతో జనం దృష్టిలో పడ్డాను. ఫ్రెండ్స్ అంతా కలసి 'కలర్ ఫొటో' తీద్దాం, అందులో నువ్వే హీరోవన్నారు. నాకు చెప్పలేనంత భయం వేసింది. సినిమాల్లో క్యారెక్టర్ రోల్స్ చేస్తూ బిజీగా ఉన్నాను. ఇప్పుడు హీరోగా నటించడమంటారేమిటి అనుకున్నాను. కానీ అందరూ ఒత్తిడి చేయడంతో కాదనలేకపోయాను. అలా 'కలర్ ఫొటో' నా కెరీర్‌ను మలుపు తిప్పింది.

● షార్ట్ ఫిల్మ్స్ చేసిన సుహాస్‌కి, ఇప్పటి సుహాస్‌కి తేడా ఏమిటి?

ఏమీ లేదండీ. షార్ట్ ఫిల్మ్స్ చేసినప్పటి సర్కిలే ఇప్పటికీ ఉంది. అప్పుడు షార్ట్ ఫిల్మ్స్‌కు డైరెక్ట్ చేసిన వారితోనే ఇప్పుడు సినిమాలు చేస్తున్నాను. 'కలర్ ఫొటో' రైటర్ పద్మభూషణ్, 'అంబాజీపేట..' ఇలా నా చిత్రాలకు దర్శకత్వం వహించిన వారు ఒకప్పుడు నాతో షార్ట్ ఫిల్మ్స్ తీసినవారే. అప్పుడెంత సిన్సియర్‌గా పని చేశామో, ఇప్పుడూ అలానే వర్క్ చేస్తున్నాం. 'ఛాయ్ బిస్కెట్‌'లో మంచి టాలెంట్ ఉంది. ముందు షార్ట్ ఫిల్మ్స్ చేద్దాం. తర్వాత సినిమాలు తీయాల్సిందే అని అనుకున్నాం. ఆ రోజుల్లో అవి వర్కవుట్ అయ్యాయి. లక్కీగా సినిమాలు కూడా ఆడుతున్నాయి.

● పరిశ్రమలో మీకు గాడ్ ఫాదర్ ఎవరు?

ఎవరూ లేరండి. ఇక్కడ రాణించాలంటే టాలెంట్ ఒక్కటే చాలదు. అదృష్టం కూడా కలసి రావాలి. అది నా వెన్నంటే ఉందని నా నమ్మకం. మరో విషయం ఏమిటంటే 'ఛాయ్ బిస్కెట్' సంస్థలో పని చేస్తున్నప్పుడు షార్ట్ ఫిల్మ్స్‌తో పాటు మూవీ ప్రమోషన్స్ కూడా చేసేవాళ్లం. ఆ రోజుల్లో విడుదలైన చిన్న, పెద్ద చిత్రాలకు ఇలా ప్రమోషన్స్ చేసే సమయంలో హీరోలు, దర్శకులతో పరిచయాలు కలిగాయి. వారికి సన్నిహితుడిని కాగలిగాను. నాగచైతన్య, సాయిధరమ్‌తేజ్, విజయ్ దేవరకొండ.. వీళ్లని అన్నా అని పిలుస్తూ వెంటే తిరిగేవాణ్ణి. నేను ఆర్టిస్టునయ్యాక ఆ పరిచయాలు ఉపయోగపడ్డాయి. నేనంటే ఉన్న అభిమానంతోనే వారంతా నా సినిమాలను ప్రమోట్ చేస్తున్నారు.

● కథల ఎంపికలో ఎవరి సాయం తీసుకొంటారు?

నేను ఎవరి సాయం తీసుకోనండి. నా ఫ్రెండ్ సర్కిల్ చాలా పెద్దది. నాతో షార్ట్ ఫిల్మ్స్ చేసినవాళ్లు దాదాపు పదిహేనుమంది ఉంటారు. నేనొక సినిమా చేస్తున్నాను.. ఇదీ కథ అని వాళ్లకు చెబుతాను తప్ప చేయవచ్చా, లేదా అని సలహాలు అడగను. కథ వినగానే దానికి ఎస్ ఆర్ నో అనేది నేనే చెబుతాను. సినిమా చేయాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా నాదే.

● 'అంబాజీపేట..'లో హీరో మల్లి లాంటి పాత్ర సాధారణంగా ఏ హీరో చేయరు. ఏమిటీ మీ ధైర్యం?

అదే ప్రశ్నను నాకు నేనే ఇప్పటికీ చాలాసార్లు వేసుకున్నాను. ఇంతమంది నిర్మాతలు వచ్చి సినిమాలు చేయండి, అడ్వాన్స్ తీసుకోండి అంటున్నా వాటిని ఒప్పుకోకుండా వాళ్లని రెండేళ్లు ఆపి, రెండుసార్లు గుండు కొట్టించుకుని ఆ సినిమా చేశాను. 'ఏమిటీ.. ఎందుకిలా చేస్తున్నాను' అనే ప్రశ్న నాకూ వచ్చింది కానీ కథకు న్యాయం చేయాలి, ప్రేక్షకులకు కొత్తదనాన్ని అందించాలి. దాని కోసం ఏమైనా చేయాలి అనుకున్నాను. ఆ తపనతోనే ఆ సినిమా చేశాను.



'హిట్ 2' లో విలన్‌గా నటించారు కదా.. మళ్లీ ఆ తరహా పాత్రలు చేస్తారా?

అందులో నటించిన తర్వాత వరుసగా విలన్ పాత్రలే వచ్చాయి. అందుకే గ్యాప్ ఇచ్చాను. ప్రస్తుతం అంగీకరించిన సినిమాలు పూర్తి కావడానికి మూడేళ్లు పట్టవచ్చు. ఆ తర్వాత కచ్చితంగా విలన్ పాత్రలు మళ్లీ చేస్తా.

● ఒక సినిమా అంగీకరించిన తర్వాత ఆ క్యారెక్టర్ కోసం ప్రిపేర్ అవుతుంటారా?

ప్రతి సినిమాకూ ఓ పది రోజుల పాటు వర్క్‌షాప్ చేయడం నాకు అలవాటు. దర్శకుడితో కూర్చుని ఆ క్యారెక్టర్ బిహేవియర్ ఎలా ఉండాలి, ఎలా చేయాలి.. అని చర్చిస్తా. లేదంటే సెట్‌లో నటించడం కష్టం. కనుక వర్క్‌షాప్‌లో డౌట్స్ క్లియర్ చేసుకుని షూటింగ్‌కు వెళ్లిపోతా.

● కెరీర్ బిగినింగ్‌లో బాగా స్ట్రగుల్ అయ్యారా?

ఆర్టిస్ట్ కావాలనే ధ్యేయంతో ఆఫీసుల చుట్టూ తిరిగేవాణ్ణి. ఎన్నో ఆడిషన్స్‌లో పాల్గొన్నా. కానీ అవకాశం రాలేదు. అప్పుడు షార్ట్ ఫిల్మ్స్ చేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. అవే నాకు గుర్తింపు తెచ్చాయి. ప్రారంభంలో రెండు మూడేళ్లు స్టగుల్ తప్పలేదు.

● ఇంత స్ట్రగుల్ టైమ్‌లోనే మీ ప్రేమ, పెళ్లి జరిగాయా?

ప్రేమ విషయం ఓకే కానీ, పెళ్లి జరిగే సమయానికి 'ఛాయ్ బిస్కెట్‌'లో ఉద్యోగం చేస్తున్నా. నెలనెలా జీతం వస్తుంది కనుక ఆ ధైర్యంతో పెళ్లి చేసుకున్నాను. పెళ్లయిన తర్వాత కూడా స్ట్రగుల్ ఉండేది. సినిమాల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితి కొంత బెటర్ అయింది కానీ తక్కువ డబ్బు వచ్చేది. 'కలర్ ఫొటో' తర్వాత లైఫ్‌లో సెటిల్ అయ్యాయని చెప్పాలి. ఆదాయం పెరిగిన తర్వాత, అంటే పెళ్లయిన నాలుగేళ్లకి మా ఆవిడను హనీమూన్‌కు తీసుకెళ్లా. అదికూడా... మాల్దీవులకే వెళ్లాలని మొదటి నుంచి ఫిక్స్ అయ్యా. డబ్బు వచ్చిన తర్వాత మా తొలి విదేశీ యాత్ర అదే.

● సినిమాల విషయంలో మీ శ్రీమతి సలహాలు ఇస్తుంటారా?

లేదండి. ఇంట్లో సినిమాల ప్రసక్తి రాదు. కానీ ఆర్థిక విషయాలు మాత్రం తను డీల్ చేస్తుంటుంది. మాకు ఓ బాబు. ఈ మధ్యే పుట్టాడు. తీరిక దొరికితే చాలు వాడితో గడుపుతుంటా.

● మళ్లీ ఫారిన్ ట్రిప్ ఏమీ వేయడం లేదా?

లేదండి. విదేశాలు వెళ్లాలంటే బాగా డబ్బు కావాలి కదా.

● అదేమిటండీ.. మీ పారితోషికం భారీ స్థాయిలో ఉంద'ని పరిశ్రమలో అంటున్నారు..?

ఏదో కొంచెం పెరిగింది తప్ప బయట చెబుతున్నంత స్థాయిలో లేదు. నా సినిమాలకు ఎంత మార్కెట్ ఉందో నాకు తెలుసు కనుక ఆ బడ్జెట్ దాటితే సినిమా చేయనని దర్శకనిర్మాతలకు ముందే చెప్పేస్తున్నా. ఓటీటీలో నా సినిమాను ఇంతకు కొంటున్నారు కనుక ఆ బడ్జెట్‌లోనే చేద్దాం.. థియేటర్లలో వచ్చేది మనకు బోనస్ అని చెబుతున్నా. దానినిబట్టి నా పారితోషికం తీసుకుంటున్నా. 'సుహాస్‌తో సినిమా చేస్తే సేఫ్' అని నా నిర్మాతలు అనుకోవాలి. బడ్జెట్‌ను అనవసరంగా పెంచుకోకుండా, కథకు తగ్గట్టు నిర్ణయిస్తున్నాం. ఓటీటీ ద్వారా వచ్చే మొత్తంతో నిర్మాత సేఫ్ అవ్వాలని, టేబుల్ ప్రాఫిట్ రావాలనే ఆలోచనతోనే వర్క్ చేస్తున్నా.

● మీకు వ్యక్తిగతంగా ఏ తరహా చిత్రాలు ఇష్టం?

డ్రామా జానర్‌లో ఉండే సినిమాలు ఇష్టం. నా ఫేవరెట్ ఫిల్మ్ ఏప్రిల్ ఒకటి విడుదల. అలాంటి డ్రామాలు నాకు చాలా ఇష్టం.

● ప్రస్తుతం చేసిన 'ప్రసన్న వదనం' సినిమా గురించి చెప్పండి

విడుదలకు ఇంకా ఐదు రోజులే ఉంది. సుకుమార్‌గారి దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన అర్జున్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సుకుమార్‌గారు సినిమా చూసి పదిహేను నిముషాలు మాట్లాడారు. ఎంతో అభినందించి 'ఇంకో హిట్ నీ ఖాతాలో వేసుకున్నావు సుహాస్' అన్నారు. ఆయన అలా అన్న తర్వాత సినిమా మీద నమ్మకం పెరిగింది.

● వినాయకరావు

నవ్య 'దృశ్యం పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/bhgEHvqలో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1A0OL1Oలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



సూపర్‌స్టార్ జయంతి నాడు

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'హరోం హర' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే 31న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సుధీర్‌బాబు చేతిలో వేలాయుధం ధరించి ఉగ్రంగా కనిపించారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్

కరెక్షన్ చెప్పలేకపోయాను



సుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం'. అర్జున్ వైకే దర్శకత్వంలో జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్‌రెడ్డి నిర్మించారు. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కథానాయికలు. మే 3న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ 'సుహాస్ నటన చాలా సహజంగా ఉంటుంది. పాత్రలో ఇట్టే ఇమిడిపోతాడు. ఈ సినిమా చూశాను. చాలా బావుంది. ఏ కరెక్షన్ చెప్పలేకపోయాను' అన్నారు. సుహాస్ మాట్లాడుతూ 'నా గత చిత్రాలు అన్నీ ప్రేక్షకులను అలరించాయి. ప్రసన్న వదనం కూడా అందరికీ నచ్చుతుంది. అర్జున్ చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కించాడు' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'సుకుమార్ ఈ సినిమా చూసి, 'శభాష్' అన్నారు. ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.

పద్దెనిమిదేళ్లు ఎలా గడిచాయో!

నిర్మాత బెక్కం వేణుగోపాల్ పుట్టినరోజు వేడుకని 'రోటీ కపడా రొమాన్స్' యూనిట్ శనివారం నిర్వహించింది. ఆయన ప్రారంభించిన లక్కీ మీడియా సంస్థ 18 ఏళ్ల పూర్తి చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఒక్కో సినిమా తీసుకుంటూ ముందుకు నడుస్తుంటే పద్దెనిమిదేళ్లు ఎలా గడిచాయో తెలియలేదు. నేను తీసిన ప్రతి సినిమానీ నా స్నేహితులే కొన్నారు. ఇప్పుడు వస్తున్న 'రోటీ కపడా రొమాన్స్' చిత్రం కూడా మంచి హిట్ అవుతుంది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ సినిమాను కొనుక్కుంది. వాళ్లే త్వరలో అనౌన్స్ చేస్తారు. చాలా మంచి సినిమా తీశామనే తృప్తి ఉంది' అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.





న్యూ రిలీజ్ డేట్ వచ్చేసింది!

అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా మూవీ 'కల్కి 2898 ఏ.డీ'. మే 9న విడుదల కావాల్సిన ఈ ప్రాజెక్ట్ పలు కారణాల వల్ల ఆ విడుదల తేదీని మార్చుకుంది. ఈ మూవీ లేటెస్ట్ రిలీజ్ డేట్‌ను శనివారం మేకర్స్ ప్రకటించారు. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగే కథగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన మూవీ గ్లింప్స్, అమితాబ్ క్యారెక్టర్ ఇంట్రో గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి.

ఈసారి శివాలెత్తిపోద్ది

విష్వక్‌సేన్



'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రంలో విష్వక్‌సేన్ కథానాయకుడిగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మే 17న విడుదలవుతోంది. శనివారం ఈ చిత్రం టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. విష్వక్ లంకల రత్న అనే శక్తిమంతమైన పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్‌లో మీరు చూసింది ఒక్కశాతమే. సినిమా అంచనాలకు మించి ఉంటుంది. హీరోగా మరో మెట్టు ఎక్కుతాను. ఈసారి శివాలెత్తిపోద్ది' అన్నారు. నాగవంశీ మాట్లాడుతూ 'ఇది విష్వక్ చాలా రోజుల తర్వాత నటించిన పక్కా మాస్ సినిమా. ఎన్నికల హడావిడి ముగిశాక ట్రైలర్‌ను విడుదల చేస్తాం. 'టిల్లు స్క్వేర్' స్థాయిలో బ్లాక్ బస్టర్ అవుతుంది' అన్నారు. అందరికీ ఈ సినిమా నచ్చుతుందని కథానాయిక నేహాశెట్టి తెలిపారు. ఈ చిత్రంలో విష్వక్ విశ్వరూపం చూస్తారు అని కృష్ణ చైతన్య చెప్పారు.

అందరికీ కనెక్ట్ అయ్యే కంటెంట్



'అల్లరి' నరేశ్ చాలా కాలం తర్వాత చేసిన కామెడీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు.' మే 3న విడుదల కానుంది. ఇందులో హీరోయిన్‌గా నటించిన ఫరియా అబ్దుల్లా శనివారం మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో నా పాత్ర పేరు సిద్ధి. అన్నీ ప్లాన్ ప్రకారం చేస్తూ, నిబంధనలు పెట్టుకుని అందులో బతకడం ఇష్టం లేని వ్యక్తిత్వం ఆమెది. హీరో నరేశ్ పాత్రకు పూర్తి భిన్నంగా ఉంటుంది. వీరిద్దరి మధ్య సంఘర్షణ ఆసక్తికరంగా ఉంటుంది. పెళ్లి చుట్టూ తిరిగే వినోదభరిత చిత్రం ఇది. ఒకప్పటి పెళ్లికీ, ఇప్పటి పెళ్లిళ్లకు చాలా మార్పులు వచ్చాయి. మాట్రిమోని సైట్స్‌లో ఎలా డీల్ చేస్తారనే అంశంతో పాటు పెళ్లికి సంబంధించిన ఎన్నో విషయాలను ఇందులో ఆసక్తికరంగా చూపించాం. అందరికీ కనెక్ట్ అయ్యే కంటెంట్ కనుక సినిమా విజయంపై నమ్మకం ఉంది' అన్నారు. నరేశ్‌తో పని చేయడం మంచి అనుభవం అనీ, షూటింగ్ జరిగినన్ని రోజులూ సరదాగా గడిచాయని చెప్పారు. దర్శకుడు మల్లి అంకం తనకు బౌండ్ స్క్రిప్ట్ ఇచ్చారనీ, అది తనకు ఎక్సయిటింగ్ గా అనిపించిందనీ అన్నారు. హారర్ థ్రిల్లర్‌లో నటించాలని ఉందనీ, అలాగే యాక్షన్ సినిమాలు చేసే హీరోయిన్లు ఇప్పుడు తక్కువగా ఉన్నారు కనుక ఆ తరహా సినిమాలు చేయాలని ఉందని ఫరియా మనసులోని కోరిక వ్యక్తం చేశారు.



గుసగుసలు

నేనూ మీ వాడినే...

గెలిపిస్తే టీడీపీలో చేరిపోతా!

నియోజకవర్గంలో తాను... రాష్ట్రంలో తన పార్టీ గెలుస్తుందనే నమ్మకం సన్నగిల్లుతుండటంతో వైసీపీ అభ్యర్థులు రకరకాల మాయలు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి నేరుగా టీడీపీ నేతలు, మద్దతుదారుల ఇళ్లకు వెళ్లి కలుస్తున్నారు. "నేను కూడా టీడీపీ అభిమానినే. కాకపోతే ఆ పార్టీ టికెట్ రాకపోవడంతో వైసీపీ నుంచి ఎమ్మెల్యే అయ్యాను. ఈ ఎన్నికల్లో టీడీపీదే గెలుపు. మీరు నన్ను గెలిపిస్తే ఎన్నికల తర్వాత టీడీపీలో చేరిపోతా. నన్ను నమ్మండి. మీ అభ్యర్థి మిమ్మల్ని లెక్క చేయడు. నేనైతే మీకు విధేయుడిగా ఉంటాను. విమ్మల్ని గౌరవంగా చూసుకొంటాను"అని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

డాక్టర్ సునీత 'వైద్యం'

- జగన్ గాయం 'మాయం'
- రెండు వారాల 'గులకరాయి' దెబ్బ పూర్తిగా పోయిందే?!

'అరే పోయిందే..'



అమరావతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అసలు రాయి తగిలిందా లేక దండ గీసుకుందా అనేది తెలియదు. స్వల్ప గీరుడుకు స్పాట్‌లో ఇద్దరు డాక్టర్లు, ఆస్పత్రిలో అరడజను మంది వైద్యులు చికిత్స చేశారు. అదే మనమైతే సెప్టిక్ కాకుండా అయింట్‌మెంట్ రాసుకుని వెళ్లిపోతాం. ఆయన జగన్.. పైగా ఎన్నికలు.. రెండు వారాలపాటు బ్యాండేజీతో సానుభూతి వర్షం కోసం ఎదురుచూశారు. కానీ, రివర్స్ అవుతుందని తీసేశారు. అదేం మాయో, రెండు వారాలు 'బాధ' పెట్టిన దెబ్బ పూర్తిగా మాయమైపోయింది. నిన్నటి వరకు పెద్ద బ్యాండేజీతో తిరిగిన జగన్, శనివారం వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా చిన్న గాయం కూడా లేని మోముతో కనిపించడం ఆయన పార్టీ వర్గాలనే ఒకింత ఆశ్చర్యపరిచింది. ఈ నెల 13వ తేదీన విజయవాడకు జగన్ బస్సు యాత్ర చేరుకున్న సమయంలో 'గులకరాయి' ఘటన జరిగింది. అప్పుడు కొన్ని రోజులు నుదిటికి చిన్న బ్యాండేజీతో ఆయన యాత్రలో పాల్గొన్నారు. ఆ తర్వాత నుంచి ఆ బ్యాండేజీ సైజు పెరుగుతూ పోయింది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ఆయన సోదరి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టరు సునీత మీడియా వేదికగా జగన్‌కు ఒక సూచన చేశారు. బ్యాండేజీ ఎక్కువకాలం వాడితే సెప్టిక్ అవుతుందని.. ఒక డాక్టరుగా తాను ఈ మాట చెబుతున్నానన్నారు. ఆమె సూచన జగన్‌పై బాగానే ప్రభావం చూపినట్టు కనిపిస్తోంది. ఆమె 'వైద్యం' తమ అధినేతపై బాగానే పనిచేసినట్టు ఉందని జగన్ పార్టీ వర్గాలే అంతర్గతంగా గుసగుసలాడుకుంటున్నాయి. అయితే.. సునీత సూచనపై నోరుజారిన మంత్రి బొత్స సత్యనారాయణ మాత్రం ఆటలో అరటి పండుగా మారిపోయారు. వైద్యుల సలహా మేరకే జగన్ ప్లాస్టర్ పెట్టుకున్నారనీ, సునీత టెలి మెడిసిన్ సలహాలు అవసరం లేదని శుక్రవారం బొత్స అన్నారు. చెల్లెలుగా పెళ్లిళ్లు, పేరంటాళ్లకు వెళితే పర్వాలేదని.. జగన్ నుదిటి మీది గాయం గురించి ఆమె సలహాలు అవసరం లేదనీ వ్యాఖ్యానించారు. కానీ, శనివారం ఎటువంటి గాయం జగన్ నుదిటిపై కనిపించలేదు. చానల్‌లో ఆయనను చూసినవారికి... జగన్ ముఖంలో ఏదో మిస్సయిందన్న భావన కలిగింది. అదేమిటి అనేది తెలుసుకునేందుకు, ఒక నిమిషం పట్టింది. ఆపై... 'అరే పోయిందే..' అని ఆశ్చర్యపోవడం వారి వంతు అయింది.

ముందుగానే జగన్ అస్త్రసన్యాసం

ఏపీ ప్రజలు ఓటేయరని తెలిసిపోయింది.. మేనిఫెస్టోలో ఏం చేస్తాడో చెప్పలేదు

- కిమ్‌లాంటి మనస్తత్వమే జగన్‌ది
- ఏదో రకంగా ప్రజలను ఏడిపిస్తుంటాడు: చంద్రబాబు
- ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలో సభలు



నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

నెల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తనకు ఓటు వేయరనే విషయం సీఎం జగన్‌కు తెలిసిపోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. అందుకే ఎన్నికలు అయిపోయాక రాజీనామా చేయాల్సి ఉండగా.. ఇప్పుడే అస్త్ర సన్యాసం చేశాడని ఎద్దేవాచేశారు. ఏమీ చేయలేనని ఇవాళ జగన్ తన ఎన్నికల మేనిఫెస్టోలో చేతులెత్తేశాడన్నారు. బీద ఏడుపులు ఏడ్చాడని ధ్వజమెత్తారు. రైతులకు ఏం చేస్తాడో చెప్పలేకపోయాడన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తి చేస్తాడో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ప్రజాగళంలో భాగంగా శనివారం సాయంత్రం నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. నాయకుడంటే విజన్, పరిపాలనా దక్షత ఉండాలని.. సంపద సృష్టించడమూ తెలిసి ఉండాలని... దానిని పేదలకు పంచిపెట్టాలని అన్నారు. మేనిఫెస్టోలో చేతులెత్తేసిన జగన్.. చంద్రబాబు ఎలా చేస్తాడనం ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. 'నా సమర్థతపై నమ్మకం ఉందా లేదా.. నేను చేసి చూపించానా లేదా' అని సభికులను అడుగగా.. చేసి చూపించగలరని వారు నినదించారు. 'జగన్ పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశాడు, సీపీఎస్ రద్దు హామీని గాలికి వదిలేశాడు. నిత్యావసర సరుకుల ధరలు పెంచేశాడు.. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచేశాడు. మద్యం ధరలు పెంచేశాడు, చెత్తకు కూడా పన్నేశాడు. రాష్ట్రాన్ని మాఫియా రాజ్యంగా మార్చేశాడు. ఇసుక, మైన్స్ గంజాయి, డ్రగ్స్.. చివరకు ఎర్రచందనం స్మగ్లింగ్‌లో సైతం వైసీపీ నేతల హస్తం ఉంది. ఎవరైనా అడ్డం వస్తే అడ్డంగా నరికేసేంతగా రాక్షస పాలన సాగించాడు' అని విరుచుకుపడ్డారు.

నవ్వినా, ఏడ్చినా కొడతాడు

"నార్త్ కొరియాలో కిమ్ అనే నియంత ఉన్నాడు. జగన్ మనస్తత్వం కూడా ఆయనలాగే ఉంటుంది. ఏదో రకంగా ప్రజలను ఏడిపిస్తూనే ఉంటాడు. బాధ్యతగల ఓ సీనియర్ రాజకీయ నాయకుడిగా హెచ్చరిస్తున్నా. నా బాధ నా గురించి కాదు. రాష్ట్రం గురించి, రాష్ట్ర ప్రజల గురించి.. మేం అధికారంలోకి వస్తే అభివృద్ధి. జగన్‌కు మళ్లీ చాన్సిస్తే అరాచకం. బాదుడు లేని రాష్ట్రం కావాలంటే తెలుగుదేశం రావాలి. మీ భవిష్యత్‌కు పూచీ నాది. చరిత్ర తిరగరాసే బాధ్యత నాది. ఎన్డీయేని గెలిపించండి. జగన్ జాబ్ కేలండర్ అన్నాడు. ఈ ఐదేళ్ల కాలంలో యువతకు ఉద్యోగాలు వచ్చాయా, పరిశ్రమలు వచ్చాయా..? జే బ్రాండ్ మద్యంతో ఆరోగ్యాన్ని కుళ్లబొడిచి ఆడపడుచుల మంగళసూత్రాలను తెంచేసిన దుర్మార్గుడు. ఇలాంటి వ్యక్తులకు మళ్లీ ఓటు వేస్తారా? ఈసారి జగన్ అధికారంలోకి వస్తే మీ ఆస్తులు మీ చేతుల్లో ఉండవ్.. రికార్డులన్నీ పోతాయి. ఆన్‌లైన్‌లో ఉంటాయి. ఆ కీ జగన్ దగ్గర ఉంటుంది. ఎవరి స్థలం కొట్టేసినా తెలుసుకోవడం కష్టం. ఆత్మహత్యలు తప్ప మరో మార్గం ఉండదు"అని చంద్రబాబు అన్నారు.

జగన్ వస్తే జనం ఇళ్లూ తాకట్టుకే!

- ప్రమాదకర పాలసీలు తెస్తున్నారు
- మళ్లీ వస్తే రోడ్డుకు లాగేస్తారు
- జనసేనాని పవన్ కల్యాణ్



కాకినాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి జగన్ అధికారంలోకి వస్తే ప్రజల సొంత ఇళ్లను కూడా తాకట్టు పెట్టేస్తారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. ప్రమాదకరమైన పాలసీలను తెస్తున్న జగన్ ప్రభుత్వం మళ్లీ వస్తే ప్రజలను రోడ్డుపైకి లాగేస్తారన్నారు. 2019 ఎన్నికలకు ముందు మద్య నిషేధం చేస్తానన్న జగన్.. అధికారంలోకి వచ్చాక సారాయి వ్యాపారిలా మారారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్ని సామాజికవర్గాలకు అన్యాయం చేసిన వైసీపీకి అసలు ఓటు అడిగే హక్కేలేదని మండిపడ్డారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇంద్రపాలెంలో శనివారం 'వారాహి విజయభేరి' సభలో పవన్‌కల్యాణ్ ప్రసంగించారు. కాకినాడలో గంజాయిని ప్రోత్సహిస్తున్న వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కన్నబాబుతో నరకం స్పెల్లింగ్ రాయిస్తానని హెచ్చరించారు. వీరి ధ్దరి అంతు తేల్చడానికే పిఠాపురం నుంచి పోటీచేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు రాజధానుల పేరుతో జనం చేతిలో చిప్ప

- జగన్ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ మయం: షర్మిల



పాడేరు, అనకాపల్లి, అరకులోయ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి మయం చేశాడు. అభివృద్ధి, సంక్షేమం వదిలేసి రాష్ట్రాన్ని మద్యం అమ్మకాల్లో ముందుకు తీసుకువెళ్లారు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు, అరకులోయ, అనకాపల్లి జిల్లా పాయకరావుపేటల్లో శనివారం ఏపీ న్యాయయాత్ర సభలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు అమరావతిని రాజధానిగా చేస్తానని భ్రమరావతి చేస్తే, జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులు అంటూ రాష్ట్ర ప్రజల చేతిలో చిప్పపెట్టి రాజధానే లేకుండా చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 23 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి ఐదేళ్లు కాలయాపన చేశారని విమర్శించారు.. రెండు నెలల ముందు 6,000పోస్టులతో దగా డీఎస్సీ ఇచ్చారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 2.25 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటిని భర్తీ చేయకుండా జగన్మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లు ఏమి చేస్తున్నారు..? గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారా..? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా మన బిడ్డలకు, రాష్ట్రానికి ఊపిరిలాంటిదని ఈ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు ఇద్దరూ బీజేపీకి తొత్తులుగా మారారని విమర్శించారు. మన రాష్ట్రానికి ఇప్పటికీ బీజేపీ వెన్నుపోటు పొడుస్తూనే ఉందన్నారు.

నా ఫోన్ సంభాషణలను మాధవరం విన్నారు

- ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన పాత్రను విచారించండి
- కేపీహెచ్‌బీ సీఐకి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వినతి

కేపీహెచ్‌బీకాలనీ, పంజాగుట్ట ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమ పార్టీ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేజెండ్ల కిషోర్ బాబు శనివారం కేపీహెచ్‌బీ సీఐకి ఫిర్యాదు చేశారు. 2020 నవంబర్ నుంచి 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే వరకు తన ఫోన్‌ను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు విన్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి టీడీపీ కార్యక్రమాలను అడ్డుకోవడమే కాకుండా తమ మధ్య గొడవలు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన ఆ ఇద్దరు ప్రజాప్రతినిధులతో పాటు అందుకు సహకారం అందించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని న్యాయవాది అరుణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. ఈ మేరకు పంజాగుట్ట పీఎస్‌లో శనివారం ఫిర్యాదును అందజేశారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆరే ప్రధాన నిందితుడని ఆరోపించారు.



రాష్ట్ర జీఎస్‌టీలో 138% వృద్ధి

2017 ఆగస్టులో రూ. 841 కోట్లు.. ఈ ఏప్రిల్‌లో రూ. 2004 కోట్లు



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. 2017 ఆగస్టులో రూ.841 కోట్లు వసూలైన ఎస్‌జీఎస్‌టీ... 2024 ఏప్రిల్‌లో రూ.2004 కోట్లకు పెరిగింది. అంటే.. ఏకంగా 138.76 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది రాష్ట్ర ఖజానాకు ఊతమిస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. వివిధ రకాల పన్నులను కేంద్ర ప్రభుత్వం విలీనం చేసి, 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీని అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ), స్టేట్ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ), ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) అనే మూడు రకాలు ఉంటాయి. స్టేట్ జీఎస్‌టీ కింద వసూలయ్యే సొమ్మంతా రాష్ట్ర ఖజానాలో చేరుతుంది. ఐజీఎస్‌టీ కింద కూడా కేంద్రం నుంచి ప్రతి నెలా కొంత సొమ్ము వస్తుంది. కేవలం ఎస్‌జీఎస్‌టీ వివరాలను పరిగణనలోకి తీసుకుంటే గత ఏడాది ఏప్రిల్‌లో రూ.1806 కోట్లు రాగా.. ఈ ఏప్రిల్ వచ్చేసరికి 11.18 శాతం (రూ.202 కోట్లు) వృద్ధి నమోదైంది. గత నెలలో రూ.1854 కోట్లు వచ్చింది. దాంతో పోల్చి చూసినా ఏప్రిల్‌లో 8.30 శాతం (రూ.154 కోట్లు) అధికం.

ఎస్‌జీఎస్‌టీపై కొవిడ్-19 దెబ్బ

ఎస్‌జీఎస్‌టీపై కొవిడ్-19 తీవ్రంగా దెబ్బ కొట్టింది. అన్ని రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ రాబడి తగ్గింది. వస్తువుల కొనుగోళ్లు తగ్గడం, దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితితో జీఎస్‌టీ వసూళ్లపై ప్రభావం పడింది. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పంజా విసిరిన విషయం తెలిసిందే. పర్యవసానంగా 2020 మార్చిలో రూ.1140 కోట్ల ఎస్‌జీఎస్‌టీ వసూలు కాగా లాక్‌డౌన్ ప్రభావంతో ఏప్రిల్‌లో రూ.253 కోట్లకు, మేలో రూ.543 కోట్లకు పడిపోయింది. మళ్లీ జూన్‌లో కాస్త పుంజుకుని రూ.1074 కోట్లు వసూలైంది. 2021లోనూ కరోనా విజృంభించడంతో మే నెల మొదటి వారం నుంచి లాక్‌డౌన్ ప్రారంభమైంది. దాంతో మే, జూన్ నెలల రాబడిపై ప్రభావం పడింది. ఆ సంవత్సరం ఏప్రిల్‌లో రూ.1450 కోట్ల మేర వసూలైన ఎస్‌జీఎస్‌టీ... మేలో రూ.856 కోట్లకు, జూన్‌లో రూ.873 కోట్లకు పడిపోయింది. మళ్లీ జూలైలో రూ.1152 కోట్లు, ఆగస్టులో రూ.1123 కోట్లు, సెప్టెంబరులో రూ.1170 కోట్లు వసూలైంది.

గత ఏప్రిల్ నుంచి ఈ ఏప్రిల్ వరకు ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు (రూ.కోట్లలో)

2023	
ఏప్రిల్	1806
మే	1454
జూన్	1562
జూలై	1637
ఆగస్టు	1438
సెప్టెంబరు	1874
అక్టోబరు	1589
నవంబరు	1628
డిసెంబరు	1576
2024	
జనవరి	1850
ఫిబ్రవరి	1746
మార్చి	1854
ఏప్రిల్	2004

ఎండల్లో ఎందుకోయ్!

సూరీడి దెబ్బకు నేతల విలవిల.. ఎండల తీవ్రతతో ప్రచార వ్యూహాల్లో మార్పు.. ఉదయం, రాత్రే సభలు

- ఆయన ఓ పార్టీ అగ్ర నేత.. స్వయంగా ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఎండ దంచేస్తున్నప్పటికీ.. నామినేషన్ వేసిన ఉత్సాహంలో రోజంతా ప్రచారంలో పాల్గొన్నారు. రాత్రి వేళకు డీలా పడిపోయారు. జర్నలిస్టులతో మాట్లాడే సత్తువ కూడా లేదు. నామినేషన్ నాడే ఇలాగైతే ముందుముందు కష్టమేనని అర్థమై మరుసటి రోజు నుంచి ప్రచార శైలి మార్చుకున్నారు.

- జాతీయ పార్టీ అగ్ర నేత ఒకరు తమ ఎంపీ అభ్యర్థి తరపున ప్రచారానికి వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సభ ఏర్పాటు చేశారు. అప్పటికే ఎండ ముదిరింది. సభ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. అప్పటికే జనమంతా చెట్ల కిందకు, హోటళ్లలోకి వెళ్లిపోయారు. ప్రజలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో అగ్ర నేత త్వరగా సభను ముగించుకుని వెళ్లారు.



ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని పార్టీలూ రాత్రుళ్లే సభలు నిర్వహిస్తున్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో కాంగ్రెస్ సంగారెడ్డి సభ ఇది.

మండు వేసవిలో ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి ఇది. ఎండలు ఠారెత్తిస్తుండడంతో.. "ఎవరి గాలి వీస్తున్నదో తర్వాతి సంగతి.. ముందు వడగాలి బారిన పడకుండా ఉండడం ముఖ్యం" అన్నట్లుంది రాజకీయ పార్టీల నాయకుల ఆలోచన. 45 డిగ్రీల ఉష్ణోగ్రతతో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తుండడంతో వారు ప్రచార తీరును మార్చుకోవాల్సి వస్తోంది. గెలుపు కోసం ఉదయం నుంచి రాత్రి వరకు తిరగాలని మనసు ఒత్తిడి చేస్తున్నా సూరీడి దెబ్బకు వెనకడుగు వేస్తున్నారు. తెగించి తిరిగితే మరుసటి రోజుకు నీరసం, నిస్సత్తువ ఆవరిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మరో 2 వారాలు (మే 11 వరకు) ప్రచారం ఎలాగోననే ఆందోళన నెలకొంటోంది. దీంతో పగటి వేళ ప్రచారాన్ని వీలైనంత తగ్గించుకుని, భారీ బహిరంగ సభలు లేకుండా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లకు పరిమితం అవుతున్నారు. ఎందుకొచ్చిన ఇబ్బంది అనుకుంటూ ప్రచారానికి జనం కూడా మొహం చాటేస్తున్నారు. అభిమానం ఉన్నా, డబ్బులిస్తామన్నా గడప దాటడం లేదు. ఫలితంగా ఈసారి ప్రచార వ్యూహాలే మారిపోతున్నాయి. ఉదయం ఇంటింటి ప్రచారాలు చేసి.. మధ్యాహ్నం పార్టీ కార్యాలయాలకు చేరుకుంటున్న నేతలు, కార్యకర్తలతో సమావేశాలు పెట్టుకుంటున్నారు. మళ్లీ సాయంత్రం రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లకు వెళ్తున్నారు.

ముఖ్య నేతలందరిదీ అదే దారి

కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, సమాచార మంత్రి అనురాగ్ ఠాగూర్, పలు రాష్ట్రాల సీఎంలు, బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ ప్రచారం చేస్తున్నారు. రేవంత్ ఉదయం లేదంటే సాయంత్రం నిర్వహించే సభలు, రోడ్ షోల్లో పాల్గొంటున్నారు. కేసీఆర్ బస్సు యాత్రను సాయంత్రానికే పరిమితం చేశారు. కార్నర్ మీటింగ్‌లు పెడుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా ఉదయం లేదా సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ఇదే బాటలో ఉన్నారు. మధ్యాహ్నం ఎండలో తిరగొద్దంటూ విశ్వేశ్వర్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు సమాచారం చేరవేస్తున్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటున్నారు.

వికేంద్రీకృత ప్రచారం

ఇదివరకు అభ్యర్థులే ప్రతి వీధి, ప్రతి బస్తీ తిరిగి ప్రచారం చేసేవారు. మూడు దఫాలుగా తిరిగేవారు. ఇప్పుడు రెండు రౌండ్లు వెళ్లడమే అసాధ్యమని భావిస్తున్నారు. కొన్ని ఇళ్లకు స్వయంగా వెళ్తూ, మరికొన్ని ఇళ్లకు వెన్నంటి ఉండే నేతలను పంపుతున్నారు. అప్పటికీ ఉక్కపోత, వడగాలులు తట్టుకోలేక కూర్చున్న చోటే కాస్త కునుకు తీస్తున్నారు. జనాన్ని తరలించి బహిరంగ సభలు పెట్టే బదులు తామే వారి వద్దకు వెళ్లాలన్న ఉద్దేశానికి వచ్చారు. రాత్రి పూట వీధి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోనూ కొన్నిటికి నేరుగా వెళ్తూ, మరికొన్ని సభలకు పార్టీ నాయకులను పంపిస్తున్నారు. ఇంకా కొందరు నేరుగా ప్రచారం చేయలేక శైలిని మార్చుకుంటున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం, మండలం స్థాయిగా ప్రచారాన్ని వికేంద్రీకరణ చేసి దిగువ స్థాయి కేడర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

కొత్త వారికి కష్టాలు

కొన్ని స్థానాల్లో సిటింగ్ ఎంపీలు, మాజీలు పోటీ పడుతున్నారు. మరికొన్నిచోట్ల కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినవారు బరిలో నిలిచారు. వీరంతా గతంలో ఇంతగా ఎండలో తిరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీతో ఎండ దెబ్బను చవిచూడాల్సి వస్తోంది. పోటాపోటీ నెలకొన్న స్థానాల్లో అయితే అభ్యర్థులకు కంటిపై కునుకు లేదు. ప్రత్యర్థుల వ్యూహాలు, ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాగా, ఎండల ధాటి కొనసాగితే పోలింగ్ రోజున ఓటర్లు హక్కును వినియోగించుకునేందుకు రావడం కష్టమే. మరోవైపు ఎండల కారణంగా ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రాష్ట్రాల్లో పోలింగ్ వేళలను పొడిగించింది.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్



ఎండదెబ్బ తగలకుండా ఉండడానికి తలకు, చెవుల చుట్టూ కండువా కట్టుకున్న హరీశ్



ఎండ తగలకుండా బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ప్లాన్. కాషాయ జెండానే కవచంగా చేసుకున్న వైనం. అంతేనా.. ముఖానికి ఎండ తగలకుండా టోపీ, చేతులకు సాక్సులు ఆమె స్పెషల్.



పగలు ప్రచారం చేయాలంటే ఎండ దెబ్బ. అందుకే అన్ని పార్టీలూ రాత్రి రోడ్ షోలు, కార్నర్ మీటింగులకు పెద్దపీట వేస్తున్నారు. నాగారంలో శుక్రవారం రాత్రి ఈటల రోడ్ షో



జనగామలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కేసీఆర్.. ఎక్కువ మాట్లాడితే జైల్లో వేస్తాం

- మీ అవినీతిని బయటకు తీస్తాం.. తిన్నది కక్కిస్తాం
- ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడండి
- ఫోన్‌ట్యాపింగ్, దొంగ ఓట్లతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గెలుపు
- కోర్టులో నేరం రుజువైతే వారి సభ్యత్వం రద్దు అవుతుంది
- జనగామలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఎక్కువ తక్కువ మాట్లాడితే జైల్లో వేస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామలో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ అవినీతిని బయటకు తీసి తిన్నదంతా కక్కిస్తామన్నారు. బిడ్డ కవిత తిహాడ్ జైలుకు పోయినా కేసీఆర్‌కు సిగ్గు, శరం లేదని మండిపడ్డారు. కాళేశ్వరం కూలిపోయిందని, రేపో మాపో కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్, హరీశ్‌రావు జైలుకు పోతారని జోస్యం చెప్పారు. ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని కేసీఆర్‌ను నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను బతికి బట్ట కట్టనివ్వమని శపథం చేశారు. కాంగ్రెస్.. మరో 20 ఏళ్ల అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డికి కోమటిరెడ్డి సోదరులు తోడైతే ఒక్కరి అడ్రస్ కూడా ఉండదని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్, దొంగ ఓట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశం కోర్టులో రుజువైతే 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కానుందని అన్నారు. కోర్టు ధర్మం వైపు నిలబడి చరిత్రలో నిలిచిపోయే తీర్పు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముస్లింలు దేశద్రోహులా.. బీజేపీ ఆంతర్యమేంటి?

- మత విద్వేషాలను రెచ్చగొట్టే కుట్ర
- తీరు మారకపోతే మాధవీలతకు డిపాజిటూ రాదు: అసదుద్దీన్
- అన్సారీ మరణం ప్రభుత్వ హత్య
- వారాణసీ ప్రచారంలో ఒవైసీ



హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను విస్మరించిన బీజేపీ దేశభక్తిపై ప్రచారం చేసుకుంటోందని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ముస్లింలు ప్రాణత్యాగాలు చేసినప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. శనివారం కార్వాన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఒవైసీ మాట్లాడారు. నిజాం రాజ్యంలో స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రెసిడెన్సీపై పోరాడి జైలు పాలైన మౌల్వీ ఇస్మాయిల్, ప్రాణత్యాగం చేసిన తుర్రెబాజ్‌ఖాన్ చరిత్రలు తెలుసుకోకుండా బీజేపీ నేతలు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ముస్లింలను దేశద్రోహులుగా చిత్రీకరించడంలో బీజేపీ నేతల ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. 17 కోట్ల మంది భారతీయ ముస్లింలను చొరబాటుదారులని వ్యాఖ్యానించిన ప్రధాని మోదీ ముస్లింల దేశభక్తిని పరీక్షిస్తున్నారన్నారని విమర్శించారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత మసీదు వైపు బాణం సంధిస్తూ మతవిద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు యత్నించారని ఆరోపించారు. ఇదే తీరు కొనసాగిస్తే ఆమెకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. ఇక, వారాణసీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఒవైసీ.. గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత ముక్తార్ అన్సారీ అమరవీరుడు(షహీద్) అని వ్యాఖ్యానించారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అన్సారీకి విషమిచ్చి చంపారని, ఇది ముమ్మాటికీ యూపీలోని బీజేపీ సర్కారు చేసిన హత్యేనని ఆరోపించారు.

రెండో దశలో 66.7% పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల రెండో దశలో 66.7% పోలింగ్ నమోదైంది. రెండో దశలో 13 రాష్ట్రాల్లోని 88 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. 2019 ఎన్నికలతో పోల్చితే పోలింగ్ శాతం తగ్గింది. క్రితంసారి రెండో దశలో 13 రాష్ట్రాల్లోని 95 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగగా 69.64 శాతం పోలింగ్ నమోదయింది. మొదటి దశలోనూ ఓటింగ్ శాతం తగ్గింది. తీవ్రమైన ఎండలే ఓటింగ్ తగ్గడానికి కారణంగా భావిస్తున్నారు. కాగా, కర్ణాటకలో 69.56% పోలింగ్ నమోదైంది. కర్ణాటకలో శుక్రవారం 14 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు.

నా అరెస్టు చట్టవిరుద్ధం

» కౌంటర్ అఫిడవిట్‌లో కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో లోక్‌సభ ఎన్నికలకు ముందు తనను అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ శనివారం సుప్రీంకోర్టుకు తెలిపారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు జరగాల్సిన సమయంలో తనను దురుద్దేశంతో ఈడీ అక్రమంగా అరెస్టు చేసిందని పేర్కొన్నారు. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీ అఫిడవిట్ దాఖలు చేయగా దానికి ఆయన కౌంటర్ దాఖలు చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పుడు తనను అరెస్టు చేసిన తీరు, సమయం ఈడీ నిరంకుశత్వానికి అద్దం పడుతోందన్నారు. తనకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని ఈడీ సాక్షులను బలవంతం చేసిందన్నారు. గోవా ఎన్నికల ప్రచారంలో 'సౌత్ గ్రూపు' నుంచి నిధులు అందాయని నిరూపించడానికి ఈడీ దగ్గర ఎటువంటి ఆధారాలు లేవని కేజ్రీవాల్ అన్నారు. కాగా, జైలులో కేజ్రీవాల్ ఆరోగ్యంగానే ఉన్నారని ఎయిమ్స్ వైద్య బృందం ధ్రువీకరించింది. ఆయనకు ఇస్తున్న మందుల మోతాదు మార్చాల్సిన అవసరం లేదని పేర్కొంది.

హెలికాప్టర్‌లో జారిపడ్డ మమత

కోల్‌కతా, ఏప్రిల్ 27: పశ్చిమబెంగాల్ సీఎం మమత మరోసారి గాయపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బర్ధమాన్ జిల్లాలోని దుర్గాపూర్ నుంచి అసన్‌సోల్‌కు వెళ్లేందుకు శనివారం ఆమె హెలికాప్టర్ ఎక్కారు. లోపలికి వెళ్లి తన సీటులో కూర్చునే సమయంలో అదుపు తప్పి పడిపోయారు. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే ఆమెను పైకి లేపారు. స్వల్ప గాయాలైనప్పటికీ దీదీ అసన్‌సోల్‌కు వెళ్లి పార్టీ అభ్యర్థి శత్రుఘ్న సిన్హాకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇటీవలే మమత తన నివాసంలో జారిపడగా.. ఆమె నుదుటికి గాయమైంది.

మణిపుర్‌లో ఇద్దరు జవాన్ల మృతి

మణిపుర్, ఏప్రిల్ 27: మణిపుర్‌లో తీవ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. బిష్ణుపూర్ జిల్లాలోని భద్రతా సిబ్బంది శిబిరంపై కాల్పులకు తెగబడడంతో ఇద్దరు జవాన్లు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి నరన్‌సైనా ప్రాంతంలో జరిగింది. రెండో విడత లోక్‌సభ ఎన్నికలలో భాగంగా శుక్రవారం అవుట్ మణిపుర్‌లో పోలింగ్ జరిగింది. నరన్‌సైనా ప్రాంతంలో పోలింగ్ విధులకు హాజరైన సీఆర్పీఎఫ్ సిబ్బంది శుక్రవారం రాత్రి అక్కడి ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ శిబిరం వద్ద బస చేశారు. "శుక్రవారం అర్ధరాత్రి 12.30 నుంచి 2.15వరకు దాదాపు రెండు గంటలపాటు తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. బాంబులూ విసిరారు" అని పోలీసులు తెలిపారు.

ఈసారైనా హస్తవాసి?

కేంద్రంలో పదేళ్లుగా అధికారానికి కాంగ్రెస్ దూరం.. మూడోసారీ ఓడితే మనుగడకు మరిన్ని కష్టాలు

» రాహుల్ యాత్రల ఇమేజ్‌పై ఆశలు

అది 2004 సంవత్సరం..! సార్వత్రిక ఎన్నికలకు కొద్దిగా ముందు సమయం. వాజ్‌పేయీ లాంటి నాయకుడి హవాలో ఆరేళ్ల పాటు కేంద్రంలో అధికారానికి దూరమైంది కాంగ్రెస్ పార్టీ. మూడోసారీ ఓడితే ఇక అంతే సంగతులు అనే పరిస్థితి. దీంతో నాడు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న సోనియాగాంధీ నేరుగా రంగంలోకి దిగారు. లాలూ, ములాయం, పాసవాన్, సుర్జీత్, పవార్ తదితర కీలక నేతలను ఒప్పించి, మెప్పించి యూపీఏను ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఈ కూటమి విజయకేతనం ఎగురవేసింది. పదేళ్లు అధికారంలో కొనసాగింది.

ఇది 2024 సంవత్సరం..! దేశాన్ని కమ్మేసిన మోదీ మేనియాతో.. వరుసగా రెండుసార్లు ఎన్నికల్లో పరాజయం పాలై దశాబ్ద నుంచి ప్రతిపక్షానికి పరిమితమైంది కాంగ్రెస్ పార్టీ. ఇక ఇప్పుడు కూడా ఓటమి ఎదురైతే మనుగడ కష్టమే. సోనియా కుమారుడు, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వానికే సవాల్. పైగా భారత్ జోడో అంటూ దేశవ్యాప్తంగా రెండు యాత్రలు చేసినా విఫలమయ్యారనే బలమైన ముద్ర పడుతుంది. అందుకే అప్పటి యూపీఏ తరహాలో.. "ఇండియా" కూటమి కట్టి.. పోరాడుతోంది. కీలక నాయకులను కోల్పోయి.. పలు రాష్ట్రాల్లో ఓడిపోయిన ఆ పార్టీకి ప్రస్తుత లోక్ సభ ఎన్నికలు చావోరేవో. రాహుల్ గాంధీ ఈసారి 2004 నాటి ఫలితాలు వస్తాయని అంటున్నారు. తద్వారా మోదీ నేతృత్వంలోని బీజేపీని నిలువరించగలమనే భావనను అటు ప్రజలు, ఇటు ఇండియా కూటమి పార్టీల్లో వ్యాపింపజేస్తున్నారు. అప్పట్లో వాజపేయీ ప్రభుత్వం 'దేశం వెలిగిపోతోంది' అంటూ ప్రచారం చేసి భంగపడిందని, మోదీ సర్కారు సైతం ఇదే తరహా ఫలితం ఎదురవుతుందని చెబుతూ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇక పార్టీ పరంగా చూస్తే రాహుల్ సాగించిన జోడో యాత్రలు తమ వైపు ప్రజలు మొగ్గేలా చేశాయని కాంగ్రెస్ పెద్ద ఆశలే పెట్టుకుంది. కర్ణాటక, తెలంగాణలో గెలిచిన ఉత్సాహంతో ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే 'హామీలను' వెల్లడించింది. హస్తం పార్టీ ఇలా ప్రకటించడం బహుశా ఇదే తొలిసారి.



ప్రణాళికలు విఫలమైనా..

వాస్తవానికి కూటమి కట్టడం నుంచి.. 400 స్థానాల్లో బీజేపీపై 'ఇండియా' తరపున ఒక్కరే అభ్యర్థిని నిలపాలని ప్రతిపాదించి ఈ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ బాగానే వ్యూహ రచన చేసింది. అయితే, బెంగాల్‌లో కాంగ్రెస్‌కు సీట్లే ఇవ్వం పొమ్మని మమత తేల్చి చెప్పి ఒంటరిగా పోటీకి దిగారు. కేరళలో లెఫ్ట్ కూటమి కూడా ఇదే తీరున సొంతంగా బరిలో దిగింది. ఇక ఇండియా కూటమి ఏర్పాటుకు వెన్నెముకగా నిలిచిన బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌ను బీజేపీ లాగేసుకుంది. యూపీలో ఆర్ఎల్‌డీనీ తమవైపు తిప్పుకొంది. ప్రజాదరణ ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ జైలు పాలయ్యారు. రాజకీయంగా ఇన్ని ఒడిదొడుకులున్నా కాంగ్రెస్ మాత్రం ఆశతో ముందుకుసాగుతోంది.

ప్రచారంలో ధాటి

2019లో మోదీని తక్కువ అంచనా వేసిన కాంగ్రెస్ బోల్తా పడింది. రాఫెల్ డీల్‌లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. చౌకీదార్ చోర్ హై అంటూ మోదీని గట్టిగా నిందించింది. పేదలకు కనీస ఆదాయం కల్పిస్తామంటూ ప్రధానంగా ప్రచారం చేసింది. ఇప్పుడు మాత్రం 'కుల గణన'ను తెర పైకి తెచ్చింది. తద్వారా ఓబీసీలు తమవైపు మొగ్గుచూపుతారని, ఇది బ్రహ్మాస్త్రం అని భావిస్తోంది. మరోవైపు సంక్షేమ మంత్రంలో భాగంగా నాటి కనీస ఆదాయ హామీని మెరుగుపరిచి 'న్యాయ్' హామీల్లో చేర్చింది. వీటికి తోడు ఎలక్టోరల్ బాండ్స్‌తో బీజేపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగి లాభం పొందిందంటూ దాడికి దిగుతోంది. వీటికి తోడు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఆ హామీని విస్మరించడం, రైతుల ఆదాయం పెరగకపోవడం, ధరలు మండిపోవడం.. ఈ అంశాల ప్రభావం ఓట్ల రూపంలో కనిపిస్తుందని కాంగ్రెస్ లెక్కలు వేస్తోంది.

- సెంట్రల్ డెస్క్

సొంతంగా కొంత.. కూటమి పార్టీలు కొంత

తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలపై కాంగ్రెస్ ఎక్కువ ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో కర్ణాటకలో 1, తెలంగాణలో 3 సీట్లకు పరిమితమైన హస్తం పార్టీ.. ఇప్పుడు మాత్రం ఈ రాష్ట్రాల్లో 25 పైగా స్థానాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక 2019లో కేరళలో 18 సీట్లను కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి గెలుచుకుంది. ఈసారీ అక్కడ మెరుగైన ఫలితాలను ఆశిస్తోంది. తమిళనాడులో డీఎంకే, యూపీలో సమాజ్‌వాదీ, బిహార్‌లో ఆర్జేడీ, మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ, ఝార్ఖండ్‌లో జేఎంఎం.. ఇలా ఎక్కడికక్కడ ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు సత్తా చాటాల్సి ఉంది. అటు బెంగాల్‌లో టీఎంసీ సైతం అధిక సీట్లు సాధించాలి. కాగా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లపై కాంగ్రెస్‌కు పెద్దగా అంచనాల్లేవని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, 25 సీట్లున్న రాజస్థాన్‌లో మాత్రం బీజేపీని అడ్డుకుంటామని భావిస్తోంది. అలాగైతేనే మోదీని ఇంటికి పంపాలన్న కాంగ్రెస్ లక్ష్యం నెరవేరుతుంది.

మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ

» త్వరలోనే మూత ఖాయం: ఖర్గే



బార్పేట(అసోం), ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోపై బీజేపీ నేతలు విషం చిమ్ముతున్నారని ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ముఖ్యంగా ప్రధాని మోదీని అబద్ధాల ఫ్యాక్టరీగా అభివర్ణించారు. ఇది త్వరలోనే మూతబడుతుందని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్‌ను పోలి ఉందన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అసోంలోని బార్పేట జిల్లాలో ఉన్న కయాకుచి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇండియా కూటమి ఖచ్చితంగా అధికారంలోకి వచ్చి తీరుతుంది. మేం అధికారంలోకి రాగానే పేదల జీవితాలు బాగుచేయడంపై దృష్టి పెడతాం" అని తెలిపారు. మోదీని అబద్ధాల నాయకుడిగా అభివర్ణించారు. "ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. నల్లధనాన్ని వెనక్కి తెచ్చి దేశంలోని ప్రతి పౌరుని ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేస్తామన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు. ఇవన్నీ ఏమయ్యాయి? మోదీ ఓ అబద్ధాల కర్మాగారం. చివరకు కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలీగ్‌ను పోలి ఉందని చెబుతున్నారు. నోటికి ఏ అబద్ధం వస్తే అది చెబుతున్నారు. ఆయనలో ఓటమి భయం పెరిగిపోయి.. నిరంతరం కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు" అని ఖర్గే నిప్పులు చెరిగారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. "రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగల ధీరుడిగా మోదీకి భజన చేస్తున్నారు. మరి దేశంలో పేదరికాన్ని అదేవిధంగా ఆయన ఎందుకు నిర్మూలించలేకపోతున్నారు?" అని ఆమె ప్రశ్నించారు.

బీజేపీ మళ్లీ వస్తే రిజర్వేషన్లు రద్దు: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసి, రాజ్యాంగాన్ని మార్చివేయడమే బీజేపీ లక్ష్యమని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. వారు మళ్లీ అధికారంలోకి వస్తే దళితులు, గిరిజనులు, బీసీలకు రిజర్వేషన్లు ఎత్తివేస్తారని చెప్పారు. ఇందుకు ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రకటనలు, వ్యాఖ్యలే నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ ఉన్నంతవరకు ఏ శక్తీ రిజర్వేషన్లను తొలగించలేదని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం హిందీలో ట్వీట్ చేశారు. రిజర్వేషన్లను ఎత్తివేయాలన్నది బీజేపీ ఆలోచన కాగా, ఆ పార్టీ మాత్రం కాంగ్రెస్ వస్తే రిజర్వేషన్లు తీసివేస్తారని తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

దేశమంతా నన్నే కోరుతోంది: రాబర్ట్ వాద్రా


రుషికేష్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "దేశమంతా నన్నే కోరుతోంది. రాజకీయాల్లోకి రమ్మంటోంది. ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. బీజేపీ నుంచి ఈ దేశానికి విమోచనం కలిగించాలని భావిస్తున్నారు. దేశ ప్రజలంతా ఇప్పుడు గాంధీల కుటుంబంతోనే ఉన్నారు. రాహుల్, ప్రియాంకా గాంధీలు ఎంత కష్టపడుతున్నారో వారు చూస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరుపై మండిపడుతున్నారు" అని వాద్రా వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లోని రుషికేష్‌లో ఆయన మాట్లాడుతూ.. అమేథీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.

'ఇండియా' ఓటుబ్యాంకుకు

బీఎస్పీ గండి!

దళితులకు రిజర్వ్‌డ్ స్థానాల్లో మాత్రమే మాయావతి సీట్లు

» బీజేపీ మేలుకేనని ఆరోపణలు.. బీ-టీమ్ అని విమర్శలు



మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పలువురు ముస్లిం, ఓబీసీ, అగ్రవర్ణాల అభ్యర్థులను బరిలోకి దింపింది. వీరి వల్ల బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి కంటే కూడా ఇండియా కూటమి అభ్యర్థులకే ఎక్కువగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు బీఎస్పీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో దళితులకు రిజర్వుడు స్థానాల్లో మాత్రమే సీట్లు కేటాయించడం గమనార్హం. గెలుపు గుర్రాల పేరిట 18 నియోజకవర్గాలలో ముస్లింలు, 14 స్థానాల్లో ఓబీసీలు ఆ పార్టీ బరిలోకి దింపింది. పలు చోట్ల అగ్రవర్ణాల వారికి టికెట్లు కేటాయించింది. వీరివల్ల ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు అవకాశాలు దెబ్బతినే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీజేపీతో బీఎస్పీ చేతులు కలిపిందని అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ఆరోపించింది. అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ పోటీ చేస్తున్న మెయిన్‌పురి నియోజకవర్గంలో బీఎస్పీ అకస్మాత్తుగా అభ్యర్థిని మార్చివేసి, యాదవ్ కులం అభ్యర్థిని బరిలోకి దింపడం ఈ ఆరోపణలకు బలం చేకూర్చింది. బీజేపీకి మేలు చేసేందుకే మెయిన్‌పురిలో అభ్యర్థిని బీఎస్పీ మార్చిందని ఎస్పీ ఆరోపించింది.

ఆ నియోజకవర్గాల్లో ముస్లిం అభ్యర్థులు..

తొలిదశలో పోలింగ్ జరిగిన సహరణ్‌పూర్, మొరాదాబాద్, రాంపూర్, ఫిలిభిత్‌తో పాటు సంభల్, ఆన్లా, లఖ్‌నవూ, బదాయూన్, వారాణసీ, ఈతాహ్, దొమరియాగంజ్, కన్నౌజ్, గోరఖ్‌పూర్, సంత్ కబీర్‌నగర్, మహరాజ్‌గంజ్, ఫిరోజాబాద్, భదోహి నియోజకవర్గాలలో ముస్లిం అభ్యర్థులను బీఎస్పీ బరిలోకి దింపింది. సహరణ్‌పూర్, సంభల్, అమ్రోహా, రాంపూర్ నియోజకవర్గాలలో ఇండియా కూటమి నిలిపిన ముస్లిం అభ్యర్థుల గెలుపు అవకాశాలను వీరు దెబ్బతీసే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. బీఎస్పీ ముస్లిం అభ్యర్థులను నిలిపిన ఇతర నియోజకవర్గాల్లోనూ ముస్లిం ఓటర్ల సంఖ్య గణనీయంగానే ఉంది. తద్వారా ఆ నియోజకవర్గాల్లోనూ ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు అవకాశాలను బీఎస్పీ దెబ్బతీసే అవకాశం ఉంది. మిగిలిన అన్ని పార్టీల కంటే ఎక్కువగానే ముస్లిం అభ్యర్థులను బీఎస్పీ బరిలోకి దింపినప్పటికీ, వారంతా ఇండియా కూటమి ఓట్లకు గండికొట్టేవారేనని విశ్లేకులు చెబుతున్నారు. బీజేపీకి మేలు చేసేందుకే ముస్లిం ఓట్లను బీఎస్పీ చీల్చుతోందని ఎస్పీ ఆరోపించింది. బీజేపీకి బీ-టీమ్‌గా బీఎస్పీ పనిచేస్తోందని ఎస్పీ అధికార ప్రతినిధి ఐపీ సింగ్ విమర్శించారు. 'బీఎస్పీకి బీజేపీపై పోరాడటం ప్రాధాన్యం కాదు. ఇండియా కూటమిపై ప్రత్యేకించి ఎస్పీపై పోరాడటమే బీఎస్పీకి ప్రాధాన్యం. అయితే, ఏ నాయకులు ఎవరి సంకేతాల మేరకు పనిచేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకున్నారు. బీఎస్పీకి చెందిన అనేకమంది బీసీ, దళిత, ముస్లిం నాయకులు ఎస్పీలో చేరిపోయారు. ఇప్పుడు ఒక్క ఓటు కూడా వృథా కాదు' అని ఐపీ సింగ్ వ్యాఖ్యానించారు.

జనాభా ప్రాతిపదికనే ఆయా కులాలకు సీట్లు..

తమది జాతీయ పార్టీ అని, ఆయా కులాల జనాభా ప్రాతిపదికన బ్రాహ్మణులు, ముస్లింలు, దళితులు, ఓబీసీలకు ప్రతి ఎన్నికల్లోనూ తమ పార్టీ టికెట్లు కేటాయిస్తోందని బీఎస్పీ ఎమ్మెల్సీ భీంరావ్ అంబేడ్కర్ చెప్పారు. '2007లో బ్రాహ్మణులు మా పార్టీకి ఓట్లు వేశారు. బీఎస్పీ ఇప్పుడు వారికి మద్దతుగా నిలిచింది' అని వివరించారు. నమ్మకమైన ఓటుబ్యాంకు ఉన్న బీజేపీ కంటే నమ్మకమైన ఓటు బ్యాంకు లేని ఎస్పీ, కాంగ్రెస్ ఓట్లనే బీఎస్పీ ఎక్కువగా చీల్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. 'గత ఎన్నికల్లో అగ్రకులస్థుల ఓట్లు బీజేపీకే పడటం గమనించాం. అందువల్ల బ్రాహ్మణులు, ఠాకూర్‌లు తదితర అగ్రకులాల అభ్యర్థులను బీఎస్పీ బరిలోకి దింపినప్పటికీ ఆయా కులాల ఓటర్లు తమ కులంలో గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థికే ఓటు వేస్తారు' అని అంబేడ్కర్ వర్సిటీ రాజనీతి శాస్త్రం విభాగాధిపతి శశికాంత్ పాండే తేల్చిచెప్పారు. బీజేపీ వలే నమ్మకమైన ఓటర్లు ఎస్పీ, కాంగ్రెస్‌లకు లేరన్నారు. అందువల్ల బీజేపీ కంటే ఇండియా కూటమి ఓట్లకే బీఎస్పీ ఎక్కువగా గండి కొట్టే అవకాశం ఉందని విశ్లేషించారు.

- సెంట్రల్ డెస్క్

గాజాలో శిథిలాలు..

తొలగింపునకు 14 ఏళ్లు

» ఐక్య రాజ్య సమితి అంచనా..34 వేలకు మరణాలు

సెంట్రల్ గాజా/న్యూయార్క్, ఏప్రిల్ 27: గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో.. కూలిన భవనాల శకలాలు, పేలని ఆయుధాలను తొలగించడానికి 14 ఏళ్ల సమయం పట్టవచ్చని ఐక్య రాజ్య సమితి(ఐరాస) అంచనా వేసింది. అది కూడా రోజుకు 100 ట్రక్కులను ఉపయోగిస్తే కానీ, పూర్తిస్థాయిలో శిథిలాల తొలగింపు సాధ్యం కాదని పేర్కొంది. శిథిలాలను, పేలకుండా మిగిలిపోయిన రాకెట్లు, బాంబులను పూర్తిస్థాయిలో తొలగించాకే గాజా తిరిగి సురక్షిత ప్రాంతంగా మారుతుందని అభిప్రాయపడింది. శుక్ర, శనివారాల్లో ఐరాస డీమైనింగ్ నిపుణులు గాజాలో పర్యటించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గాజాలో సుమారు 3.7 కోట్ల టన్నుల శిథిలాలు మిగిలిపోయినట్లు యునైటెడ్ నేషన్స్ మైన్ యాక్షన్ సర్వీస్(యూఎన్‌ఎంఏఎస్) సీనియర్ అధికారి పెర్ లుధామర్ తెలిపారు. "గాజాలో ప్రతి చదరపు కిలోమీటరుకు 200 కిలోల మేర పేలని బాంబులు ఉన్నాయి. ఇజ్రాయెల్ ప్రయోగించిన మందుగుండులో కనీసం 10% పేలకుండా మిగిలిపోయాయి" అని ఆయన వివరించారు. కాగా.. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కారణంగా పాలస్తీనీ మృతుల సంఖ్య శనివారానికి 34,388కి చేరుకుందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఇదే చివరి అవకాశం: ఇజ్రాయెల్

గాజాలోని రఫా(ప్రస్తుతం నిరాశ్రయులు ఉన్న ప్రాంతం)లో కాల్పుల విరమణకు మరో అవకాశం ఇవ్వబోమని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) స్పష్టం చేసింది. ఇదే చివరి అవకాశమని, హమాస్ ముందు పెట్టిన ప్రతిపాదనలపై స్పందించాలని పేర్కొంది. కాగా.. ఈ ప్రతిపాదనపై హమాస్ వర్గాలు శనివారం స్పందించాయి. ఇజ్రాయెల్ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు 'అల్‌హుర్రా' వార్తా సంస్థకు తెలిపాయి.



నైనిటాల్‌లో కార్చిచ్చు

36 గంటలుగా మండుతున్న అడవి.. 31 చోట్ల అగ్ని ప్రమాదాలు

» వైమానికదళం, సైన్యం రంగంలోకి



న్యూఢిల్లీ, నైనిటాల్, ఏప్రిల్ 27: ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లాలోని అడవిలో 36 గంటలుగా చెలరేగుతున్న మంటలను అదుపు చేసేందుకు భారత వైమానిక దళం, భారత ఆర్మీ రంగంలోకి దిగాయి. అగ్నిమాపక చర్యల కోసం జిల్లా యంత్రాంగం హెలికాప్టర్లను కూడా రంగంలోకి దించింది. నైనిటాల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెలరేగిన అగ్నికీలలు పైన్స్ ప్రాంతానికి సమీపంలో ఉన్న హైకోర్టు కాలనీ వరకు వ్యాపించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పైన్స్ సమీపంలో ఉన్న పాత, ఖాళీ ఇంటిని మంటలు చుట్టుముట్టాయని ఆ ప్రాంతానికి చెందిన వాసి, హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనిల్ జోషి తెలిపారు. అయితే దీనివల్ల హైకోర్టు కాలనీకి ఎలాంటి నష్టం జరగలేదు కానీ, భవనాల సమీపంలో అగ్నికీలలు ప్రమాదకరంగా ఉన్నాయని చెప్పారు. కాగా, పైన్స్ సమీపంలో ఉన్న భారత ఆర్మీ స్థావరాలకు కూడా మంటలు చేరువయ్యాయి. వాటిని అదుపు చేయడానికి భారత వైమానిక దళం ఎంఐ-17 వి5 హెలికాప్టర్ ద్వారా బాంబి బకెట్ ఆపరేషన్ నిర్వహించింది. దీనికోసం భీమ్ తాల్ సరస్సు నుంచి నీటిని తీసుకెళ్లింది. అగ్ని ప్రమాదం కారణంగా నైనిటాల్ జిల్లా యంత్రాంగం నైని సరుస్సులో బోటింగ్‌ను నిషేధించింది. కేంద్ర బలగాలతో కలిసి 40 మంది అటవీశాఖ సిబ్బంది మంటలు అదుపుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా ఈ నెల 26న రుద్రప్రయాగ్‌లో అడవులకు నిప్పు పెట్టేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లాలో గత 24 గంటల్లో 31 చోట్ల అగ్నిప్రమాదాలు సంభవించాయి. రాష్ట్రంలో కార్చిచ్చులతో గతేడాది నవంబరు 1 నుంచి ఇప్పటి వరకు 689.89 హెక్టార్లలో అటవీ ప్రాంతం దెబ్బతింది.

భారత్‌లో కార్చిచ్చు కొత్తేమీ కాదు..

అడవుల్లో మంటలు చెలరేగడం భారత్‌లో కొత్తేమీ కాదు. కొండప్రాంతమైన ఉత్తరాఖండ్‌లో కార్చిచ్చులు చెలరేగే అవకాశం ఎక్కువ. 2024 ఫిబ్రవరిలో అరుణాచల్‌లోని పశ్చిమ కమెంగ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒడిశాలోని అడవుల్లో 2023 మార్చిలో 96 అగ్నిప్రమాదాలు సంభవించాయి. 2022 నుంచి 2023 వరకు అటవీ ప్రాంతాల్లో 871చోట్ల మంటలు చెలరేగాయి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన గోవాలో 2023లో 348 హెక్టార్ల అటవీభూమి దగ్ధమైంది. 2019లో కర్ణాటకలోని బందీపూర్ అడవుల్లో కార్చిచ్చు చెలరేగి 3 వేల హెక్టార్లు దగ్ధమైంది.

అమెరికాలో 550మంది అరెస్టు

పాలస్తీనాకు సంఘీభావంగా వర్సిటీల్లో ఆందోళనలు

న్యూయార్క్, ఏప్రిల్ 27: పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా విద్యార్థుల ఆందోళనలతో అమెరికా వ్యాప్తంగా యూనివర్సిటీలు అట్టుడుకుతున్నాయి. ఇప్పటి వరకు 550మందికిపైగా విద్యార్థులను అరెస్టు చేసినా, ఆందోళనలు విరమించేందుకు ససేమిరా అంటున్నారు. ఇజ్రాయిల్‌లో పెట్టుబడులను వర్సిటీలు నిలిపివేయాలని, గాజాపై యుద్ధానికి ఆజ్యం పోస్తున్న ఆయుధాల తయారీలోనూ పెట్టుబడులను ఆపేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. హార్వర్డ్, కొలంబియా, యేల్, యూసీ బెర్కిలే తదితర ప్రఖ్యాత యూనివర్సిటీల్లోనూ విద్యార్థులు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలన్నీ అనధికారికమేనని వర్సిటీల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులను పిలిపించారు. అట్లాంటాలోని ఎమోరీ యూనివర్సిటీలో గత రెండు రోజులుగా యాజమాన్యం పోలీసులను రప్పించి, నిరసనకారులపై టియర్ గ్యాస్ తదితరాలను ప్రయోగించింది. ఆస్టిన్‌లోని టెక్సాస్ యూనివర్సిటీలో అశ్విక దళాలను రంగంలోకి దించి నిరసనకారులను చెదరగొట్టారు. పలు చోట్ల విద్యార్థులతోపాటు ప్రొఫెసర్లు కూడా ఆందోళనల్లో పాల్గొన్నారు. తామంతా పాలస్తీనా పౌరులకు సంఘీభావం తెలుపుతున్నామని ఆందోళనకారులు చెబుతున్నారు. అయితే, విద్యార్థుల డిమాండ్లను వర్సిటీల యాజమాన్యాలు తిరస్కరిస్తున్నాయి. ఆ డిమాండ్లు దేశ విధానాలకు వ్యతిరేకమని వర్సిటీలు తేల్చిచెబుతున్నాయి.

భారత అమ్ముల పొదిలోకి

'రాంపేజ్' క్షిపణులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: భారత యుద్ధ విమానాలకు మరో అస్త్రం జతపడింది. ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన లాంగ్ రేంజ్ సూపర్ సానిక్ 'రాంపేజ్' క్షిపణులను వాయుసేన, నౌకా దళాలకు అందజేశారు. వీటిని ఆకాశం నుంచి నేల పైకి ప్రయోగిస్తారు. ఇవి 250 కి.మీ.దూరంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేస్తాయి. టీవల ఇరాన్‌పై జరిగిన దాడిలో ఇజ్రాయెల్ వీటిని ప్రయోగించినట్టు సమాచారం. వాయుసేనలోని ఎస్‌యూ-30 ఎంకెఐ, మిగ్-29 యుద్ధ విమానాలకు, జాగ్వార్ ఫైటర్ జెట్లకు ఈ క్షిపణులను అమర్చుతారు. 2020లో చైనాతో సరిహద్దు వివాదం తలెత్తడంతో రక్షణ మంత్రిత్వ శాఖ కల్పించిన ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించుకొని సైన్యం ఈ క్షిపణులను కొనుగోలు చేసింది. 2019లో బాలాకోట్ దాడుల్లో ఉపయోగించిన స్పైస్-2000 క్షిపణుల కన్నా 'రాంపేజ్'లు ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదిస్తాయి. కాగా, 15 రోజుల క్రితం అండమాన్-నికోబార్ దీవుల్లో 'రాక్స్' (క్రిస్టల్ మేజ్-2) బాలిస్టిక్ విస్సైళ్లను భారత్ విజయవంతంగా ప్రయోగించింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా 'రాంపేజ్'లను స్వదేశంలోనే తయారు చేయాలని కూడా వాయుసేన భావిస్తోంది.

లోకం తీరు






లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి


సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మడుపు భూంరెడ్డి

కేసీఆర్ ఇలాకాలో బీఆర్ఎస్‌కు మరో దెబ్బ

- కాంగ్రెస్‌లోకి కేసీఆర్ సన్నిహితుడు మడుపు భూంరెడ్డి

కొండపాక, ఏప్రిల్ 27: మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పార్టీని వీడి వారం తిరగక ముందే కేసీఆర్ సన్నిహితుడు, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంలో ప్రముఖ పాత్ర పోషించి రెండుసార్లు కేసీఆర్ గెలుపునకు కృషి చేసిన హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ భూంరెడ్డితో పాటు పలువురు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు ఉమ్మడి కొండపాక మండలానికి చెందిన ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా, మర్పడగ ఎంపీటీసీ ఆంజనేయులు, పీఏసీఆర్ సంస్థ ఛైర్మన్, కుకునూరుపల్లి సర్పంచ్ భర్త పోల్కంపల్లి నరేందర్, కుకునూరుపల్లి మాజీ ఎంపీటీసీలు తూము మహేందర్, ఇండ్ల కనకయ్య, ముద్దపూర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, పుల్లోజు సుదర్శనచారి కాంగ్రెస్‌లో చేరారు. మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు శుక్రవారం రాత్రి మడుపు భూంరెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని కలిసి చర్చలు జరిపారు. ఎట్టకేలకు వారంతా కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి మరింత బలం చేకూరినట్లయింది.

ఈటల గెలుస్తాడని అనలేదు: మల్లారెడ్డి

మేడ్చల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం మీడియాతో పాటు సోషల్ మీడియా ప్రచారంలో ఉండే మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మరోసారి తనదైన శైలిలో మాట మార్చారు. . మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను 'నువ్వే గెలుస్తావన్నా..' అని తాను అనలేదని స్పష్టం చేశారు. ఓ వివాహ వేడుకలో ఎదురుపడిన ఈటల రాజేందర్ ఒకప్పటి తన మిత్రుడని, తనతో చాలా మంచిగా ఉంటాడు కాబట్టి స్పోర్టివ్‌గా ఆల్ ది బెస్ట్ చెప్పానే తప్ప గెలుస్తున్నావని తాను అనలేదన్నారు. 'వాళ్లంతా మోసగాళ్లు.. మోసగాళ్లు ఎక్కడైనా గెలుస్తారా..? నా లాంటి మంచి మనుసున్న వాళ్లే గెలుస్తారు..' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నేతల చేరికకు బ్రేక్

- ఉదయం దీపాదాస్ మున్షీ సమక్షంలో చేరిన మిర్యాలగూడ మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే నిరసనతో చేరికను నిలిపివేస్తూ పీసీసీ ఉత్తర్వులు

నల్లగొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నేతల చేరికకు బ్రేక్ పడింది. వీరి చేరికను నిలిపివేస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ ఉత్తర్వులిచ్చారు. బీఆర్ఎస్‌కు చెందిన మిర్యాలగూడ మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మరో 13 మంది కౌన్సిలర్లు శనివారం ఉదయం పీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పారు. అయితే ఈ చేరికలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన వర్గీయులు వ్యతిరేకించడంతోపాటు చేరికలపై మంత్రులు, అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన అధిష్ఠానం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ని రంగంలోకి దింపింది. భార్గవ్, ఆయన వర్గీయుల చేరికను నిలుపుదల చేస్తున్నామని మధ్యాహ్నం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థి నగేశ్ నామినేషన్ తిరస్కరించండి

- సీఈవోకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేశ్‌పై సీఈవో వికాస్ రాజ్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. నగేశ్‌తో పాటు స్థానిక రిటర్నింగ్ అధికారి రాజశ్రీ షాపై కూడా చర్యలు తీసుకోవాలని సీఈవోకు బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, ఆశిష్ శనివారం విజ్ఞప్తి చేశారు. నగేశ్ తన ఎన్నికల అఫిడవిట్‌ను పూర్తిగా భర్తీ చేయలేదని, ఈ విషయమై ఆర్‌వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ అభ్యర్థి నగేశ్ నామినేషన్‌ను తిరస్కరించడంతో పాటు రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

1,060 నామినేషన్ పత్రాలకు ఆమోదం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయింది. ఎన్నికల అధికారులు ఈ నెల 18 నుంచి 25 వరకు లోక్‌సభ స్థానాలకు పోటీ చేయనున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించిన విషయం తెలిసిందే. 8 రోజుల్లో 893 మంది అభ్యర్థులు మొత్తం 1,488 నామినేషన్ పత్రాలు సమర్పించారు. వాటిని ఎన్నికల అధికారులు శనివారం పరిశీలించారు. తప్పుగా దాఖలు చేసిన 268 మంది అభ్యర్థులకు సంబంధించిన 428 నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. 625 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 1,060 నామినేషన్ పత్రాలు సరైనవిగా గుర్తించి ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 29తో ముగియనుంది.

ప్రజాస్వామ్య విలువలకు మోదీ తిలోదకాలు

- మంగళసూత్రాల వ్యాఖ్య.. ప్రధాని స్థాయికి తగదు
- కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీ గెలిపించాలి
- ఖమ్మంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి




ఖమ్మం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల మంగళ సూత్రాలు మైనారిటీలకు పంచిపెడుతుందని మోదీ చేసిన విమర్శ.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి, దిగజారి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఖమ్మంలో శనివారం ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ముగిసిన రెండు విడతల పోలింగ్‌లో ఇండియా కూటమికే మెజారిటీ వస్తుందని తెలిసి ప్రధాని తన స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబం కావాలా? లేక దేశ సంపదను అదాని, అంబానీలకు కట్టబెడుతున్న మోదీ కావాలా? తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, అదే తీరుగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇండియా కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరి కష్టం, కృషి వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు కంటే మెజారిటీయే ముఖ్యమన్నారు. ఇందు కోసం ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసిందన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలపై బీజేపీ సర్జికల్ స్ట్రైక్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. దాని కోసం అన్ని రకాల వ్యవస్థలు, సంస్థలను వినియోగిస్తూ ముప్పేట దాడి చేస్తున్నారని ఆరోపించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్.. రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు చట్టసభలతోపాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఓబీసీ, బీసీ కులాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి 1978లో మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని, ఆ కమిషన్ నివేదిక ఆధారంగా ఓబీసీ, బీసీలకు 27% రిజర్వేషన్‌ను అమలు చేయాలని 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అయితే ఈ నిర్ణయాన్ని ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించి, మండల్ వ్యతిరేక ఉద్యమానికి పరోక్ష నాయకత్వం వహించిందని చెప్పారు. మండల్ కమిషన్ సిఫార్సులను ఆమోదించిన సుప్రీంకోర్టు.. ఓబీసీలకు విద్య, ఉద్యోగాల్లో 27% రిజర్వేషన్ కల్పిస్తూ, మొత్తం రిజర్వేషన్లు 50% దాటకూడదని స్పష్టమైన తీర్పును ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే, రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా ఓబీసీ ప్రతినిధులు ఆయనను కలిసి.. రిజర్వేషన్లకు ఉన్న 50% పరిమితిని తొలగించి జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరారన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పిస్తామని, నిధులు కేటాయిస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారన్నారు. రిజర్వేషన్లు రద్దు కావాలనుకుంటే బీజేపీకి, రిజర్వేషన్లను పెంచాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని రేవంత్ రెడ్డి అన్నారు.

ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్లాన్

1925లో ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసినప్పుడు.. వందేళ్లలో భారత్‌ను హిందూ దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుందని రేవంత్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన రిజర్వేషన్లనూ రద్దు చేయాలనేది ఆ సంస్థ లక్ష్యమన్నారు. రాజ్యాంగం స్థానంలో మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ భావిస్తుందన్నారు. వచ్చే ఏడాదికి ఆ సంస్థకు వందేళ్లు పూర్తి కానున్నాయని, ఈ నేపథ్యంలో 2025 కల్లా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి.. రిజర్వేషన్లను రద్దు చేసి, దేశాన్ని హిందూ దేశంగా మార్చాలని మోదీ, అమిత్‌షా కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరమని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు కావాలంటున్నారని చెప్పారు. అవసరమైతే బీజేపీయేతర రాష్ట్రాలను బెదిరించి అయినా ఈ లక్ష్యాన్ని చేరుకోవటానికి అన్ని రకాల ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారని తెలిపారు. ఈ విధంగా దేశ మూలవాసులైన దళితులు, గిరిజనులు, ఓబీసీలపైన మోదీ, అమిత్‌షా సర్జికల్ స్ట్రైక్ చేస్తున్నారని, ఈ కుట్రను తిప్పి కొట్టే ప్రయత్నం రాహుల్‌గాంధీ చేస్తుంటే.. ఆయనపై మోదీ, అమిత్ షా అబద్ధాలతో మాటల దాడి చేస్తున్నారని రేవంత్ తెలిపారు. హిందూ మహిళల తాళిబొట్లను గుంజుకుంటారు, ఆస్తులు పంచి పెడతారు అంటూ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'తండ్రి ఆస్తి కొడుక్కు ఇవ్వాలన్నా తండ్రి విరాసత్ ఇస్తే తప్ప జరగదు. అన్నదమ్ముల ఆస్తి పంపకాలకూ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తే తప్ప కాదు. భార్య ఆస్తిని భర్త వాడుకోవాలన్నా ఆమె అనుమతి తప్పనిసరి. అంబేడ్కర్.. ఇంత పకడ్బందీగా రాజ్యాంగాన్ని రాస్తే.. ఒకళ్ల ఆస్తులు ఇంకొకళ్లకు పంచి పెట్టడం ఎలా సాధ్యం?' అని నిలదీశారు. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ దీనిపై ఎందుకు మాట్లాడట్లేదన్నారు. కులగణన జరిపినప్పుడే 50 శాతం పరిమితిని మించి రిజర్వేషన్‌ను అమలు చేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిందని సీఎం తెలిపారు.


హైదరాబాద్‌లో సీఎం రేవంత్ నివాసంలో సమావేశమైన సీపీఎం నాయకులు తమ్మినేని, జూలకంటి తదితరులు

బీజేపీ కుట్ర మీద కేసీఆర్ మౌనం!

అమెరికా నుంచి అమలాపురం వరకూ అన్నింటిపైనా మాట్లాడే కేసీఆర్.. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ కుట్ర గురించి ఎందుకు మాట్లాడట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'గతంలో రాజ్యాంగాన్ని రద్దు చేసి కొత్త రాజ్యాంగం రాయాలని కేసీఆర్ అన్నడు. కొత్త రాజ్యాంగం అన్నది ఆర్ఎస్ఎస్ విధానం కదా. వారి భావజాలానికి కేసీఆర్ ప్రభావితుడైనడా? లేకుంటే బిడ్డ బెయిల్ కోసం బీజేపీకి సహకరిస్తున్నడా? రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్న బీజేపీ విధానంపై బీఆర్ఎస్ వైఖరి ఏంది?' అని నిలదీశారు. బీజేపీతో నిజంగా కేసీఆర్‌కు వైరం ఉంటే.. మల్కాజిగిరిలో బీజేపీ గెలుస్తుందని చెప్పిన మల్లారెడ్డిని పార్టీ నుంచి ఇప్పటికే సస్పెండ్ చేసుండాలన్నారు. కేటీఆర్‌పైన విమర్శలు చేయని ఈటల రాజేందర్ తనపై మాత్రం చేస్తున్నడన్నారు. 'భూములు అమ్మకుండా రుణమాఫీ చెయ్యాలంటూ ఈటల మాట్లాడుతుండు. అంటే రైతులకు రుణమాఫీ చేయవద్దా? హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాలను కేసీఆర్ అమ్మినప్పుడు, ఆక్రమించినప్పుడు ఈటలకు ఇది గుర్తుకు రాలేదా?' అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సాక్షిగా పంద్రాగస్టులోపున రైతు రుణమాఫీ చేసి తీరుతానన్నారు. 'మహబూబ్‌నగర్‌లో తింటుంటే కరెంటు పోయిందని కేసీఆర్ మాట్లాడుతున్నడు. ఆయనేమైనా బకాసురుడా? గతంలో సూర్యాపేటలోనూ ఇలానే అబద్ధాలు చెప్పిండు' అని విమర్శించారు. సమస్యలపై అసెంబ్లీలో చర్చిద్దామంటే పారిపోయిన కేసీఆర్.. టీవీ స్టూడియోలో మాత్రం నాలుగు గంటలు కూర్చుని సొల్లు పురాణం మాట్లాడారన్నారు. సాయంత్రంకల్లా దొడ్డీ ఎన్ని ఉన్నాయో లెక్క చూసుకునే పరిస్థితి ఆయనదని, బెల్లు కొట్టినా ఎవరూ వస్తలేరన్నారు. ఆ సంతూ కూడా సెలవు పెట్టి పోయిండంట అంటూ ఎద్దేవా చేశారు. అమిత్‌షా, మోదీలను ప్రత్యక్షం చేసుకోవడానికి కేసీఆర్ తపస్సు చేస్తున్నాడని, అందులో భాగంగానే కాంగ్రెస్‌పైన విమర్శలు చేస్తున్నారన్నారు.

దక్షిణ భారతదేశంలో 100 సీట్లు గెలుస్తాం

దక్షిణ భారత దేశంలో ఇండియా కూటమి వందకు పైగా సీట్లు గెలుచుకోనుందని రేవంత్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నల్లగొండ, ఖమ్మంలలో తప్ప బీఆర్ఎస్‌కు ఎక్కడా రెండో స్థానం కూడా రాదన్నారు. సికింద్రాబాద్ సహా 14 సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కరెంటు, నీరు ఎక్కువగా ఇస్తున్నామని, వాటి వినియోగం పెరిగిందని వెల్లడించారు. రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, అంతరాయాలు మాత్రమే ఉన్నాయని రేవంత్ చెప్పారు.

దేశం కోసం బీజేపీని అడ్డుకోవాల్సిందే

- మనం కొట్లాడుకుంటే ఆ పార్టీకి లబ్ధి
- సీపీఎం నేతలతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాల దృష్ట్యా బీజేపీని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని సీపీఎం నేతలను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భువనగిరి లోక్‌సభ స్థానంలో బరిలో ఉన్న సీపీఎం అభ్యర్థిని ఉపసంహరించుకొని తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితర నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఉదయం తన నివాసంలో గంటన్నరపాటు సమావేశం అయ్యారు. 'ఇండియా కూటమిలో సీపీఎం భాగస్వామిగా ఉన్నందున విశాల దృక్పథంతో ఆలోచన చేయాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీపీఎం భువనగిరిలో గెలవలేదు. మనం మనం కొట్లాడుకుంటే బీజేపీ లబ్ధి పొందే అవకాశం ఉంది. మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలిక తెచ్చేలా బీజేపీ వ్యవహరిస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో అన్ని చోట్లా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలి' అని రేవంత్‌రెడ్డి కోరినట్లు తెలిసింది. కేసీఆర్‌ను దించేందుకు యుద్ధం చేయాల్సి వచ్చిందని, అయితే, అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు, ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా కిందా మీదా పడుతూనే చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఇంతలోనే పార్లమెంట్ ఎన్నికలు వచ్చిపడటంతో మళ్లీ యుద్ధం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. 'ఉన్న ఖజానా అంతా కేసీఆర్ ఖాళీ చేసి వెళ్లారు. పదేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క రంగంలోనూ ఆశించిన పురోగతి లేదు. నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో రూ.వేల కోట్లు దోచుకున్నారు' అంటూ సీఎం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను సీపీఎం నేతలకు వివరించినట్లు తెలిసింది. రాష్ట్రాన్ని చక్కదిద్దే పనిలో ఉన్నామని, ఇప్పుడీ ఎన్నికలు అత్యంత ముఖ్యమని, ఈ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధిస్తే రాష్ట్రంలో బీజేపీకి అడ్డుకట్ట వేసినవాళ్లం అవుతామని తెలిపారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్‌ల ఐక్యత రాష్ట్ర పురోగతికి ఎంతో అవసరమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం: సీపీఎం

సమావేశం అనంతరం సీఎం నివాసం వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తదితర శక్తులను అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. భువనగిరిలో సీపీఎం అభ్యర్థి పోటీ నుంచి వైదొలిగి కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని సీఎం కోరారని తెలిపారు. అయితే, ప్రతి రాష్ట్రంలో ఒక లోక్‌సభ స్థానం నుంచైనా పోటీ చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో.. భువనగిరి స్థానంపై ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది.

పేదోళ్లకు అక్షయ పాత్ర.. ఉపాధి హామీ పథకం

- ఆ పథకాన్ని తెచ్చిన ఘనత సోనియాదే
- ఆ పేదల పథకాన్ని మోదీ పక్కన పెట్టారు
- ప్రజలు దీనిపై ఆలోచన చేయాలి
- కేటీఆర్ నిస్పృహ నుంచి బయటికి రావాలి: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేదోళ్లకు అక్షయ పాత్ర లాంటి ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెచ్చారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. అంత గొప్ప పథకాన్ని ప్రస్తుత ప్రధాని మోదీ.. పక్కన పెట్టేశారని ఆరోపించారు. ప్రజలు దీనిపై ఆలోచన చేయాలని సూచించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం.. పేదలకు అన్నం పెట్టిందని, గ్రామాలు అభివృద్ధి చెందాయని, ఈ ఘనత సోనియా గాంధీకే దక్కుతుందన్నారు. సోనియాపై బీజేపీ నేతలు అర్థం.. పర్థం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అత్త ఇందిర, భర్త రాజీవ్‌గాంధీల హత్య వంటి గడ్డు పరిస్థితులను ఆమె చూశారని, ఎన్నో కష్టాలనూ ఎదుర్కొన్నారని చెప్పారు. పీవీ నర్సింహారావును ప్రధానమంత్రిని చేసింది సోనియా గాంధీనేనని గుర్తు చేశారు. ఆయనకు భారత రత్న ఇచ్చి.. తామే ప్రధానిని చేసినట్లుగా బీజేపీ వాళ్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పీవీని సోనియాగాంధీ ప్రధానిని చేయకుంటే.. భారతరత్న ఇచ్చుండేవాళ్లా అని ప్రశ్నించారు. తమలాంటి వాళ్లం ఎమ్మెల్యే పదవి కోసం కొట్లాడుతున్నామని, కానీ సోనియాగాంధీ ప్రధాని పదవినే వద్దని వదిలేసుకున్నారని కొనియాడారు. "కేటీఆర్.. నీ ఎంపీ అభ్యర్థులు దమ్ములేనోళ్లు. నువ్వు ఇచ్చిన బీఫారంలనూ వెనక్కు ఇచ్చిపోతున్నరు. నువ్వా సీఎం గురించి మాట్లాడేది? నిరాశ నిస్పృహ నుంచి బయటికి రా!" అని సూచించారు. కేటీఆర్, కేసీఆర్‌లు నిరాశలో కూరుకుపోయారని వ్యాఖ్యానించారు.

అద్వాణీ పట్ల నిజాయితీ ప్రదర్శించారా?

మోదీకి రాజకీయ భిక్ష పెట్టింది వాజ్‌పేయి, అద్వాణీ అని జగ్గారెడ్డి చెప్పారు. అద్వాణీ పట్ల మోదీ ఏనాడైనా నిజాయితీని ప్రదర్శించారా అని ప్రశ్నించారు. "బీజేపీ నేతలకు పదవులు అద్వాణీ పెట్టిన భిక్ష. అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి కారణమైన అద్వాణీని సన్మానించారా?" అని నిలదీశారు. 120 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో 20 ఏళ్లు సోనియాగాంధీనే అధ్యక్షురాలుగా పనిచేశారని గుర్తు చేశారు. కిషన్ రెడ్డి స్క్రిప్ట్ రీడర్ అని, బీజేపీ కార్యాలయంలో ప్రచారక్ ఏది రాసిస్తే అదే మాట్లాడతారని విమర్శించారు. విదేశీ మహిళ భారతదేశంలోని వ్యక్తిని పెళ్లి చేసుకుంటే.. ఆమె భారతీయ మహిళే అవుతుందని, ఆ మాత్రం జ్ఞానం కూడా కిషన్ రెడ్డికి లేదా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

6 గ్యారెంటీలు అమలు చేసినట్టు నిరూపిస్తే.. పోటీ నుంచి తప్పుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

సమానంగా చూడాలన్నదే బీజేపీ విధానమన్నారు. బీజేపీ ఏది మాట్లాడినా మతతత్వమనే ముద్ర వేసే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇతర మతస్థుల ముందు హిందూమతాన్ని హేళన చేసేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఓట్ల కోసం సనాతన ధర్మాన్ని, హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కించపరిచే వాళ్లు హిందువులేనా అని ప్రశ్నించారు. అయోధ్య అక్షింతలను, ప్రసాదాన్ని కూడా కించపరుస్తున్నారని, అసలు వారికి రాముడంటే ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. కేసీఆర్ లాంటి వాడు ప్రధాని అయితే పాకిస్థాన్‌లో టోపీలను చూసి.. భారత్‌ను ఆ దేశంలో కలుపుతానంటాడేమోనని ఎద్దేవా చేశారు. హిందూగాళ్లు, బొందూగాళ్లు అన్నందుకు కరీంనగర్‌లో ఆయన పార్టీని బొంద పెట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. 'దేవుడిని నమ్మని నీ కొడుకు (కేటీఆర్) దేవుడిని కించపరిచేలా మాట్లాడితే హిందువులు అతని అహంకారాన్ని దించి గుడిమెట్ల ముందు మోకరిల్లేలా చేశారని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు బొమ్మా బొరుసులాంటి వాళ్లు!

కరీంనగర్ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు కేసీఆర్ అనే నాణేనికి బొమ్మా బొరుసు లాంటి వాళ్లని, ఇద్దరూ చీకటి ఒప్పందాలు చేసుకుని తనను ఓడించాలని కుట్ర చేస్తున్నారన్నారు. ఓడిపోతాననే భయంతో కాంగ్రెస్ అభ్యర్థి ఓటుకు వెయ్యి రూపాయలు పంచి గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తిట్లను దీవెనలుగా భావిస్తున్నానని అన్నారు. 'వెధవ' అని పొన్నం తనను దూషించారని, వెధవ అంటే తన దృష్టిలో 'వెయ్యేళ్లు ధనికుడిగా వర్ధిల్లు' అని అర్థమన్నారు. పోరాటాలతో బీజేపీ కార్యకర్తలు గల్లా ఎగరేసుకునేలా చేశాను. కేసీఆర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడలేదు. దేశంలో ఏ ఎంపీపైనా లేనన్ని కేసులు నాపై పెట్టినా వెనుకంజ వేయలేదు. ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌ను గల్లా పట్టి ధర్నా చౌక్‌కు గుంజుకొచ్చాను. నన్ను రెండుసార్లు జైలుకు పంపినా కేసీఆర్ గద్దె దిగే వరకు పోరాడాన'ని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ చేసిన మోసాలను, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన ద్రోహాన్ని వివరించాలని, బీజేపీకి ఓటేయించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు.

నీతి, నిజాయితీగా పనిచేశా మరోసారి ఆదరించండి: కిషన్‌రెడ్డి



గోల్నాక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): "మీరు ఆదరించి ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు గెలిపిస్తే నీతి, నిజాయితీగా ఎలాంటి మచ్చ లేకుండా పనిచేశా. మళ్లీ ఎంపీగా గెలిపిస్తే కేంద్రమంత్రి పదవి పొందా. అప్పుడూ అంతే నిబద్ధతతో పని చేశా. ఈ ఎన్నికల్లో మరోసారి తనను ఆదరించి గెలిపించాలి" అని కేంద్రమంత్రి, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంలో శనివారం హైదరాబాద్ గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో ఆయన పర్యటించారు. అనంతరం కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను కేంద్రమంత్రిగా, సికింద్రాబాద్ ఎంపీగా నియోజకవర్గ ప్రజల కోసం తన శాయశక్తులా పనిచేశానని చెప్పారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, ఎవరినీ బెదిరించలేదని, దౌర్జన్యాలకు పాల్పడలేదని తెలిపారు తెలిపారు.

అమిత్ షా వీడియోను డీప్‌ఫేక్ చేశారు

- రిజర్వేషన్లపై తప్పుదోవ పట్టించేలా ప్రచారం
- టీపీసీసీపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా మెదక్ సభలో మాట్లాడని మాటలు మాట్లాడినట్లు వీడియో డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మార్చి, కాంగ్రెస్ సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ శనివారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. టీపీసీసీ 'ఎక్స్' (ట్విటర్) ఖాతాలో రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వీడియో పోస్టు చేయడాన్ని ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణించాలని కోరింది. చట్టవిరుద్ధంగా ఉన్న 4 శాతం ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని మాత్రమే అమిత్ షా చెప్పారని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఎక్కడా చెప్పలేదని పేర్కొంది. కానీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్ షా అన్నట్లుగా ఫేక్ వీడియోతో పీసీసీ తన సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోందని పేర్కొంది. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి, కార్యదర్శి కొల్లి మాధవి తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా కులగణన: లక్ష్మణ్



హైదరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా కులగణన జరగాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. ఇందుకు అనుగుణంగా సమగ్ర శాస్త్రీయ అధ్యయనం అవసరమని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా వివిధ సామాజిక వర్గాలకు చెందినవారు ఒక రాష్ట్రంలో ఓసీగా ఉంటే.. మరో రాష్ట్రంలో బీసీలుగా ఉన్నారని చెప్పారు. ఉదాహరణకు తెలంగాణ, ఏపీల్లోని రెడ్డి, కమ్మ కులస్తులు ఓసీలు కాగా, కర్ణాటకలో బీసీ కేటగిరీలో ఉన్నారని, బ్రాహ్మణులు ఉత్తరాఖండ్‌లో బీసీలుగా ఉన్నారని తెలిపారు. మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వంద రోజుల్లోనే చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నారని వెల్లడించారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రాకపోతే బీజేపీకి, కేంద్రానికి ఏం సంబంధమని ఆయన అన్నారు.

మే 9,10 తేదీల్లోనూ మోదీ పర్యటన!

రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతల ప్రచారం ముమ్మరం కానుంది. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం చేయనున్నారు. ప్రధాని మోదీ మే 9, 10 తేదీల్లో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ప్రచారం క్లైమాక్స్ దశలో ఆయన, బహిరంగసభలు, రోడ్ షోల్లో పాల్గొననున్నారని పార్టీవర్గాలు తెలిపాయి. మే 3న కూడా మోదీ పర్యటన ఉంటుందని, అయితే ఏ నియోజకవర్గంలో ఆ పర్యటన ఉంటుందనేది ఒకటి, రెండు రోజుల్లో ఖరారవుతుందని పార్టీ నేతలు తెలిపారు. ఇప్పటివరకు ఖరారైన షెడ్యూలు ప్రకారం, ఈనెల 30న సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గ్ మండలం సిల్వర్ గ్రామం వద్ద ఏర్పాటు చేసే బహిరంగసభలో మోదీ పాల్గొంటారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా మే 1న చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంటు పరిధిలోని గౌలిపురాలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని నిజాంపేటలో నిర్వహించే రోడ్డు షోలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొంటారు. అదే రోజు ఉదయం 11 గంటలకు కొత్తగూడెంలో, మధ్యాహ్నం 12.30 గంటలకు మహబూబాబాద్‌లో నిర్వహించే బహిరంగసభల్లోనూ ఆయన పాల్గొంటారు.

30న పదో తరగతి ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 30న(మంగళవారం) ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరైన విషయం తెలిసిందే.

విత్తన వ్యాపారం, ఆహార భద్రతపై
ఇస్టా, ఓఈసీడీ మధ్య ఒప్పందం..

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా విత్తన వ్యాపారం, వ్యవసాయ అభివృద్ధి, ఆహార భద్రత పెంచేందుకు అంతర్జాతీయ విత్తన పరీక్ష ప్రమాణాల సంస్థ (ఇస్టా), ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ అథారిటీ మధ్య ఒప్పందం కుదిరింది. ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ఉన్న ఓఈసీడీ సంస్థ కార్యాలయాన్ని ఇస్టా అధ్యక్షుడు కె.కేశవులు, పలువురు ప్రతినిధులతో కలసి సందర్శించారు. ఓఈసీడీ విభాగాధిపతి సెబా గాస్పర్, ఓఈసీడీ పథకాల ప్రోగ్రాం అధికారి అరెలియా నికాల్స్‌తో సమావేశమయ్యారు. విత్తన నాణ్యత, విత్తన వ్యాపారం, వ్యవసాయ అభివృద్ధి, ఆహార భద్రతను సులభతరం చేయడంపై చర్చించారు. వ్యవసాయ రంగం పురోగతికి అవసరమైన సాంకేతిక సహకారం, శిక్షణ అందించేలా రెండు సంస్థల మధ్య ఒప్పందం జరిగింది. ఓఈసీడీ విత్తన ధ్రువీకరణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, భారత్‌లో విత్తన ధ్రువీకరణ ప్రారంభించడానికి తెలంగాణ ముందుకొచ్చినందుకు కేశవులును సెబా గాస్పర్ అభినందించారు.

హోలోగ్రాముల అమ్మకాలపై జీఎస్టీ చెల్లించండి

- ఎక్సైజ్ కమిషనర్‌కు వాణిజ్య శాఖ కమిషనర్ నోటీసు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ మధ్య మళ్లీ వివాదం!

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ మధ్య మళ్లీ వివాదం రాజుకుంది. హోలోగ్రాములపై రూ.54.53 కోట్ల జీఎస్టీని చెల్లించాలని శనివారం వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్.. ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు నోటీసు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా ఈ పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే చట్టపరంగా వెళతామంటూ హెచ్చరించారు. డిస్టిలరీలు, డిపోలకు హోలోగ్రామ్‌ల అమ్మకాలపై 18% జీఎస్టీ వర్తిస్తుందని, దీని కింద 2017 నుంచి లెక్కేస్తే రూ.54.53 కోట్లు తమ శాఖకు రావాల్సి ఉందని వాణిజ్య పన్నుల కమిషనర్ తెలిపారు. ఒక్కో హోలోగ్రామ్‌ను 30 పైసల చొప్పున అమ్మినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది ఇప్పుడు ఇరు శాఖల్లో తీవ్ర చర్చనీయంగా మారింది. గతంలో ఈ-వే బిల్లుల వ్యవహారంపై కూడా ఇరు శాఖల మధ్య వివాదం నడిచింది. రెండు శాఖల మధ్య తరచూ వివాదంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

రాజ్యాంగ రక్షణకు విద్యార్థులు పోరాడాలి

- సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్

తార్నాక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పార్టీలు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను విచ్ఛిన్నం చేయాడానికి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు విద్యార్థులు ఉద్యమించాలని సెఫాలజిస్ట్, రాజకీయ నాయకుడు యోగేంద్ర యాదవ్ అన్నారు. "భారతదేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు సవాళ్లు - పౌర సమాజం బాధ్యత" అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ వామపక్ష, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆర్ట్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగేంద్ర యాదవ్ మాట్లాడారు. భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడటం, సమానత్వం, సంపద పంపిణీ, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండటమే నిజమైన ప్రజాస్వామ్యం అని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జరిగే ఉద్యమాల్లో విద్యార్థులతో పాటు, ప్రతి పౌరుడు చురుగ్గా పాల్గొనాలని కోరారు.

తెలుగు అసోసియేషన్ మెగా కన్వెన్షన్‌కు రండి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందించిన టీటీఏ బృందం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తెలుగు అసోసియేషన్(టీటీఏ) మెగా కన్వెన్షన్‌కు రావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఆ సంఘం ప్రెసిడెంట్, క్వాడ్రెంట్ టెక్నాలజీ సీఈవో వంశీరెడ్డి కంచరకుంట్ల ఆధ్వర్యంలో టీటీఏ ప్రతినిధులు సీఎం నివాసంలో రేవంత్‌తో శనివారం భేటీ అయ్యారు. మే 24 నుంచి 26 వరకు అమెరికాలోని సియాటెల్‌లో టీటీఏ మెగా కన్వెన్షన్‌ను నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి హాజరవ్వాలని కోరుతూ ఆహ్వానాన్ని అందించారు.

రాష్ట్రంలో కోర్టుల డిజిటలైజేషన్‌కు యత్నం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే


నల్లగొండలో ఐదు కోర్టుల భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో అన్ని జిల్లా కోర్టుల డిజిటలైజేషన్‌కు ప్రయత్నిస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన అధునాతన ఐదు కోర్టుల భవనాల సముదాయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 100 శాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయవ్యవస్థ ముందుకు సాగుతోందన్నారు. మౌలిక సదుపాయాలు, అన్ని రకాల సౌకర్యాల కల్పనతో పాటు న్యాయవాదులు, న్యాయాధికారులకు ఎప్పటికప్పుడు సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

24 నుంచి ఇంటర్ వొకేషనల్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ వొకేషనల్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు మే 24వ తేదీ నుంచి జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల దాకా సెకండియర్ వొకేషనల్ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలు మే 24న ప్రారంభమై 30వ తేదీన ముగియనున్నాయి. ఇక వొకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు మే 31, జూన్ 1వ తేదీన జరుగుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి తెలిపారు.

రైస్‌మిల్లర్లకు జరిమానా!

- సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లకు 125శాతం ఫైన్

గత వాన కాలానికి సంబంధించిన సీఎంఆర్ పెండింగ్ పై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ప్రయోగించి మిల్లర్ల నుంచి పెండింగ్ సీఎంఆర్‌కు సంబంధించిన డబ్బులు వసూలు చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గత వానాకాలం సంబంధించి 2.49 లక్షల సీఎంఆర్ మిల్లర్ల నుంచి సివిల్ సప్లైస్‌కు రావాల్సి ఉంది. సీఎంఆర్‌పై కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరతో పాటు 125 శాతం ఫైన్ వేయడం, అలాగే ఏడాదికి 12 శాతం వడ్డీతో సహా మిల్లర్ల నుంచి వసూలు చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆయా జిల్లా కలెక్టర్లు సివిల్ సప్లై జిల్లా అధికారులు పెండింగ్ సీఎంఆర్ ఉన్న మిల్లర్ల నుంచి ఈ నిధులను 60 రోజుల్లో వసూలు చేయాలని సూచించారు.

మోదీకి ఓటేస్తే వినాశనమే

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత విద్యుత్తు పథకానికి మీటర్లు బిగించాలని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం కోరింది. అందుకు నేను వ్యతిరేకించినందుకే కక్ష కట్టారు. తెలంగాణ ఆకాంక్షలను ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను ఏనాడూ పట్టించుకోని నరేంద్రమోదీకి మళ్లీ ఓటేస్తే తెలంగాణకు వినాశనం తప్పదు" అని కేసీఆర్ వివరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుపై గులాబీ బాస్ విరుచుకుపడ్డారు. "అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వంగా నిరూపితమైంది. వేసవిలో ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందించలేని దుర్మార్గమైన ప్రభుత్వం రాష్ట్రంలో ఉండటం దురదృష్టకరం. మా ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా కేవలం రూపాయికే నీటి కనెక్షన్లిచ్చాం. రక్షిత తాగునీటిని అందించాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఎందుకు జరుగుతోంది?" అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన గ్యారెంటీలు ఏవీ సక్రమంగా అమలు కావడంలేదన్నారు. "ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం పథకం ఏమైంది? విద్యార్థినులకు స్కూటీల పంపిణీ ఎంత వరకు వచ్చింది?" అని నిలదీశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పెన్షన్‌గా రైతుబంధు డబ్బులు ఖాతాలో జమ అయ్యేవని.. ఇప్పుడాపరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో అమలైన పథకాలను కూడా కొనసాగించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. సమర్థంగా పాలనను కొనసాగించలేని ముఖ్యమంత్రి.. చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తనను అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారని.. ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో తిరిగి రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి.. తెలంగాణకు మేలు చేకూర్చేందుకు గుండెలో ప్రాణం ఉన్నంత వరకు ప్రయత్నిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో మైనార్టీ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, సెక్యులర్ భావాలు గల బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే వారి ప్రయోజనాలను కాపాడేందుకు అహర్నిషలు కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాల గురించి మాట్లాడాలంటే దినమంతా సరిపోదని, తాగునీటి సంగతి దేవుడెరుగు తమ ప్రభుత్వ హయాంలో కరెంటు పోయేది సంచలనమేనని, ప్రస్తుతం వచ్చేది విశేషమైపోయిందన్నారని కేసీఆర్ విమర్శించారు. రోడ్‌షోలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రిజనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

ఇస్మార్ట్ కేసీఆర్..!

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సామాజిక మాధ్యమాల్లోకి అడుగుపెట్టారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఖాతాలను ప్రారంభించారు. 24 ఏళ్ల క్రితం(2011 ఏప్రిల్ 27న) హుస్సేన్‌సాగర్ తీరంలోని జలదృశ్యంలో బీఆర్‌ఎస్(అప్పట్లో టీఆర్‌ఎస్) ఆవిర్భావ సభ ఫొటోను ఎక్స్, ఇన్‌స్టాలో షేర్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత మరో రెండు ట్వీట్లు చేయగా.. చివరి పోస్టు విద్యుత్తు అంతరాయాలకు సంబంధించినది. "బస్సు యాత్రను దిగ్విజయం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమాన ప్రజలందరికీ అభినందనలు, ధన్యవాదాలు" అంటూ రెండో ట్వీట్ చేశారు. మూడో ట్వీట్‌లో.. "తెలంగాణలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి.. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది. ప్రతి రోజూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంటు పోవడంలేదని ఊదరగొడుతున్నారు. నాతో పాటు ఉన్న మాజీ శాసన సభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కేసీఆర్‌ది అసత్య ప్రచారం: భట్టి

కరెంట్ కట్‌పై కేసీఆర్‌ది అసత్య ప్రచారమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ ఆరోపణపై అధికారులతో విచారణ జరిపించగా.. అవాస్తవమని తేలిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంటికి నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరిగినట్లు తెలిపారు. మాజీ సీఎం నిద్ర లేచింది మొదలు అభూతకల్పనలు, అవాస్తవాలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. 'సూర్యాపేటలోనూ ఇదే విధంగా విద్యుత్తు శాఖను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నం చేశారు. బీఆర్‌ఎస్ మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో అసత్యాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి అసత్యాలను చట్టప్రకారం ఎదుర్కొంటాం' అని వివరించారు. కాగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంటి పరిసరాల్లో కరెంట్ కట్ జరగలేదని దక్షిణ డిస్కమ్ మహబూబ్‌నగర్ ఎస్ఈ(ఆపరేషన్స్) తెలిపారు.

రాజీనామా లేఖతో
రేవంత్ రాలేదేం?

- స్పీకర్ ఫార్మాట్‌లోనే నా రాజీనామా : హరీశ్

సిద్దిపేట/కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను టచ్ చేసుడు కాదు, ఆరు గ్యారెంటీలను టచ్ చేసి ప్రజలకు అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు నినాదంతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట, కరీంనగర్‌లలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15లోగా రుణమాఫీతో పాటు ఆరు గ్యారెంటీలను రేవంత్ రెడ్డి అమలు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న తన సవాల్‌కు కట్టుబడి ఉన్నానని చెప్పారు. రాజీనామా లేఖతో తాను గన్‌పార్కు వద్దకు వెళ్తే, అక్కడకు రాకుండా సీఎం రేవంత్ రెడ్డి డొంకతిరుగుడు మాటలు చెబుతున్నారని విమర్శించారు. సరైన పద్ధతిలోనే స్పీకర్ ఫార్మాట్‌లో తన రాజీనామా పత్రం ఉందని చెప్పారు. రేవంత్ రెడ్డి మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కొత్త జిల్లాల రద్దుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఇందులో మొదటగా సిద్దిపేట జిల్లాను తొలగించాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని, జిల్లాల రద్దుపై కాంగ్రెస్ సర్కారు వెనక్కి తగ్గకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

సీఎం జిల్లాలోనూ కాంగ్రెస్ గెలవదు

- అందుకే ఇన్‌చార్జి పదవి నుంచి రేవంత్ వైదొలిగారు : కేటీఆర్


ఎర్రగడ్డలో కేటీఆర్ ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం సొంత జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ గెలవడం కష్టమేనని, అందుకే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి రేవంత్ తప్పుకొన్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రానున్న రోజుల్లో రేవంత్ రెడ్డి కచ్చితంగా బీజేపీలో చేరుతారని పునరుద్ఘాటించారు. ఇప్పటికే తాను 20 సార్లు ఈ విషయాన్ని చెప్పినా ఆయన ఎందుకు స్పందించడం లేదంటే.. అర్థమేంటని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ మోసం పార్ట్-1ను ఎంచుకున్న రేవంత్.. ఇప్పుడు మోసం-2ను ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఆగస్టు 15లోగా రుణ మాఫీ పేరుతో రేవంత్ రెడ్డి మరోసారి రైతుల్ని మోసం చేసి పని పెట్టుకున్నాడని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. కాంగ్రెస్ చెప్పిన మాటలు నమ్మి మోసపోయామని ప్రజలందరికీ అర్థమైందని తెలిపారు. మరో సారి మోసపోకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. రేవంత్‌రెడ్డిది మాట నిలుపుకొన్న చరిత్ర కాదని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని మాట తప్పారని గుర్తు చేశారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలను 250 రోజులైన తర్వాత కూడా అమలు చేయనందునే రేవంత్ స్పందించాలని హరీశ్‌రావు నిలదీశారని అన్నారు. దమ్ముంటే హరీశ్‌రావు విసిరిన రాజీనామా సవాల్‌కు సీఎం స్పందించాలన్నారు. తమకు ఉన్న సమాచారం మేరకు ఏపీలో జగన్మోహన్‌రెడ్డి గెలిచే అవకాశం ఉందని తెలిపారు. మల్కాజ్‌గిరికి సంబంధించి మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు వ్యూహాత్మకమేనని, ఈటల రాజేందర్‌ను మునగ చెట్టు ఎక్కించారని చెప్పారు. ఆ మాటల వెనుక అంతరార్థం తెలియక చాలా మంది ఆగమాగమైతున్నారని ఎద్దేవా చేశారు.

మూసీపై మెట్రో వంతెన!

- పిల్లర్ల మధ్య ఎక్కువ దూరంతో సవాలే..
- బైరామల్‌గూడ-సాగర్ జంక్షన్‌లో మరింత ఎత్తులో ఎలివేటెడ్ కారిడార్
- ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను పరిశీలించిన ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రెండో దశ మెట్రో పనుల్లో భాగంగా మూసీ నదిపై మెట్రో వంతెనను నిర్మించాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు పరిశీలనలో గుర్తించారు. ఈ బ్రిడ్జి పిల్లర్లను ఒకదానికొకటి మధ్య ఎక్కువ గ్యాప్‌తో నిర్మించాల్సి ఉంటుందని.. ఇది సవాల్‌తో కూడుకున్నదని భావిస్తున్నారు. బైరామల్‌గూడ-సాగర్ జంక్షన్‌లో ఇప్పటికే ఫ్లై ఓవర్లున్న నేపథ్యంలో అక్కడ వాటి కంటే మరింత ఎత్తులో మెట్రో లైన్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండో దశ 70 కిలోమీటర్ల పనులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనలు చకచకా జరుగుతున్నాయి. ఆయా కారిడార్లలోని రూట్‌మ్యాప్‌ను ఇప్పటికే ఖరారు చేసిన నేపథ్యంలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారు చేసేందుకు మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సర్కారు నివేదిక అందజేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలు, స్టేషన్ల నిర్మాణాలు, తదితర అంశాలను హెచ్ఏఎంఎల్ అధికారులు క్షుణ్ణంగా తెలుసుకుంటున్నారు. ప్రధానంగా నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు కారిడార్‌ను అత్యంత పటిష్ఠంగా చేపట్టేందుకు అడుగులు వేస్తున్నారు. శనివారం హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో సీఈఈ డీవీఎస్ రాజు, సీఎస్‌టీఈ ఎస్‌కే దాస్, సీపీఎం ఆనంద్‌మోహన్ తదితరులు, సిస్ట్రా ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ నిపుణులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సుమారు 14 కిలోమీటర్ల వరకు కాలినడక చేపట్టి పలు అంశాలను గుర్తించారు. మూసీ నది ప్రక్షాళన, అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఇక్కడ జాగ్రత్తగా పనులు చేపట్టాలని నిర్ణయించారు. మూసీపై మెట్రో వంతెనను నిర్మించాలని.. ఇది సవాల్‌తో కూడుకున్నదని గుర్తించారు. మూసీ దాటిన తర్వాత కొత్తపేట జంక్షన్ నుంచి వచ్చే రహదారికి అనుసంధానించడంతోపాటు స్థానికుల కోసం అదనపు స్టేషన్ ఏర్పాటు విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే బైరామల్‌గూడ-సాగర్ జంక్షన్‌లో ఇప్పటికే ఫ్లై ఓవర్లున్న తరుణంలో అక్కడ వాటి కంటే మరింత ఎత్తులో మెట్రో లైన్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలోని మెట్రోస్టేషన్ ఎత్తును తగ్గించేందుకు గాను, మెట్రో అలైన్‌మెంట్‌ను ఫ్లై ఓవర్లకు కుడి వైపునకు మార్చాల్సి ఉంటుందని గుర్తించారు. ఇక చాంద్రాయణగుట్ట ఇంటర్‌చేంజ్ స్టేషన్ నిర్మాణానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశముందని భావిస్తున్నారు.

'అలెన్' ఆస్తి నష్టం రూ. 25కోట్లు!

- 24 గంటలు గడిచినా అదుపులోకి రాని మంటలు
- మంటల్లో కాలి నేలమట్టమైన పరిశ్రమ భవనం

షాద్‌నగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అలెన్ హోమియో, హెర్బల్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో శుక్రవారం చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాదంతో రూ.25 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని పరిశ్రమ యాజమాన్యం పేర్కొంది. రంగారెడ్డి జిల్లా నందిగామలో ఉన్న ఈ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం చెలరేగిన మంటలు శనివారం సాయంత్రానికి కూడా అదుపులోకి రాలేదు. 20 ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగి 24 గంటలు గడుస్తున్నా మంటలు అదుపులోకి రాకపోవడంతో అందుకు గల కారణాలపై అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ ప్రమాదంలో పరిశ్రమ పూర్తిగా కాలిపోయింది. పరిశ్రమలోని రేకుల షెడ్డులో తొలుత అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడి నుంచి మంటలు పక్కన ఉన్న భవనానికి వ్యాపించాయి. పరిశ్రమలోని మూడు అంతస్థుల భవనం మంటల్లో కాలిపోయి నేల మట్టమైంది. దీంతో పరిశ్రమపై ఆధారపడ్డ 450 మంది ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలు తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఈ నెల జీతాలైనా వస్తాయో ? లేదో ? అనే ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారు. కాగా, అలెన్ పరిశ్రమలో మంటలు అదుపులోకి రాకపోవడంతో పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న వారు తమ ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. యాజమాన్యం నిర్లక్ష్యమే అగ్ని ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.


పూర్తిగా కాలిపోయిన పరిశ్రమలోని షెడ్

సబ్జెక్టు లేని మంత్రి కోమటిరెడ్డి

- తన వద్ద 22 మంది ఎమ్మెల్యేలున్నారని... కేసీఆర్‌తో మాట్లాడాలని రాయబారం పంపారు:కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: మంత్రి కాగానే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అహం పెరిగిందని, మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. క్యాబినెట్‌లో సబ్జెక్ట్ లేని మంత్రి వెంకట్‌రెడ్డి ఒక్కరేనని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావుపై ఆయన చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కరీంనగర్‌లో శనివారం కౌశిక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తన వద్ద 22 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, కేసీఆర్‌తో మాట్లాడితే తానే సీఎం అవుతానంటూ ఒక వ్యక్తితో స్వయంగా తనకు రాయబారం పంపారని తెలిపారు. ఆయన పూటకో మాట మాట్లాడుతారని తెలిసి పెద్దగా పట్టించుకోలేదని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మానసిక పరిస్థితి సరిగా లేదని, ఆయనకు ఆస్పత్రిలో చికిత్స చేయించాల్సి ఉందని అన్నారు. హరీశ్‌రావును చూసి మంత్రి వెంకట్‌రెడ్డి పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆరు గ్యారెంటీలను అమలు చేసే సత్తా ఉంటే రాజీనామా సవాళ్లను ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెడితేనే.. ఆరు గ్యారెంటీలను రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని అన్నారు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
దృశ్యం
ఆదివారం
28 ఏప్రిల్ 2024



అనుకున్నదొకటి... అయినది ఒకటి అన్నట్లైంది వేసవి రిలీజ్‌ల విషయంలో టాలీవుడ్ పరిస్థితి. ఈసారి వేసవికి కుమ్మేద్దాం, బాక్సాఫీసును దున్నేద్దాం అనుకున్నాయి చిత్రబృందాలు. కానీ బాక్సాఫీసు బరిలోకి దిగేందుకు కర్చీఫ్ వేసినా తీరా వెనక్కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.



వేసవి వద్దు వాయిదా ముద్దు

తాటి ముంజలు, మామిడిపండ్ల మధురిమతో పాటు పోటాపోటీగా విడుదలయ్యే సినిమాలతో వేసవి ప్రేక్షకులకు చక్కని వినోదం పంచుతుంది. అయితే ఈ ఏడాది వేసవి సీజన్ మాత్రం బాక్సాఫీసు దగ్గర నిస్సారమైంది. మండే ఎండలు, సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్ వినోదం, సినిమా సిద్ధమవకపోవడం... వెరసి టాలీవుడ్ అంతా వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఫలితంగా సినిమాలు బరిలోకి దిగినట్టే దిగి వెనుకంజ వేయాల్సివస్తోంది. ఎప్పటిలానే ఈ ఏడాది కూడా వేసవిలో బరి లక్ష్యంగా పలువురు అగ్రహీరోలు తమ చిత్రాలతో సిద్ధమయ్యారు. కానీ రకరకాల కారణాలతో వెనక్కు తగ్గాల్సి వచ్చింది. అయితే ఇది ఒక్క తెలుగు సినిమాలకు మాత్రమే పరిమితమవలేదు. ఇతర పరిశ్రమల్లోనూ పలు సినిమాలు వాయిదా బాట పట్టాయి.

మే నుంచి జూన్‌కు కల్కి

కొన్ని సినిమాలు షూటింగ్ పెండింగ్ ఉండడం వల్ల విడుదల తేదీలు వెనక్కు జరపాల్సి వచ్చింది. ఈ సమస్యతోనే 'కల్కి 2898 ఏడీ' ముందు ప్రకటించిన తేదీన కాకుండా కొత్త తేదీకి మారాల్సి వచ్చిందనేది టాక్. భారీ అంచనాలతో వస్తున్న ఈ సినిమాను వేసవి బరిలో దింపాలనే ఆలోచనతోనే నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ముందుగానే తేదీని ప్రకటించింది. మే 9న విడుదల





చేస్తున్నట్లు ప్రకటించారు. విడుదలకు ఇంకొన్ని రోజులు ఉందనగా మే నుంచి జూన్ చివరకు రిలీజ్ డేట్ మారింది. అంటే దాదాపు రెండు నెలలు వెనక్కు వెళ్లినట్లే.

కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రం కూడా ఏప్రిల్ నెలలోనే రావాల్సి ఉంది. ఈ నెల 5నే తొలి భాగాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం అవ్వడం, షూట్ మధ్యలో విలన్ పాత్రధారి సైఫ్ అలీఖాన్ గాయపడడంతో ఆ తేదీకి రిలీజ్ చేయడం సాధ్యపడలేదు. దాంతో వేసవికి అనుకున్నది కాస్తా ఆరు నెలలు వాయిదాపడి దసరా సందర్భంగా అక్టోబర్ 10న 'దేవర' చిత్రం వస్తోంది. ఏప్రిల్ 5న 'దేవర' రాకపోవడంతో విజయ్ దేవరకొండ అదే తేదీన 'ఫ్యామిలీస్టార్' చిత్రంతో థియేటర్ల దగ్గర సందడి చేసిన విషయం తెలిసిందే.

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'ను కూడా మార్చి 8న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకున్నారు. కానీ చిత్రీకరణ పూర్తవకపోవడంతో ఆ తేదీకి తీసుకురాలేకపోయారు. జూన్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక చిన్న, మీడియం రేంజ్ సినిమాల గురించి చెప్పేదేముంటుంది. అవి



కూడా వాయిదా బాట పట్టాయి. పెద్ద సినిమాలు లేకపోతే థియేటర్లలో చిన్న సినిమాలు సందడి చేయాలి. కానీ ఇన్ని ప్రతికూలతల మధ్యన విడుదలైనా ప్రేక్షకాదరణ కష్టమని భావించి చిన్న సినిమాల నిర్మాతలు వెనుకంజవేశారు.

మిడ్‌రేంజ్‌దీ అదే బాట

కొంచెం గ్యాప్ తర్వాత నవదీప్ హీరోగా వస్తున్న చిత్రం 'లవ్ మౌళి'. ఈ నెల 19న ఈ సినిమా విడుదలవ్వాల్సి ఉండగా వాయిదా పడింది. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ మూవీ 'లవ్ మీ'. ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఐపీఎల్, ఎన్నికల వేడి నేపథ్యంలో ఒక నెల ఆలస్యంగా మే 25న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 'పలాస' ఫేం రక్షిత్ అట్లూరి కథానాయకుడిగా నటించిన 'శశివదనే' చిత్రం కూడా ఈ నెల 5న రావాల్సింది. తర్వాత 19కు మారి, ఆపై వాయిదా పడింది. నారా రోహిత్ కమ్‌బ్యాక్ మూవీ 'ప్రతినిధి 2'. ఈ నెల 25న విడుదలవాల్సి ఉండగా వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అలాగే 26న విడుదలవ్వాల్సిన చిన్న చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే' కూడా వాయిదా పడింది.

డబ్బింగ్ సినిమాలూ వాయిదా

స్ట్రెయిట్ చిత్రాలకు ధీటుగా పలు పరభాషా చిత్రాలు కూడా ఈ వేసవి బరిలో నిలిచాయి. కొన్ని డబ్బింగ్ చిత్రాల కోసం తెలుగు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ జాబితాలో ముందు వరుసలో ఉన్నది విక్రమ్ 'తంగలాన్' చిత్రం. ప్రచార చిత్రాల్లో గిరిజన నాయకుడి పాత్రలో విక్రమ్ నటన ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. పా. రంజిత్ దర్శకుడు. తొలుత ఈ సినిమాను జనవరి 26న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఏప్రిల్ 12న కొత్త డేట్‌ను ఖాయం చేశారు. కానీ ఆ తేదీకీ సినిమా రాలేదు. వాయిదాకు గల కారణాలపై చిత్రబృందం ఎక్కడా స్పందించలేదు. ఇప్పటివరకూ కొత్త తేదీని కూడా ప్రకటించిందీ లేదు.

సూర్య నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'కంగువ'ను కూడా వేసవి బరిలో దింపాలనుకున్నారు. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలకు అనుకున్నదానికన్నా చాలా ఎక్కువ సమయం పట్టడంతో ఏకంగా ఈ ఏడాది చివరకు మారింది. శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి.



తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో భారీ చిత్రం 'ఇండియన్ 2'. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా వచ్చిన 'ఇండియన్'కు ఇది సీక్వెల్. గతేడాది దసరా, దీపావళికే ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేసింది. అనేక ఆటంకాలతో చిత్రీకరణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. దీంతో ఈ ఏడాది వేసవికి రిలీజ్ చేస్తామని నిర్మాణ సంస్థ లైకా తెలిపింది. కానీ విజువల్ ఎఫెక్ట్స్ పూర్తవకపోవడంతో చివరకు జూన్‌లో విడుదల చేస్తామని ప్రకటించారు కానీ తేదీ మాత్రం ఖరారు చేయలేదు. ఈ సినిమా ప్రభావం రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' షూటింగ్ పైన పడింది. ఈ చిత్రానికి కూడా శంకర్ దర్శకుడు కావడం, ఆయన రెండు పడవల ప్రయాణం వల్ల చిత్రీకరణ అనుకున్న విధంగా సాగలేదు. దాంతో 'గేమ్ ఛేంజర్' వేసవికి రాలేకపోయాడు. ఈ సినిమా సెప్టెంబర్, అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు రావొచ్చని డాక్టరేట్ అందుకున్న సందర్భంలో రామ్ చరణ్ చెప్పారు. తమన్నా, రాశీ ఖన్నా నటించిన 'అరణ్మనై 4' చిత్రం తెలుగులో 'బాక్' పేరుతో విడుదలవుతోంది. ఈ చిత్రం కూడా వారం ఆలస్యంగా మే 3న థియేటర్లలోకి వస్తోంది. ఈ తేదీన రావాల్సిన సత్యదేవ్ 'కృష్ణమ్మ' చిత్రం వారం వెనక్కి జరిగి మే 10న విడుదల అవుతోంది.

శ్రుతి హాసన్, శంతను బ్రేకప్?



సెలబ్రిటీల ప్రొఫెషనల్ లైఫ్ కంటే వ్యక్తిగత జీవితాల్లోని విషయాలే ఎక్కువగా జనాకర్షణ పొందుతుంటాయి. ఈ కోవలో తాజాగా కమల్ హాసన్ కూతురు, ప్రముఖ నటి శ్రుతి హాసన్ కూడా చేరారు. శ్రుతి కొన్నాళ్లుగా చిత్రకారుడు శంతను హజారికాతో లవ్‌లో ఉందని, నాలుగేళ్లుగా ఇద్దరు కలసి సహజీవనం కూడా చేస్తున్నారనే గాసిప్స్ సినీ వర్గాల్లో చాలా కాలం నుంచి చక్కర్లు కొడుతున్నాయి. వీటికి ఊతమిస్తూ ఇద్దరూ కలసి బయట తిరగడం వారి రిలేషన్‌పై వస్తున్న ఊహాగానాలకు మరింత బలాన్ని పెంచాయి. కానీ సడన్‌గా వీరు విడిపోయారంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. వీరిద్దరూ విడిపోయారని, ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఒకరినొకరు అన్‌ఫాలో చేశారని టాక్. వీటిని నిజం చేసేలా శ్రుతి హాసన్, శంతనుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న ఫొటోలను డిలీట్ చేశారు. ఈ బ్రేకప్ విషయంపై క్లారిటీ కోసం మీడియా శంతనుని ప్రశ్నించగా "నాకు ఆ విషయంపై స్పందించడం ఇష్టం లేదు" అని అన్నారు. శ్రుతి హాసన్ కూడా ఈ విషయంపై మాట్లాడ్డానికి ఇష్టపడలేదు. వీరు నెల క్రితమే విడిపోయారని, ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నారని తెలుస్తోంది. కాగా, ఈ ఏడాది ఆరంభంలో హజారికాను శ్రుతి భర్తగా ఇన్‌స్టాగ్రామర్ ఒక్రీ ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించిన శ్రుతి "నేను హజారికాను పెళ్లి చేసుకున్నానని వస్తున్న విషయాల్లో నిజం లేదు. నా జీవితంలో జరిగే ముఖ్యమైన విషయాల్ని చెప్పాలనుకుంటే కచ్చితంగా నేనే స్వయంగా అందరికీ చెప్తాను. నా గురించి ఏమీ తెలియకుండా ప్రచారం చేసే వారు ఆ ప్రయత్నాల్ని ఆపండి" అని పోస్ట్ చేశారు.

అవి చాలా దారుణమైన రోజులు

సినిమా సినిమాకు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటూ నటించిన కొన్ని సినిమాలకే బాలీవుడ్‌లో టాప్ యాక్టర్స్‌లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు మాజీ విశ్వ సుందరి ప్రియాంక చోప్రా. బాలీవుడ్‌లో మంచి అవకాశాలతో కొనసాగే సమయంలోనే ఆమె 2017లో 'బేవాచ్' సినిమాతో హాలీవుడ్‌లోనూ అడుగుపెట్టారు. తాజాగా, ఓ పాడ్‌కాస్ట్‌లో హాలీవుడ్‌లోకి ఎంటర్ అయిన తొలినాళ్లలో తనకెదురైన అనుభవాలను ప్రియాంక పంచుకున్నారు.

"హాలీవుడ్‌లో నేను ఎంటర్ అయ్యే సమయానికి ఇండియాలో నేను మోస్ట్ బిజియెస్ట్ యాక్టర్‌ను. కెరీర్ పీక్ టైమ్‌లో నేను బాలీవుడ్‌ను వదిలి హాలీవుడ్‌లో అడుగు పెట్టా. హాలీవుడ్‌లో నా నటనా ప్రస్థానం ఎర్ర తివాచీ పరిచినంత ఆహ్లాదకరంగా ఏమీ సాగలేదు. అక్కడ ఎంటర్ అయిన కొన్ని రోజులు ఏమీ తోచేది కాదు. ఒంటరితనం చుట్టుముట్టేది. ఇండస్ట్రీ కొత్త కావడం, పరిచయస్థులు కూడా ఎవరూ లేకపోవడం మూలాన ఆ రోజులు చాలా దారుణంగా ఉండేవి. నా బాధలు, ఆందోళనలు ఎవరితోనూ షేర్ చేసుకునే అవకాశం ఉండేది కాదు. ఈ పరిస్థితులు నన్ను ఓ రకంగా కుంగదీశాయి. నా జీవితంలోనే అత్యంత చీకటి రోజులను నేను ఆ సమయంలోనే గడిపాను. నన్ను హాలీవుడ్ ప్రముఖులు స్టార్‌గా చూసే వారు కాదు. నాకు ప్రమోషన్స్ కూడా ఉండేవి కావు. దీని క్కారణం హాలీవుడ్ ఇండస్ట్రీ నన్ను మళ్లీ నన్ను జీరో నుంచి మొదలు పెట్టాలని బలవంతం చేయడమే. నేను ఈ సవాల్‌కు వెనుకాడలేదు. నా ధైర్యాన్నంతా కూడదీసుకుని ఆ కష్ట కాలాలను ఎదుర్కొన్నాను. నాకు ఏదైనా సమస్యను వెంటనే పరిష్కరించుకోవడం అలవాటు. ఇదే అక్కడ అప్లయ్ చేశా. ఆ రోజులు నాకెన్నో కొత్త జీవిత పాఠాలను నేర్పాయి" అని చెప్పారు. ప్రస్తుతం ప్రియాంక హాలీవుడ్‌లో వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్టైన్‌మెంట్ స్టార్ జాన్ సీనాతో కలిసి 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే యాక్షన్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో త్వరలోనే విడుదల కానున్న 'టైగర్' అనే డాక్యుమెంటరీలో ఓ ఆడపులి పాత్రకు తన గొంతును అందించారు.



"సిటాడెల్' ఇండియన్ వర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు సమంత. నటిగా వరుస సినిమాలతో అభిమానుల్ని అలరించిన సమంత..ఈ మధ్య సరికొత్త పనిలో నిమగ్నమయ్యారు. అదే పాడ్‌కాస్టింగ్. యూట్యూబ్‌లో నిర్వహిస్తున్న ఈ పాడ్‌కాస్ట్‌లో ఆమె తాజాగా అభిమానులు, ఆరోగ్యం గురించి మాట్లాడారు. "నటిగా నాకు ఇంత మంది అభిమానులు సొంతం అవుతారని కలలో కూడా ఊహించలేదు. సినిమాల పరంగా, నా ఆరోగ్యం విషయంలో వారి ఆదరాభిమానాల్ని చూస్తుంటే చాలా ఆనందం కలుగుతుంది. నిజానికి నేను వారిని చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. అలాగే ఎన్నో విషయాల్లో నా అభిప్రాయాలనూ మార్చుకున్నాను. అభిమానుల వల్ల నాకు చాలా విషయాలపై స్పష్టమైన అవగాహన వచ్చింది. ఆ అనుభవాలతోనే నేను ఈ పాడ్‌కాస్టింగ్ మొదలుపెట్టాను. నా మాటలు కొద్దిమందికి ఉపయోగపడినా సంతోషమే. నా సినీ ప్రయాణం మొదలై ఇన్నేళ్లయినా ఇప్పటికీ నా మాటని గౌరవించే అభిమానులు దొరకడం నేను చేసుకున్న అదృష్టం. జీవితంలో మెంటల్ హెల్త్‌కు, శారీరక ఆరోగ్యానికి బ్యాలెన్స్ ఉండాలి. లేకుంటే ఫిట్‌గా ఉండలేం" అని చెప్పారు.




అది నా అదృష్టం

రజనీకాంత్ ఛాన్స్‌ని దక్కించుకున్న చిరంజీవి

అంతవరకు హీరో కృష్ణ చిత్రాల్లో అతిధి పాత్రలు పోషించిన వర్ధమాన నటుడు చిరంజీవి ఆయనతో సమాంతర పాత్రను పోషించిన చిత్రం 'తోడుదొంగలు.' హీరో కృష్ణ అగ్ర కథానాయకుడిగా వెలుగుతున్న రోజులవి. అప్పటివరకు చిన్న హీరోలతోలో బడ్జెట్ సినిమాలు నిర్మించిన నిర్మాత మహేంద్ర కృష్ణ హీరోగా ఓ భారీ సినిమా తీయాలని నిర్ణయించుకున్నారు. కథ కోసం అన్వేషిస్తున్న సమయంలో హిందీ హీరో దేవానంద్‌తో ఆయన సోదరుడు విజయ్ ఆనంద్ రూపొందించిన 'తేరే మేరే సప్నే' చిత్రం నిర్మాతల దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమాలో హేమమాలిని, ముంతాజ్ కథానాయికలు. హీరో కృష్ణకు కూడా ఆ సినిమా బాగా నచ్చింది. తెలుగులో కూడా హేమమాలినినే హీరోయిన్‌గా తీసుకుందామని అనుకొన్నారు. ఆమెతో మాట్లాడారు కూడా. అయితే అది క్లాస్ మూవీ. కృష్ణ లాంటి మాస్ హీరోతో అటువంటి సినిమా తీయడానికి నిర్మాత మహేంద్ర భయపడి వెనుకంజ వేశారు.

ఆ తర్వాత నిర్మాత మహేంద్ర, దర్శకుడు కె.వాసు, రచయిత జంధ్యాల కూర్చుని 'తోడుదొంగలు' కథ తయారు చేశారు. అందులో ఇద్దరు హీరోలు ఉండడంతో కృష్ణ, రజనీకాంత్ కాంబినేషన్ బాగుంటుందని ఆయన డేట్స్ కోసం ప్రయత్నించారు. అయితే ఆ సమయంలో రజనీకాంత్ బిజీగా ఉండి డేట్స్ ఎడ్జెస్ట్ చేయలేక పోయారు. అప్పుడు వారి దృష్టి చిరంజీవి మీద పడింది. అంతకుముందు మహేంద్ర నిర్మించిన 'ఆరని మంటలు' చిత్రంలో హీరోగా నటించిన చిరంజీవి ఈ ఆఫర్ విని ఎగిరి గంతేశారు. ఎందుకంటే ఆ సినిమాలో ఇద్దరు హీరోలకూ సమాన ప్రాధాన్యం ఉంది. ఎదుగుతున్న దశలో ఇటువంటి చాన్సు రావడం అదృష్టమే కదా.


ఈ షూటింగ్ తొలి రోజున హీరో కృష్ణ వేసుకున్న డ్రెస్ కంటే చిరంజీవి డ్రెస్ బాగుంది. అది చూసి కృష్ణ ఏమంటారో అని నిర్మాత మహేంద్ర కొంత కంగారు పడ్డారు. . అయితే కృష్ణ బోళా మనిషి కదా. అసలు పట్టించుకోలేదు. మరో హీరో అయితే పెద్ద గొడవ జరిగేదేమో?. ఈ చిత్రంలో కృష్ణ చిరంజీవి అన్నదమ్ములుగా నటించారు. వారి తండ్రిగా సత్యనారాయణ నటించారు ఈ చిత్ర నిర్మాణంలో జరిగిన ఓ సంఘటన గురించి చెప్పాలి. అదేమిటంటే.. ఇందులో కృష్ణ చిరంజీవి మీద ఒక పాట తీశారు. పాటలో భాగంగా మోటార్ బైక్ మీద చిరంజీవి రకరకాల విన్యాసాలు చేస్తారు. 'మీరు కూడా చేస్తారా' అని దర్శకుడు వాసు అడిగితే 'ఇలాంటివి మనం చాలా చేశాం. చిరంజీవి పైకి రావాల్సిన కుర్రాడు. అతన్ని చేయనివ్వండి' అన్నారు కృష్ణ. ఆయన సహృదయతకు ఇది ఒక నిదర్శనం.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డియర్	తమిళ చిత్రం	ఏప్రిల్ 28
బాయిలింగ్ పాయింట్ 1	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 29
హీరామండి	హిందీ సిరీస్	మే 01
సైతాన్	హిందీ చిత్రం	మే 03
ది ఎ టిపికల్ ఫ్యామిలీ	కొరియన్ సిరీస్	మే 04
అమెజాన్ ప్రైమ్		
ది ఐడియా ఆఫ్ యూ	హాలీవుడ్ మూవీ	మే 2
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది వైల్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 30
జియో సినిమా		
హాక్స్ 3	వెబ్‌సిరీస్	మే 03
వోంకా	హాలీవుడ్ మూవీ	మే 03
ది టాటూయిస్ట్ ఆఫ్ ఆష్‌విజ్	వెబ్‌సిరీస్	మే 03
ఆపిల్ టీవీ ప్లస్		
అకాపుల్కో	వెబ్‌సిరీస్	మే 01







అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో
పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని డా.బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ)- పీహెచ్‌డీ (2023-2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్దేశిత జాతీయ పరీక్ష/సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 28 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com





విభాగాలు-సీట్లు
- ఇంగ్లీష్ 5, కామర్స్ 6, ఎడ్యుకేషన్ 7, కెమిస్ట్రీ 1, మేథమెటిక్స్ 2, ఎకనామిక్స్ 1, హిస్టరీ 2, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 2 సీట్లు ఉన్నాయి.
- నిర్దేశిత జాతీయ పరీక్ష ద్వారా 60 శాతం సీట్లు, సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా 40 శాతం సీట్లు భర్తీ చేస్తారు.

అర్హత: విభాగానికి సంబంధించిన సబ్జెక్టులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. జేఆర్ఎఫ్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/స్లెట్/సెట్/ఎంఫిల్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. వీరికి ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనిని ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్. ఇందులో 50 ప్రశ్నలు ఇస్తారు. రెండో పేపర్ అభ్యర్థి ఎంచుకొన్న విభాగానికి సంబంధించి ఉంటుంది. ఇందులో 100 ప్రశ్నలు ఇస్తారు. యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్ సిలబస్‌ను అనుసరించి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 300. పరీక్ష సమయం మూడు గంటలు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థులు ఇంటర్వ్యూ సమయంలో రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయాలి. ఇంటర్వ్యూకి 30 మార్కులు నిర్దేశించారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 3
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 20 నుంచి
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మే 25
- **వెబ్‌సైట్:** www.braouonline.in

సంస్కృత విశ్వవిద్యాలయంలో
ప్రాక్ శాస్త్రీ ప్రోగ్రామ్

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం - ప్రాక్ శాస్త్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ప్రీ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో సంస్కృత భాషకు సంబంధించిన ప్రాథమిక అంశాలు బోధిస్తారు. అభ్యర్థుల ప్రతిభను అనుసరించి నిబంధనల మేరకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు. మహిళలకు, పురుషులకు విడివిడిగా హాస్టల్స్ ఉన్నాయి.

సీట్ల వివరాలు: మొత్తం 132 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 61, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 12, ఓబీసీ అభ్యర్థులకు 32, ఎస్సీ అభ్యర్థులకు 18, ఎస్టీ అభ్యర్థులకు 9 సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ వివరాలు:
- మొదటి ఏడాది ఫస్ట్ లాంగ్వేజ్ కింద ఇంగ్లీష్, సెకండ్ లాంగ్వేజ్ కింద సంస్కృతం/తెలుగు/హిందీ పేపర్లు; మూడు సంస్కృతం పేపర్లు; మేథమెటిక్స్ 1ఎ, 1బి/యోగా అండ్ మెడిటేషన్/హిస్టరీ; కంప్యూటర్స్ పేపర్లు ఉంటాయి.
- రెండో ఏడాది ఇంగ్లీష్, సంస్కృతం/తెలుగు/హిందీ, సాహిత్యం/వ్యాకరణం/జ్యోతిషం/న్యాయం/అద్వైత వేదాంతం/విశిష్టాద్వైత వేదాంతం/ద్వైత వేదాంతం, రెండు సంస్కృతం పేపర్లు, మేథమెటిక్స్ 2ఎ అండ్ 2బీ/యోగా అండ్ మెడిటేషన్/హిస్టరీ, కంప్యూటర్స్ పేపర్లు ఉంటాయి.
- సంప్రదాయ కోర్సులను సంస్కృతంలో, మోడ్రన్ సబ్జెక్టులను ఇంగ్లీష్‌లో, లాంగ్వేజ్ సబ్జెక్టులను ఆ భాషల్లో బోధిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

అర్హత: ఎస్ఎస్‌సీ/సీబీఎస్ఈ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులు; న్యూఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి పూర్వ మాధ్యమ పూర్తిచేసినవారు; వారణాసిలోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం ఎంట్రెన్స్ ఎగ్జామ్(ఏపీ/తెలంగాణ) ఉత్తీర్ణులు; మహర్షి సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠాన్ నుంచి వేద భూషణ్ సర్టిఫికెట్ పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా చదివినవారికి; ఎన్ఎస్‌యూ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 15 నాటికి 15 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **వెబ్‌సైట్:** nsktu.ac.in

లిటిల్స్



మీకు తెలుసా?


- అంటార్కిటికా, ఆస్ట్రేలియాలో కాకుండా మిగతా ప్రపంచంలో 285 రకాల ఉడుతలున్నాయి. కొన్ని చెట్లమీద, నేలమీద బతుకుతాయి. ఎగిరే ఉడుతలు కూడా ఉంటాయి.
- వెనక కాళ్లలోని డబుల్ జాయింట్ వల్ల ఇవి వేగంగా చెట్ల మీద పరిగెత్తగలవు. 20 ఫీట్లను సునాయసంగా ఎగరగలవు.
- తన తోటి ఉడుతలను వాసనతో ఎక్కడున్నా కనుక్కోగలవు. వీటి చూపు అద్భుతం.
- ఇవి చాలా తెలివైనవి ఇతర జంతువులను చూసి ఇట్టే నేర్చుకోగలవు.
- తన శరీరానికి 180 డిగ్రీల కోణం ఎగరగలవు.



- చలికాలం కోసం గింజలను దాచుకునే గుణం వీటికి ఉంది.
- తన శరీరం బరువు ఎంత ఉంటే అంత ఆహారాన్ని వారంలో తింటాయి.
- వీటి తోక స్పాంజిలా ఉంటుంది. అయితే చురుగ్గా కదిలేది దానివల్లే. వాన, గాలి, మంచునుంచి తోకతోనే రక్షించుకుంటుంది.
- ఉడుతలు 30 మీటర్ల పైనుంచి దూకినా ఏమీ కాదు. ఎందుకంటే వీటి బరువు తక్కువ. దీంతో పాటు గాలిలో తనకు తాను నియంత్రించుకుంటూ.. భూమ్యాకర్షణకు లోనుకాకుండా పడుతుంది. ఇందుకు ఉడుత శరీరమే కారణం. అందుకే కిందపడినా ఉడుతలు చనిపోవు.
- ఆకులు, ఎండు కొమ్మలతో గూళ్లు కట్టుకుంటాయి.
- ఉడుతలు బ్రతికి ఉన్నంత కాలం వాటి దంతాలు పెరుగుతూనే ఉంటాయి. ఈ దంతాలు 15 సెం.మీ.దాకా పెరుగుతాయి.




ఎంత మంది మనుషులు ఉన్నారు?



దారి కనుక్కోండి

సరైన నీడ ఏది?





7 తేడాలు గుర్తించండి

గాంధీగ్రామ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్‌లో
అకడమిక్ ప్రోగ్రామ్‌లు

దిండిగల్‌లోని గాంధీగ్రామ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్ (జీఆర్ఐ)- అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డీ ఒకేషనల్, బీ ఒకేషనల్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సంస్థ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. వసతి సౌకర్యం ఉంది.



గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు
- **కోర్సులు:** బీకాం, బీబీఏ, బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ(మేథమెటిక్స్/ఫిజిక్స్/ కెమిస్ట్రీ/హోం సైన్స్/టెక్స్‌టైల్ అండ్ ఫ్యాషన్ డిజైన్/జియాలజీ/కంప్యూటర్ సైన్స్/మైక్రోబయాలజీ)
- ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ప్రతి ప్రోగ్రామ్‌లో ఆరు సెమిస్టర్లు ఉంటాయి.
- **అర్హత:** కోర్సును అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

నిర్దేశిత సబ్జెక్టుల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లు
ఎనిమిది సెమిస్టర్ల వ్యవధి గల బీటెక్(సివిల్ ఇంజనీరింగ్), ఆరు సెమిస్టర్ల బీటెక్ సివిల్(లేటరల్ ఎంట్రీ), నాలుగు సెమిస్టర్ల ఎంటెక్(రెన్యూవబుల్ ఎనర్జీ), ఎంసీఏ, ఎంబీఏ, బీఈడీ, ఎంఈడీ; ఎనిమిది సెమిస్టర్ల వ్యవధిగల బీఎస్సీ అగ్రికల్చర్(ఆనర్స్), బీఎస్సీ-బీఈడీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

అర్హత: బీటెక్(సివిల్)లో ప్రవేశానికి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ); ఎంటెక్(రెన్యూవబుల్ ఎనర్జీ)లో ప్రవేశానికి బీఈ/ బీటెక్/ఏఎంఐఈ లేదా(డిప్లొమా/పోస్ట్ డిప్లొమా)(రెన్యూవబుల్ ఎనర్జీ) ఉత్తీర్ణతతోపాటు పీజీ సైన్స్ పూర్తిచేసి ఉండాలి. బీఎస్సీ అగ్రికల్చర్‌కు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, మేథమెటిక్స్/బయోటెక్నాలజీ/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్/హోం సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏలో ప్రవేశానికి మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్, డిగ్రీ; ఎంబీఏలో ప్రవేశానికి డిగ్రీ(ఆర్ట్స్/హ్యూమానిటీస్/సైన్స్/అగ్రికల్చర్/ఇంజనీరింగ్); బీఎస్సీ-బీఈడీకి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి; బీఈడీకి(డిగ్రీ/పీజీ)(మేథమెటిక్స్/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/బయాలజీ/తమిళం/ఇంగ్లీష్); ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ/బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ/బీఈఎల్ఈడీ/డీఈఎల్ఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు
ఎంఏ స్పెషలైజేషన్‌లు: తమిళం అండ్ ఇండియన్ లిటరేచర్, హిందీ, ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేటివ్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్ స్టడీస్, గాంధియన్ స్టడీస్ అండ్ పీస్ సైన్స్, ఎకనామిక్స్
ఎంకాం స్పెషలైజేషన్: కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్
ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్, హోం సైన్స్ అండ్ కమ్యూనికేషన్, టెక్స్‌టైల్స్ అండ్ ఫ్యాషన్ డిజైన్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, అప్లయిడ్ జియాలజీ అండ్ జియోమాటిక్స్, జియోఇన్ఫర్మాటిక్స్
- ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ప్రతి ప్రోగ్రామ్‌లో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: సంబంధిత సబ్జెక్ట్‌లతో బీఏ/బీ లిటరేచర్/బీఎస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ డిప్లొమాలు
ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి.
స్పెషలైజేషన్‌లు: స్పేషియల్ టెక్నాలజీస్, అప్లయిడ్ జెరోంటాలజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు, ఎపిగ్రఫీ, యోగ, సస్టయినబుల్ సోషల్ డెవలప్‌మెంట్
అర్హత: స్పేషియల్ టెక్నాలజీకి సైన్సెస్/ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎపిగ్రఫీకి మాత్రం ఎంఏ(తమిళం/హిస్టరీ/సంస్కృతం/ఇండియన్ కల్చర్) పూర్తిచేసిన వారు అర్హులు. పీజీ డిప్లొమా ఇన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సులో ప్రవేశానికి విడిగా నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు
కోర్సులు: ఎంఏ డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ సోషియాలజీ
- ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ప్రతి ప్రోగ్రామ్‌లో పది సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

స్కిల్ బేస్డ్ ప్రోగ్రామ్‌లు
ఆరు సెమిస్టర్ల వ్యవధిగల బీ ఒకేషనల్(ఫామ్ ఎక్విప్‌మెంట్స్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్/ఫుట్‌వేర్ అండ్ యాక్సెసరీస్ డిజైన్/రెన్యూవబుల్ ఎనర్జీ/మల్టీ మీడియా ప్రొడక్షన్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెసింగ్/ఫుడ్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ ఎవల్యూషన్/డెయిరీ ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీ/ఆర్గానిక్ అగ్రికల్చర్ అండ్ ఎంట్రప్రైజెస్ డెవలప్‌మెంట్); రెండు సెమిస్టర్ల వ్యవధి గల డీ ఒకేషనల్(రిజిస్ట్రేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్/సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్), డిప్లొమా(టూ వీలర్ మెకానిజం అండ్ మెయింటెనెన్స్), సర్టిఫికెట్ ఇన్ టూ వీలర్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ యోగా; నాలుగు సెమిస్టర్ల వ్యవధిగల డిప్లొమా (టెక్స్‌టైల్ టెక్నాలజీ/అగ్రికల్చర్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

అర్హత: సంబంధిత గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్సులు
ఎపిగ్రఫీ, ఫోక్ ఆర్ట్స్, న్యూస్ రీడింగ్ అండ్ యాంకరింగ్, ట్రాన్స్‌లేషన్, ఫంక్షనల్ మలయాళం, స్పోకెన్ ఇంగ్లీష్, ఫ్రెంచ్, శాటిలైట్ ఇమేజ్ ప్రాసెసింగ్, క్యాన్సర్ రీహాబిలిటేషన్, జీరియాట్రిక్ కేర్, హోం హెల్త్ ఎయిడ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బయోఫర్టిలైజర్ ప్రొడక్షన్ టెక్నాలజీ, మొబైల్ అప్లికేషన్స్, ఎనర్జీ/ఆడిటింగ్, డిజాస్టర్ మిటిగేషన్ అండ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ఫొటోగ్రఫీ కోర్సులు ఉన్నాయి. వీటికి సంబంధించిన అర్హత వివరాలను త్వరలో ప్రకటిస్తారు.

ఎంపిక
- డిగ్రీ, ఇంటిగ్రేటెడ్, బీఎస్సీ-బీఈడీ, బీటెక్, ఎంటెక్, పీజీ ప్రోగ్రామ్‌లలో సీయూఈటీ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.
- డిప్లొమా, డీ ఒకేషనల్, బీ ఒకేషనల్ ప్రోగ్రామ్‌లలో ఇంటర్ స్థాయి మార్కులు, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.
- పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి.

ముఖ్య సమాచారం
- **వయసు:** 2024 జూలై 1 నాటికి డిగ్రీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు 21 ఏళ్లు; పీజీ డిప్లొమా ఇన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సుకు 25 ఏళ్లు; స్కిల్ బేస్డ్ బీటీసీ, డీటీసీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు 35 ఏళ్లు మించకూడదు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు వయోపరిమితి నిబంధనలు లేవు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.ruraluniv.ac.in

తెలంగాణలో 150 సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పోస్టులు

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పరిధిలోని జూనియర్ విభాగంలో సివిల్ జడ్జీల భర్తీకి హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 2024 సంవత్సరానికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 31 ఖాళీలు; బదిలీల ద్వారా 15 ఖాళీలు; 2024, 2025 సంత్సరాలకు సంబంధించి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన(ఫ్యూచర్/యాంటిసిపేటెడ్) 90 ఖాళీలు, బదిలీల(ఫ్యూచర్/యాంటిసిపేటెడ్) ద్వారా 14 ఖాళీలు భర్తీ చేస్తారు.

పోస్టుల వివరాలు
1. సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(2024 సంవత్సరానికి): **31 పోస్టులు**
2. సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)- బదిలీ ద్వారా భర్తీ(2024 సంవత్సరానికి): **15 పోస్టులు**
3. సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)- బదిలీ ద్వారా భర్తీ(ఫ్యూచర్/యాంటిసిపేటెడ్)(2024, 2025 సంవత్సరాలకు): **90 పోస్టులు**
4. సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)- బదిలీ ద్వారా భర్తీ(ఫ్యూచర్/యాంటిసిపేటెడ్)(2024, 2025 సంవత్సరాలకు): **14 పోస్టులు**

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్స్ డిగ్రీ. మూడేళ్ల పాటు అడ్వకేట్ లేదా ప్లీడర్‌గా ప్రాక్టీస్ చేసి ఉండాలి. తెలంగాణ జ్యుడిషియల్ నియమనిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: అభ్యర్థులు కనిష్ఠంగా 23 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 35 ఏళ్ల కలిగి ఉండాలి. ఆయా కేటగిరీ వర్గాల వారికి వయోసడలింపులు వర్తిస్తాయి.

జీతభత్యాలు: నెలకు జీతం రూ.77,840 నుంచి రూ.1,36,520 వరకు అందుకోవచ్చు.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), రాత పరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500

స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం

దరఖాస్తుకు చివరి తేదీ: మే 17

స్క్రీనింగ్ టెస్ట్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్: జూన్ 8

స్క్రీనింగ్ పరీక్ష తేదీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష): 2024 జూన్ 16

వెబ్‌సైట్: https://tshc.gov.in/

జాబ్ కార్నర్

హెచ్‌యూఆర్‌ఎల్‌లో మేనేజర్లు, ఇంజనీర్లు

న్యూఢిల్లీలోని హిందూస్థాన్ అండ్ రసాయన్ లిమిటెడ్.. ఒప్పంద/రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 80

పోస్టుల వివరాలు
1. మేనేజర్: **17 పోస్టులు**
2. ఇంజనీర్: **34 పోస్టులు**
3. ఆఫీసర్: **14 పోస్టులు**
4. మేనేజర్: **2 పోస్టులు**
5. చీఫ్ మేనేజర్: **2 పోస్టులు**
6. అసిస్టెంట్ మేనేజర్(కాంట్రాక్ట్): **7 పోస్టులు**
7. ఆఫీసర్(కాంట్రాక్ట్): **3 పోస్టులు**



విభాగాలు: కాంట్రాక్ట్స్ అండ్ మెటీరియల్స్, కెమికల్, మార్కెటింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సేఫ్టీ, ఫైనాన్స్, కార్పొరేట్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్స్, లీగల్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్/రాత పరీక్షలు, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలు తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 20

వెబ్‌సైట్: jobs.hurl.net.in/

డైలీ సుడోకు - 293

	4					1		
8	6	7			4	5		
3	5	1		9	8	2		
		2		3			6	
		6	4		5	7		
	1			8		3		
		8	3	4		6	7	5
		5	2			8	3	4
		3					1	

సుడోకు - 292 సమాధానం

4	8	2	9	3	5	1	6	7
1	7	3	6	8	2	9	4	5
6	5	9	1	4	7	2	3	8
2	3	8	4	5	1	7	9	6
9	1	5	8	7	6	4	2	3
7	6	4	2	9	3	8	5	1
8	2	7	5	6	4	3	1	9
5	9	1	3	2	8	6	7	4
3	4	6	7	1	9	5	8	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.